సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 | వెల: ₹ 5.50
సంపుటి: 16 | సంచిక: 141
శుక్రవారం 11-8-2023


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



సింధుకు క్లిష్టమైన 'డ్రా'
ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాజీ విశ్వవిజేతలను 'ఢీ'కొనే అవకాశం -15లో



మూడవసారీ మార్పులేదు
కీలక రెపో రేటు 6.5 శాతంగా యథాతథం.. ఆర్‌బీఐ నిర్ణయం - 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



యుద్ధానికి సిద్ధం కండి
యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ సైన్యాన్ని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ అప్రమత్తం చేసినట్లు మీడియా తెలిపింది.
- వివరాలు 10లో



హవాయి ద్వీపంలో భారీ కార్చిచ్చు
హవాయి దీవుల్లో కార్చిచ్చు వ్యాపించింది. ఈ మంటల్లో చిక్కుకొని మాయి పట్టణంలో 36 మంది సజీవదహనమయ్యారు.
- వివరాలు 10లో



ధైర్యముంటే నిరూపించండి
కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 86 వేల కోట్లు కేంద్రం ఇచ్చిందని బీజేపీ ఎంపీ నిశికాంత్ చెప్పడాన్ని బీఆర్‌ఎస్ ఎంపీలు ఖండించారు.
- వివరాలు 2లో



ఛాయాచిత్రాలు తీసిన ల్యాండర్
చంద్రయాన్–3 మిషన్ చంద్రుడికి చేరువయ్యే సమయంలో ల్యాండర్ మాడ్యూల్‌లోని కెమెరా రెండు ఛాయాచిత్రాలను తీసింది.
- వివరాలు 10లో


జస్టిస్ లక్ష్మణ్


జస్టిస్ సుమలత


జస్టిస్ సుధీర్


జస్టిస్ అనుపమ

నలుగురు రాష్ట్ర హైకోర్టు జడ్జీలు బదిలీ!

కేంద్రానికి సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం - 12లో

సీఈసీ, కమిషనర్ల నియామకంలో

సీజేఐకి అధికారం లేనట్టే!

- నియామక కమిటీలో సీజేఐకి బదులుగా కేబినెట్ మంత్రికి స్థానం
- రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి మేఘ్‌వాల్
- బిల్లు ఆమోదం పొందితే ఎన్నికల సంఘంపై కేంద్రానికి మరిన్ని అధికారాలు - 10లో

అవిశ్వాసం..శుభప్రదం



ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడల్లా మాకు శుభాలే కలుగుతున్నాయి
వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఘన విజయం సాధిస్తాం.. వరుసగా మూడోసారీ మా ప్రభుత్వమే
2028లో అవిశ్వాసం పెడితే నాలుగోసారి కూడా గెలుస్తాం

- లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రసంగం
- అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని సమాధానం
- విపక్షాలు నోబాల్స్ వేస్తుంటే ప్రభుత్వం సెంచరీలు కొడుతోంది
- మణిపూర్‌లో శాంతి కోసం కృషి చేస్తున్నాం
- త్వరలోనే మళ్లీ అభివృద్ధి పథంలో మణిపూర్
- కాంగ్రెస్ నీచ రాజకీయాల వల్లే రాష్ట్రానికి ఈ దుస్థితి
- అహంకారుల కూటమి 'ఇండియా'.. త్వరలో ఆ దుకాణం బంద్

మూజువాణి ఓటుతో వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు తమపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టినప్పుడల్లా శుభాలే కలుగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. అవిశ్వాసం అంటే శుభప్రదం, శుభ సూచకమేనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ ఘన విజయం సాధిస్తామని, వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారు. 2028లో కూడా తమపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. పేదల బిడ్డను ప్రజలు కచ్చితంగా ఆశీర్వదిస్తారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు గురువారం ఆయన సమాధానమిచ్చారు. ప్రతిపక్షాలపై, ముఖ్యంగా కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఇండియా' కూటమి అహంకారులతో నిండిపోయిందని మండిపడ్డారు. అందులో అందరూ పెళ్లికొడుకులేనని ఎద్దేవా చేశారు. మోదీ లోక్‌సభలో 2.10 గంటలపాటు ప్రసంగించారు. మణిపూర్ అంశాన్ని మోదీ ప్రస్తావించినప్పుడు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అసలు విషయం మోదీ మాట్లాడడం లేదని వారు ఆరోపించారు. మణిపూర్‌లో త్వరలోనే శాంతి నెలకొంటుందని ప్రధాని చెప్పారు. ప్రజలపై అరాచకాలకు పాల్పడ్డ దుండగులను శిక్షిస్తామని హామీ ఇచ్చారు. దేశ ప్రజలంతా మిగతా 6వ పేజీలో ▶


సభ నుంచి వాకౌట్ చేస్తున్న విపక్షాలు

మోదీకి కాంగ్రెస్ ఫోబియా

- రావణుడిలా అహంకారి: కాంగ్రెస్
- వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదని జోస్యం
- లోక్‌సభ నుంచి విపక్షాల వాకౌట్

మణిపూర్ అంశంపై మాట్లాడాలని ప్రధానిని కోరాము. ఒక గంటా 45 నిమిషాల ప్రసంగం ముగిసినా మణిపూర్ పేరును ఆయన ప్రస్తావించనేలేదు. ఆయన మొత్తం రాజకీయాలపైనే మాట్లాడారు. మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయడంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ అపసోపాలు పడుతోంది. - వివరాలు 6లో

నిండుసభలో జయలలిత చీర లాగారు..

తమిళనాడు అసెంబ్లీలో నాటి ఘటనను ప్రస్తావించిన నిర్మలా సీతారామన్ -6లో

కాషాయీకరణ 'క్విట్ ఇండియా'

- పాలకుడు ధృతరాష్ట్రుడిలా అంధుడైతే మహిళలను రక్షించేదెవరు?: అధిర్ రంజన్
- సభ నుంచి అధిర్ రంజన్ సస్పెన్షన్ -6లో

పాలమూరుకు లైన్ క్లియర్!

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల మదింపు కమిటీ ఊరట
- పలు షరతులతో పర్యావరణ అనుమతులకు సిఫార్సు
- ముందే పనులు మొదలుపెట్టిన ప్రాజెక్టు అధికారిపై చర్యలకు ఆదేశం
- అనుమతి లేని పనులకు రూ.106 కోట్ల జరిమానా
- పర్యావరణ పునరుద్ధరణ కోసం రూ.153.7 కోట్లతో ప్రణాళిక అమలు చేయాలి - 11లో

బుద్వేల్ 'భూ'మ్!

- భూముల వేలంలో ఏకంగా రూ. 3,625.73 కోట్ల ఆదాయం
- 14 ప్లాట్‌లలో ఉన్న 100 ఎకరాలకు ఆన్‌లైన్ బిడ్డింగ్
- పెద్ద సంఖ్యలో పోటీ పడిన రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు
- గరిష్టంగా ఎకరానికి రూ. 41.25 కోట్లు



సాక్షి, హైదరాబాద్: బుద్వేల్ భూములు భారీ రియల్ బూమ్‌ను సృష్టించాయి. రాజేంద్రనగర్ మున్సిపాలిటీలో ఔటర్‌కు చేరువలో ఉన్న బుద్వేల్ లేఅవుట్ కోసం గురువారం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు భారీ స్పందన లభించింది. రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు పెద్ద ఎత్తున పోటీ పడ్డాయి. ఈ భూములపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించిన తర్వాత కొనుగోలుదారులు మరింత ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 14 ప్లాట్‌లలో ఉన్న 100.01 ఎకరాలకు సుమారు రూ.2,000.20 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, ఏకంగా రూ.3,625.73 కోట్ల ఆదాయం మిగతా 13వ పేజీలో ▶

నేచురల్ డైస్

స్లో ఫ్యాషన్... ఫాస్ట్‌గా!

ఫ్యాషన్







సహజ రంగులు అద్దుకున్న ఫ్యాబ్రిక్ స్కిన్ ఫ్రెండ్లీగా అమరిపోతుంది. ఆ దుస్తుల్లో ఎక్కడ ఉన్నా హుందాతనం కనిపిస్తుంది. అందుకే స్లో ఫ్యాషన్‌గా పేరున్న దుస్తులు ఇప్పుడు ఫాస్ట్‌గా యువతను ఆకట్టుకుంటున్నాయి. టై అండ్ డై తోనూ అట్రాక్ట్ చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని తెలంగాణ క్రాఫ్ట్ కౌన్సెల్‌లో సహజ రంగులతో దారాలను, ఫ్యాబ్రిక్‌ను ఎంత కలర్‌ఫుల్‌గా మార్చేయవచ్చో కళ్లకు కడుతున్నారు.




పోచంపల్లి, ఇకత్, పటోల వంటి.. మన చేనేతల్లో రంగుల వాడకం తెలిసిందే. అయితే ఈ రంగులు అన్నీమొక్కల బెరడు, పండ్లతొక్కలు, ఆకులు, పువ్వులు, వేర్లు.. మొదలైనవాటితో తయారు చేసి, ఆ ప్రింట్లను దుస్తుల మీదకు తీసుకురావడం పెద్ద ప్రక్రియే. కానీ, వీటి వల్ల ప్రకృతికి దగ్గరగా ఉంటాం. పైగా కాటన్ ఫ్యాబ్రిక్, సహజ రంగుల వల్ల సూర్యుని నుంచి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల నుంచి మన చర్మాన్ని కాపాడుకోవచ్చు. డై చేసిన ఈ సహజ రంగులు ఎంతకాలమైనా మన్నికగా ఉండటంతో ఈ కాటన్ వస్త్రాలకు డిమాండ్ కూడా పెరుగుతోంది. మన దేశీయ కళను మరింత విస్తృతంగా కళ్లకు కడుతుంది.

సహజరంగు దారాలు

కాటన్, పట్టుదారాలను ముందుగా రంగులో ఉడికించి, తర్వాత వాటిని నీడలో ఆరబెట్టి, మగ్గం మీద నేయడానికి వాడుతారు. ఈ రంగు దారాలతో చీరలు, ఫ్యాబ్రిక్‌ను తయారుచేస్తారు. సేంద్రీయ రంగులతో తయారైన ఫ్యాబ్రిక్ రంగులు, ప్రింట్స్ కాలక్రమేణా వెలిసిపోతాయి అనుకుంటారు. కానీ, సరైన జాగ్రత్తలతో వేసిన సహజ రంగులు చాలాకాలం పాటు ఉంటాయి. ఫ్యాబ్రిక్ మన్నికను మించి కూడా రంగులు తమ సహజ గుణాన్ని చూపగలవు.

డా. లక్ష్మీ పూజ శంకు టై అండ్ డై, నేచరల్ డైస్‌కు సంబంధించి వర్క్‌షాప్ ద్వారా మరిన్ని వివరాలను మనకు అందించారు.

● ముందు నీళ్లను బాగా మరిగించి, అందులో ఎంపిక చేసుకున్న పువ్వు లేదా బెరడు వంటివి వేసి ఉడికించాలి. పదార్థంలో ఉన్న రంగు అంతా నీళ్లలోకి వచ్చేశాక, వడకట్టుకొని, ఆ నీటిని మళ్లీ మరిగించాలి ● మిషనరీ లేదా మగ్గంపై తయారైన కొత్త క్లాత్‌లో స్టార్చ్, దుమ్ము ఉంటుంది. ఎంపిక చేసుకున్న క్లాత్‌ని ముందుగానే బాగా ఉతికి, ఆరేసి ఉంచాలి ● డిజైన్‌ను బట్టి క్లాత్‌ను మడిచి, గట్టిగా ముడివేసి, ఉడుకుతున్న రంగులో ముంచి, అరగంట ఉంచి, తీసి, తర్వాత నీడలో ఆరబెట్టాలి ● యార్న్ అయినా అదేవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే, రంగు తయారీలో సమయం, పీహెచ్ లెవల్స్ ని పెంచడంలో మరికొన్ని పద్ధతులు ఉన్నాయి. వీటిని అనుసరిస్తే రంగుల్లో రకరకాల షేడ్స్ తీసుకురావచ్చు ● నేచరల్ కలర్స్ అంత ఫాస్ట్ కలర్స్ మరేమీ ఉండవు. ప్రాచీన సౌందర్యం, ఆ హుందాతనం మనల్ని ఎలాగైతే ఆకట్టుకుంటుందో అంత బాగా ఈ సహజ రంగుల అందం కట్టిపడేస్తుంది.

– నిర్మలారెడ్డి

ప్రక్రియలో నేర్పు అవసరం



టై అండ్ డై, యార్న్ డై టెక్నిక్స్‌కు నేచరల్, సింథటిక్ రెండింటికీ వాడచ్చు. మనకు ఎన్ని రంగులు కావాలో ముందు డిసైడ్ చేసుకోవాలి. డైయింగ్ పద్ధతి పూర్తయ్యాకే మనకు కావాల్సిన డిజైన్ వస్తుంది కాబట్టి, టై చేసే విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. దానిమ్మ, బంతిపువ్వు, బీట్‌రూట్, ఆలివ్స్.. ఇలా అన్నింటినుంచి లేత, ముదురు రంగులను సహజంగా తయారు చేసుకోవచ్చు.

– డా. లక్ష్మీ పూజ శంకు
అసిస్టెంట్ ప్రొఫెసర్, జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ



ఆహారాన్ని ఔషధంలా తీసుకోవాలి...లేకపోతే...
ఔషధాలనే ఆహారంగా తీసుకోవాల్సి వస్తుంది.
ఈ సూక్తిలో గొప్ప ఆరోగ్య హెచ్చరిక దాగి ఉంది.
ఆహారంతోనే ఆరోగ్యం... అంటుంది వైద్యరంగం.
ఆహారంలోని ఔషధాన్ని వెలికి తీసి వాడితే...
ఎలా ఉంటుంది? త్రిపుర చేస్తున్న ప్రయత్నమూ అదే.



త్రిపుర

ఆహారంలోనే ఔషధం

'ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగిన వారి కోసం ఒక సమూహాన్ని సంఘటితం చేస్తున్నాను' అంటున్నారు లక్కీ 4 యూ న్యూట్రాస్యుటికల్స్ ప్రతినిధి త్రిపుర. 'ఆహారం అంటే కంటికి ఇంపుగా కనిపించినది, నాలుకకు రుచిగా అనిపించినది తినడం కాదు. దేహానికి ఏమి కావాలో, ఏది వద్దో తెలుసుకుని తినడం. ఈ విషయంలో నాకు స్పష్టత వచ్చేటప్పటికే నా జీవితం భారీ మూల్యాన్ని చెల్లించుకుంది. పీసీఓడీ, ఒబేసిటీ వల్ల పిల్లలు పుట్టడం ఆలస్యమైంది. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్‌లు వేసుకుని జాగ్రత్తలన్నీ తీసుకున్నాం. మా వారికి రక్తం మరీ చిక్కబడడం, బ్లడ్ థిన్నర్స్ వాడినా ఫలితం కనిపించక బ్రెయిన్ స్ట్రోక్ ఆయనను తీసుకెళ్లి పోవడం వంటి పరిణామాలు జరిగిపోయాయి. జీవితం అగమ్యగోచరమైంది. ఆ షాక్‌లో ఉన్న నాకు ఒక వ్యాపకం ఉండాలని మా అన్నయ్య చేసిన ప్రయత్నమే ఇది' అంటూ తాను పరిశ్రమ నిర్వాహకురాలిగా మారిన వైనాన్ని సాక్షితో పంచుకున్నారు త్రిపుర సుందరి.

ఇంటర్నెట్ నేర్పించింది!

"నేను పుట్టింది, పెరిగింది విజయవాడలో. సిద్ధార్థ మహిళా కళాశాలలో బీఏ చేశాను. భర్త, ఇద్దరు పిల్లలతో గృహిణిగా సౌకర్యవంతంగా ఉన్న సమయంలో జీవితం పరీక్ష పెట్టింది. నన్ను మామూలు మనిషిని చేయడానికి మా అన్నయ్య తిరుపతికి తీసుకెళ్లిపోయాడు. ఆస్ట్రేలియాలో కెమికల్ ఇంజనీరింగ్ చేసి తిరుపతిలో న్యూట్రాస్యూటికల్స్ ఎక్స్‌ట్రాక్షన్ యూనిట్ పెట్టుకున్నాడు. నన్ను కూడా ఫార్మారంగంలో పనిచేయమని ప్రోత్సహించాడు. నేను చదివింది ఆర్ట్స్ గ్రూపు. ఫార్మా పట్ల ఆసక్తి లేదనడం కంటే అసలేమీ తెలియదనే చెప్పాలి. కలినరీ సైన్స్ (పాకశాస్త్రం) ఇష్టమని చెప్పాను. ఆ సమయంలో నా మాటల్లో తరచూ మన ఆరోగ్యం మీద ఆహారం ఎంతటి ప్రభావం చూపిస్తుందోననే విషయం వస్తుండేది. మేము ఎదుర్కొన్న అనారోగ్యాలన్నీ ఆహారం పట్ల గమనింపు లేకపోవడంతో వచ్చినవే కావడంతో నా మెదడులో అవే తిరుగుతుండేవి. నాకు అప్పటికి ప్రొటీన్ ఏంటి, విటమిన్ ఏంటనేది కూడా తెలియదు. కానీ ఈ రంగంలో పని చేయాలనుకున్నాను. బ్రాండ్ రిజిస్ట్రేషన్ నుంచి పరిశ్రమ స్థాపనకు అవసరమైన ఏర్పాట్లన్నీ అన్నయ్య చేసి పెట్టాడు. ఈ రంగం గురించిన వ్యాసాలనిచ్చి చదవడమనేవాడు. ఆ తర్వాత నేను ఇంటర్నెట్‌ను కాచి వడపోశాననే చెప్పాలి. ఇప్పుడు సీవోటూ ఎక్స్‌ట్రాక్షన్ ప్రొసీజర్స్ నుంచి కాంబినేషన్‌ల వరకు క్షుణ్ణంగా తెలుసుకున్నాను. నాకు సబ్జెక్టు తెలిసినప్పటికీ సర్టిఫైడ్ పర్సన్ తప్పని సరి కాబట్టి క్వాలిటీ కంట్రోల్ మేనేజర్, ముగ్గురు ఫుడ్ ఎక్స్‌పర్ట్‌లను తీసుకున్నాను.

తేనెతోపాటు ఇంకా...

ఫలానా ఆరోగ్య సమస్యకు ఉదయాన్నే తేనెలో అల్లం రసం కలిపి తినాలి, తేనెతో లవంగం లేదా దాల్చినచెక్క పొడి తీసుకోవాలి. మొలకెత్తిన గింజలను ఉదయం ఆహారంగా తినాలి... ఇవన్నీ ఆరోగ్యకరం అని తెలిసినప్పటికీ ఈ రోజుల్లో వాటిని రోజూ చేసుకునే టైమ్ లేని వాళ్లే ఎక్కువ. కోవిడ్ తర్వాత ప్రతి ఒక్కరూ అంతలా డీలా పడిపోవడానికి కారణం దేహంలో పోషకాల నిల్వలు ఉండాల్సిన స్థాయిలో లేకపోవడమే. అందుకే ఇన్‌ఫ్యూజ్‌డ్ హనీ తయారు చేశాం. అలాగే స్ప్రౌట్స్ తినే వారికి ఉద్యోగరీత్యా క్యాంప్‌లకెళ్లినప్పుడు కుదరదు కాబట్టి డీ హైడ్రేటెడ్ స్ప్రౌట్స్ తీసుకువచ్చాను. ఇలా ప్రతి ఉత్పత్తినీ ఆయుర్వేద వైద్యుల సూచన మేరకు మోతాదులు పాటిస్తూ నేను చేసిన ప్రయత్నాలు విజయవంతం అయ్యాయి. ముంబయిలో ఈ నెల 16 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే 'ఎఫ్ ఐ ఇండియా' సదస్సులో నా అనుభవాలను పంచుకుంటూ ప్రసంగించనున్నాను. దుబాయ్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో కూడా అన్ని దేశాల వాళ్లు స్టాల్ పెడుతుంటారు. గత ఏడాది తెలుసుకోవడం కోసమే వెళ్లాను. నా యూనిట్‌ని ఇంకా ఎలా విస్తరించవచ్చనే స్పష్టత వచ్చింది. ఈ ఏడాది చివరలో దుబాయ్ ఎగ్జిబిషన్ ద్వారా అంతర్జాతీయ వేదిక మీదకు వెళ్లడానికి సిద్ధమవుతున్నాను'' అని వివరించారు త్రిపుర.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఇష్టంగా పనిచేశాను!

నా యూనిట్‌ని మా అన్నయ్య యూనిట్‌కు అనుబంధంగా నిర్మించాం. కాబట్టి ప్రతిదీ తొలి నుంచి నేర్చుకోవాల్సిన అవసరం రాలేదు. కానీ ప్లాంట్ నిర్మాణం నుంచి ప్రతి విషయాన్నీ దగ్గరుండి చూసుకోమని చెప్పడంతో రోజుకు పదమూడు గంటలు పని చేశాను. ఇప్పుడు మూడు షిఫ్టుల్లో పని జరుగుతోంది. యూనిట్ ఎస్టాబ్లిష్ చేస్తున్నప్పుడు ఇంట్లో ఒకవిధమైన ఆందోళన వాతావరణమే ఉండేది. ఈ ప్రయత్నం సక్సెస్ అవుతుందా అనే సందేహం నాతోపాటు అందరిలోనూ ఉండింది. మా అన్నయ్య మాత్రం 'ఏదయితే అదవుతుంది. నువ్వు ముందుకెళ్లు' అనేవాడు. నేను చేస్తున్న పని మీద ఇష్టం పెరగడంతో అదే నా లోకం అన్నట్లు పని చేశాను. మా ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ, జీఎమ్‌పీ, ఐఎస్ఓ వంటి దేశీయ విదేశీ సర్టిఫికేట్‌లు వచ్చాయి. కానీ నేను మా ఉత్పత్తుల అవసరం ఉన్న అసలైన వాళ్లకు పరిచయమైంది మాత్రం ఈ నెల మొదటి వారంలో జరిగిన 'రాయలసీమ ఆర్గానిక్ మేళా'తోనే.




– ఎం. త్రిపుర,
ఆపరేషనల్ మేనేజర్,
లక్కీ 4 యూ

వంటిల్లు

కడుపునిండా తిందాం... బరువు తగ్గించుకుందాం

బరువు పెరగకుండా ఉండేందుకు, పెరిగిన బరువు తగ్గించుకునేందుకు తిండి మానేస్తుంటారు. కానీ తింటూనే బరువు తగ్గాలని డాక్టర్లు సూచిస్తున్నారు. అందుకే కడుపునిండా తింటూ బరువుని తగ్గించుకునే వంటకాలతో ఈ వారం వంటిల్లు...

అప్పం



కావలసినవి: పొట్టు తీసిన పెసరపప్పు – కప్పు ; మినపపప్పు – అరకప్పు ; సోంపు – అరటీస్పూను; అల్లం – అంగుళం ముక్క ; క్యారట్, బీట్ రూట్, ఫ్రెంచ్ బీన్స్, బేబీ కార్న్, పచ్చి బఠాణీ – అన్నీ కలిపి కప్పు; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● పప్పులను శుభ్రంగా కడిగి నానబెట్టుకోవాలి ● నానిన పప్పుల్లో అల్లం, సోంపు కొద్దిగా నీళ్లు వేసుకుని మెత్తగా రుబ్బుకోవాలి ● ఇప్పుడు రుబ్బిన పిండిలో కూరగాయ ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● గుంత పునుగుల ప్లేట్లకి కొద్దిగా నూనె రాసి పిండి మిశ్రమాన్ని అప్పాల్లా వేయాలి ● కొద్దిగా నూనె వేసి రెండువైపులా చక్కగా కాల్చుకుంటే హెల్దీ అప్పం రెడీ.

సొరాటా



కావలసినవి: సొరకాయ లేదా గుమ్మడి తురుము – మూడు టేబుల్ స్పూన్లు; శనగపిండి – రెండు టేబుల్ స్పూన్లు; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; అల్లం తరుగు – టేబుల్ స్పూను; పసుపు – ముప్పావు టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – టీస్పూను; నెయ్యి – టీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సొరకాయ తురుము, శనగపిండి, పుదీనా, అల్లం తరుగులు, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● చివరిగా నూనె వేసి ముద్దలా కలుపుకోవాలి ● ఈ ముద్దను ఉండలుగా చేసి పరాటాల్లా వత్తుకోవాలి ● కొద్దిగా నెయ్యి వేసి రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే సొరాట రెడీ.

మీల్‌మేకర్ మొలకల టిక్కీ



కావలసినవి: మీల్‌మేకర్ – ఒకటిన్నర కప్పులు; పెసర మొలకలు – అరకప్పు; పాలకూర – చిన్నకట్ట ఒకటి; అల్లం – అంగుళం ముక్క; బియ్యప్పిండి – నాలుగు టేబుల్ స్పూన్లు; శనగపిండి – మూడు టేబుల్ స్పూన్లు; ధనియాల పొడి – ఒకటిన్నర టీస్పూను; జీలకర్ర పొడి – టీస్పూను; రాక్ సాల్ట్ – అరటీస్పూను; కొత్తిమీర, పుదీనా తరుగు – అరకప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – టిక్కీ వేయించడానికి సరిపడా.

తయారీ: ● ముందుగా వేడినీటిలో మీల్ మేకర్ వేసి పదినిమిషాలపాటు నానబెట్టాలి.
● నానిన మీల్ మేకర్‌ను మూడుసార్లు నీటితో కడగాలి
● చివరిగా మీల్ మేకర్‌లోని నీటిని పిండి పక్కన పెట్టుకోవాలి
● పాలకూరను శుభ్రంగా కడిగి, మరుగుతోన్న నీటిలో వేసి రెండు నిమిషాలు ఉంచాలి
● రెండు నిమిషాల తరువాత తీసి చల్లని నీటిలో వేసి, నీటిని పిండి పక్కన పెట్టుకోవాలి
● మిక్సీజార్‌లో పుదీనా, కొత్తిమీర, అల్లం వేసి గ్రైండ్ చేయాలి ● ఇవన్నీ నలిగిన తరువాత పెసర మొలకలు వేసి గ్రైండ్ చేయాలి ● చివరగా... నీళ్ల పోయకుండా మీల్‌మేకర్, పాలకూర వేసి గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకుని ధనియాలపొడి, బియ్యప్పిండి, శనగపిండి, జీలకర్రపొడి, రాక్ సాల్ట్, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి పక్కనపెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత పిండిమిశ్రమాన్ని టిక్కీల్లా చేసుకోవాలి ● మీడియం మంటమీద నూనె వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు టిక్కీలను కాల్చుకుని సర్వ్ చేసుకోవాలి.

ఓట్స్ బీట్‌రూట్ పన్నీర్ పరాటా



కావలసినవి: వేయించిన ఓట్స్ – కప్పు; బీట్‌రూట్ ప్యూరీ – కప్పు; పన్నీర్ తరుగు – అరకప్పు; గోధుమ పిండి – అరకప్పు ; జీలకర్ర – అరటీస్పూను; వాము – అరటీస్పూను; కారం – అరటీస్పూను; ఉప్పు – అరటీస్పూను ; నూనె – రెండు టీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో ఓట్స్, బీట్‌రూట్ ప్యూరీ, పనీర్ తరుగు, గోధుమ పిండి, జీలకర్ర, వాము, కారం, ఉప్పు వేసి కలపాలి ● కొద్దికొద్దిగా నీళ్లుపోసుకుంటూ పరాటా పిండి ముద్దలా కలుపుకోవాలి ● ఈ ముద్దను ఉండలుగా చేసుకుని పరాటాల్లా వత్తుకోవాలి ● పరాటాలను రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చుకుంటే పరాటా రెడీ ● పెరుగు లేదా చట్నీతో సర్వ్‌చేసుకోవాలి.

మొలకల డోక్లా



కావలసినవి: శనగ మొలకలు – కప్పు; పాలకూర తరుగు – అరకప్పు; శనగపిండి –రెండు టేబుల్ స్పూన్లు; రాక్ సాల్ట్ – టీస్పూను; నూనె – టేబుల్ స్పూను; నువ్వులు – టీస్పూను ; ఇంగువ – అరటీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు.

తయారీ: ● మొలకలు, పాలకూరను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లపోసి గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకుని..శనగపిండి, రాక్ సాల్ట్ వేసి కలపాలి ● ఈ మిశ్రమాన్ని ప్లేటులో పోసి ఆవిరి మీద పదిహేను నిమిషాలపాటు ఉడికించాలి ● బాణలిలో నూనెవేసి కాగిన తరువాత నువ్వులు, ఇంగువ, కరివేపాకు వేసి వేయించాలి ● ఇప్పుడు ఉడికిన డోక్లాపై ఈ తాలింపుని వేసి, నచ్చిన ఆకారంలో ముక్కలు కోసి సర్వ్ చేసుకోవాలి.

ఓట్స్ స్మూతీ



కావలసినవి: ఓట్స్ –మూడు టేబుల్ స్పూన్లు; వేయించి పొట్టుతీసిన పల్లీలు – పావు కప్పు ; అవిసెగింజలు – టేబుల్ స్పూను; సబ్జాగింజలు – టీస్పూను; దాల్చిన చెక్క – అరంగుళం ముక్క; కర్జూరాలు – నాలుగు; బాగా పండిన అరటి పండు – ఒకటి .

తయారీ: ● ఓట్స్‌ను పదిహేను నిమిషాలు నానబెట్టుకోవాలి ● నానిన తరువాత శుభ్రంగా కడిగి మిక్సీజార్‌లో వేయాలి. దీనిలో కప్పు నీళ్లుపోయాలి ● పల్లీలు, అవిసె, సబ్జా గింజలు, దాల్చిన చెక్క, కర్జూరాలు, అరటిపండు ముక్కలు కూడా వేయాలి ● వీటన్నింటిని చక్కగా గ్రైండ్ చేస్తే స్మూతీ రెడీ.



యాపిల్ సైడర్ వెనిగర్‌లో కొద్దిగా నీళ్లు కలిపి, తలస్నానం చేసిన జుట్టుకు కుదళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. ఇలా చేయడం వల్ల తల స్నానం చేసిన తరువాత కూడా జుట్టుకు పట్టి ఉండే జిడ్డు వదులుతుంది. వారానికి ఒకసారి ఇలా చేయాలి.

బీట్‌రూట్‌తో డే క్రీమ్

● తొక్కతీసిన అరకప్పు బీట్‌రూట్ ముక్కలను గిన్నెలో వేసి అరగ్లాసు నీళ్లపోసి ఐదు నిమిషాలు ఉడికించాలి. తరువాత స్టవ్ ఆపేసి బీట్‌రూట్ ముక్కల్లో టీస్పూను సోంపు వేసి పదినిమిషాలు నానబెట్టాలి. పదినిమిషాల తరువాత బీట్‌రూట్ ముక్కల్లో ఉన్న నీటిని వడగట్టి తీసుకోవాలి. ఈనీటిలో టీస్పూను రోజ్ వాటర్, రెండు టీస్పూన్ల అలోవెరా జెల్ వేసి బాగా కలపాలి.

● ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసుకోవాలి. వారం రోజులపాటు నిల్వ ఉండే ఈ క్రీమ్‌ను రోజూ ఉదయం పూట రాసుకుంటే.. ముఖం మీద మచ్చలు, ముడతలు, డార్క్ సర్కిల్స్ తగ్గుముఖం పట్టి ప్రకాశవంతముగా కనిపిస్తుంది.



ఇలా చేస్తే కనరెక్కదు..



● వంకాయ ముక్కలను కోసిన వెంటనే ఉప్పు నీటిలో వేయాలి.

★★★


● రెండు స్పూన్ల నీటిలో స్పూను పాలు పోసి చక్కగా కలపాలి. ఈ పాల మిశ్రమాన్ని వంకాయ ముక్కలపై చల్లాలి. ముక్కలు చేదుగా మారవు.


★★★

● టేబుల్ స్పూను నిమ్మరసం వేసిన నీటిలో కోసిన వంకాయ ముక్కలు వేస్తే కనరెక్కవు.

★★★

● వంకాయ ముక్కలు లేదా కూరగాయ ముక్కలు వేసే నీటిలో టేబుల్ స్పూను వెనిగర్ వేసి కలపాలి. అప్పుడు కూరగాయ ముక్కలు రంగు మారకుండా ఉంటాయి.




'జల ప్రాజెక్టులపై జనం ఎన్నో
ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం
వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 141

శుక్రవారం 11-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నాలుగో స్థానంపై అనిశ్చితి ఉంది
సమస్య వాస్తవమన్న భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ
- 15లో



ఫ్లోటింగ్ నుంచి ఫిక్స్‌డ్‌కు...!
పెరుగుతున్న వడ్డీ రేట్ల నుంచి రుణ గ్రహీతలకు త్వరలో ఊరట
- 15లో



రాజ్యసభలో తీవ్ర రగడ..
మణిపూర్ అంశంతోపాటు వివాదాస్పద ముఖ్య ఎన్నికల కమిషనర్ బిల్లుపై విపక్షాల ఆందోళనతో రాజ్యసభ అట్టుడికింది.
- వివరాలు 10లో



నిరాయుధీకరణ.. ఎన్నార్సీ అమలు
మణిపూర్‌లో ప్రశాంతతకు పూర్తి స్థాయి నిరాయుధీకరణ అవసరం ఎంతో ఉందని ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలు ప్రధానికి సూచించారు.
- వివరాలు 10లో




'భ్రష్టాచార్ రాక్షస సమితి'
రాష్ట్రంలోని అధికార బీఆర్ఎస్ భ్రష్టాచార్ రాక్షస సమితిగా మారిందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ లోక్‌సభలో ధ్వజమెత్తారు.
- వివరాలు 2లో



విద్వేష రాజకీయాలు దేశానికి చేటు
బీజేపీ దేశంలో విద్వేషం సృష్టిస్తోందని.. ప్రభుత్వ రాజకీయాలు దేశానికి చేటు చేస్తాయని అసదుద్దీన్ హెచ్చరించారు.
- వివరాలు 2లో

వీఆర్‌ఏల విలీనానికి నో

జూనియర్ అసిస్టెంట్లుగా వారి నియామకం చట్టవిరుద్ధం
సర్కారు జారీ చేసిన జీవో 81, 85లను సస్పెండ్ చేసిన హైకోర్టు



- కేటగిరీలుగా ఎలా విభజించారు?.. అర్హతలను ఎలా నిర్ధారించారు?
- ఎంపిక ప్రక్రియ ఏమిటి?.. ఖాళీలు లేవంటూనే ఎలా సర్దుబాటు చేశారు?
- రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ప్రశ్నల వర్షం
- రెవెన్యూశాఖలో జూలై 24కు ముందున్న స్థితి కొనసాగించాలి
- ఇప్పటికే ఎవరైనా విధుల్లో చేరి ఉన్నా వెనక్కి వెళ్లాల్సిందేనని స్పష్టీకరణ
- ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్

గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)లను క్రమబద్ధీకరించి, జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. వీఆర్ఏల నియామకం చట్టవిరుద్ధమని, అది చెల్లదని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 81, 85లను సస్పెండ్ చేసింది. రెవెన్యూ శాఖలో జూలై 24న జీవో 81 జారీకి ముందున్న పరిస్థితినే కొనసాగించాలని స్పష్టం చేస్తూ.. స్టేటస్‌కో ఆదేశాలు ఇచ్చింది. ఎవరైనా వీఆర్ఏలు ఇప్పటికే కొత్త విధుల్లో చేరినా వారు తిరిగి వెనక్కి వెళ్లాలని తేల్చిచెప్పింది. ఇక పిటిషనర్ల విజ్ఞప్తి మేరకు.. ప్రతివాదుల జాబితా నుంచి సీఎం కేసీఆర్, ఎన్నికల సంఘం, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌ను తొలగించింది. వీఆర్ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడంపై వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. వీఆర్ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆఫీస్ సబార్డినేట్లు.. వయసు ఎక్కువున్న వారికి పింఛన్ వంటి ప్రయోజనాలు లేకుండా చేశారని వీఆర్ఏలు ఇలా వివిధ అంశాలపై హైకోర్టులో మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ మాధవీదేవి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు పీవీ కృష్ణయ్య, శ్రీరాం పొలాలి.. ప్రభుత్వం తరఫున

మిగతా 2వ పేజీలో ▶

నచ్చిన వారికి.. నచ్చిన ఉద్యోగాలిస్తారా?

ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు.. ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టింది. వీఆర్ఏలు ప్రభుత్వ ఉద్యోగులు కానప్పుడు.. వారికి ఆ హోదా కల్పించి వేతనాలు ఇవ్వడం ఎలా సమర్థనీయమని నిలదీసింది. ''వీఆర్ఓ వ్యవస్థ రద్దు చేసినప్పుడు వీఆర్ఏలను ఎందుకు కొనసాగించారు? పది, ఇంటర్, డిగ్రీ చేసిన వారిని కేటగిరీలుగా ఎలా విభజిస్తారు? ఎలాంటి ఎంపిక ప్రక్రియ లేకుండా ఎలా నియమిస్తారు? జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఉండాల్సిన అర్హతలు ఏమిటి? వారి ఎంపిక ప్రక్రియ ఏంటి? జూనియర్ అసిస్టెంట్ సమాన స్థాయి కలిగిన విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్వో)లను జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోకి ఎందుకు తీసుకోలేదు? అంటే మీకు నచ్చిన వారికి.. నచ్చిన ఉద్యోగాలు ఇస్తారా? రెవెన్యూ శాఖలో ఖాళీలు లేవంటూనే 50శాతం మందిని ఎలా సర్దుబాటు చేశారు?'' అని కోర్టు ప్రభుత్వాన్ని నిలదీసింది. వీఆర్ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించే అంశంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆదేశాల ప్రతి కోసం ఎదురుచూడకుండా వెంటనే వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో వివిధ చోట్ల పోస్టింగ్ పొందిన వీఆర్ఏలు తిరిగి వెనక్కి రానున్నారు.

డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌లకు ఓకే

- 158 ఎకరాల అప్పగింతకు ఆర్మీ అంగీకారం
- మంత్రి కేటీఆర్ వినతుల నేపథ్యంలో స్పందించిన రక్షణశాఖ
- రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవే మార్గాల్లో రెండు ప్రాజెక్టులకు తొలగిన అడ్డంకులు
- రెండు మార్గాలు 200 అడుగుల మేర విస్తరణ

- వివరాలు 5లో



రంగుల్లో వరి వంగడాలు!

- అనేక పరిమాణాల్లో విత్తనాల వృద్ధి
- మూడొందల వైవిధ్య వరివంగడాల సాగులో ఏఈవో శ్రీనివాస్
- విత్తన వైవిధ్యం కాపాడాలనే సంకల్పంతో సాగు
- తెలుగు రాష్ట్రాల రైతులకు మేలైన విత్తనాల సరఫరా - 11లో

టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రూప్–2 అభ్యర్థులు



ఒకే నెలలో ఇన్ని పరీక్షలా?

- టీఎస్‌పీఎస్సీ ముట్టడికి నిరుద్యోగుల ప్రయత్నం
- గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్
- మద్దతు పలికిన టీజేఎస్, కాంగ్రెస్, ఓయూ విద్యార్థి సంఘాలు
- అడ్డుకున్న పోలీసులు.. స్వల్ప ఉద్రిక్తత

సాక్షి, హైదరాబాద్/గన్‌ఫౌండ్రి: గ్రూప్–2 పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ గురువారం నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు నిరుద్యోగ అభ్యర్థులు ప్రయత్నించారు. వివిధ జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన నిరుద్యోగులు నిరసన గళంతో కదం తొక్కారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో కొందరు అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించగా మరికొందరు కార్యాలయం పక్కనే ఉన్న స్థలంలో ఆందోళనకు దిగారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ స్వయంగా వచ్చి పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తే తప్ప ఇక్కడ నుంచి వెళ్లబోమంటూ భీష్మించుకుని కూర్చున్నారు. వీరికి తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ.. ఆగస్టులో గురుకుల, ఇతర పోటీ పరీక్షలు ఉన్నాయని, ఒకేసారి నాలుగు పరీక్షలు నిర్వహిస్తే ఎలా సిద్ధం కావాలని ప్రశ్నించారు. ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన గ్రూప్–2 పరీక్షను మూడు నెలలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. కాగా పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేసి

మిగతా 13వ పేజీలో ▶

క్లుప్తంగా...

దమ్ముంటే కేసీఆర్ నిజామాబాద్‌లో పోటీ చేయాలి

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఎంపీ ధర్మపురి అర్వింద్ సవాల్



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు దమ్ముంటే నిజామాబాద్‌లో పోటీ చేయాలని, మంత్రి కేటీ రామారావుకు దమ్మున్నా ఆయన తండ్రితో నిజామాబాద్ నుంచి పోటీ చేయించాలని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సవాల్ విసిరారు. మంత్రి కేటీ రామారావు అర్హత కేవలం కేసీఆర్ కొడుకు మాత్రమేనని, కేసీఆర్ నిజామాబాద్ నుంచి పోటీ చేస్తే ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో చూపిస్తానన్నారు. ఢిల్లీలో ఎంపీ ధర్మపురి అర్వింద్ గురువారం మీడియాతో మాట్లాడుతూ..నిజామాబాద్‌లో మంత్రి కేటీఆర్ మోసపూరిత వాగ్దానాలు చేశారన్నారు. నిజామాబాద్‌లో సభకు రాలేదని తనను అడుగుతున్న కేటీఆర్, కల్వకుంట్ల కవిత ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలన్నారు. కవిత ముఖం చూడటం ఇష్టం లేకనే ఆమెను ఇందూరు ప్రజలు తిప్పికొట్టారని, కేటీఆర్‌ను చూడటం ఇష్టంలేక కవిత ఆ సభకు రాలేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో విప్ ఉండటం వల్లే నిజామాబాద్‌లో కేటీఆర్ సభకు వెళ్లలేకపోయానని వివరణ ఇచ్చారు. 2022–23 బడ్జెట్‌పై చర్చించేందుకు కేటీఆర్ సిద్ధమేనా అని సవాల్ విసిరారు.

ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ సభ్యులుగా సుధీర్, దీక్షిత్

సాక్షి, న్యూఢిల్లీ: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ సభ్యులుగా ఏపీకి చెందిన కమలకూరి సుధీర్‌కుమార్‌రెడ్డి, తెలంగాణకు చెందిన సింధే దీక్షిత్‌రావులు నియమితులయ్యారు. కాగా.. వీరిద్దరికి కేంద్రమంత్రి పశుపతి కుమార్ పారస్ నియామక పత్రాలను అందించారు.

మద్యం, భూముల అమ్మకాలతో మనుగడ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ఆర్థిక విధానాలను అనుసరిస్తోందని.. ఆదాయ వనరులు పెంచుకునేందుకు పూర్తిగా మద్యం, భూముల అమ్మకాలపైనే ఆధారపడిందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన గురువారం ఢిల్లీలో పార్టీ నాయకుడు మనోహర్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రిని కలిశారు. అర్ధగంట సేపు జరిగిన భేటీలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు ఆర్థిక విధానాలను వివరించారు.

క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా రాజేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ శాసన మండలి సభ్యులు డి.రాజేశ్వర్‌రావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఒమర్ జలీల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుదుత్పత్తిపై తెలంగాణను నియంత్రించండి

కృష్ణా బోర్డుకు ఏపీ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేయకుండా తెలంగాణ జెన్‌కోను నియంత్రించి.. తమ హక్కులను పరిరక్షించాలని కృష్ణా బోర్డును ఏపీ ప్రభుత్వం కోరింది. అనుమతి తీసుకోకుండా.. నీటి కేటాయింపులు లేకున్నా విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలం ప్రాజెక్టును ఖాళీ చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్ కుమార్‌కు.. ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి గురువారం లేఖ రాశారు. రాష్ట్రానికి హక్కుగా దక్కిన జలాలను తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి, హంద్రీ–నీవా ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకుంటామని బోర్డుకు సమాచారం ఇచ్చారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శుక్రవారం నీటిని విడుదల చేస్తామన్నారు. మల్యాల పంప్‌హౌస్ నుంచి హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకానికి నీటిని తరలిస్తామని తెలిపారు.

ఇదండీ సంగతి



... ఈశాన్యం ఇటు సార్!

బీఆర్‌ఎస్ అంటే 'భ్రష్టాచార్ రాక్షస సమితి'

- రాత్రంతా తాగుడు.. పొద్దంతా నిద్ర.. ఎవరినీ కలవకపోవడమే కేసీఆర్ విధానం
- కేసీఆర్ కాదు... ఖాసీం చంద్రశేఖర్ రిజ్వీ
- తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుంటోంది
- లోక్‌సభలో సంచలన వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: అవినీతి యూపీఏ ఏ విధంగా ఐఎన్‌డీఐఏగా మారిందో..తెలంగాణలో టీఆర్‌ఎస్ కాస్తా బీఆర్‌ఎస్‌గా మారిందని, బీఆర్‌ఎస్ అంటే 'భ్రష్టాచార్ రాక్షస సమితి'అని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. చీమల పుట్టలో తాచుపాము చేరినట్టు తెలంగాణలో ఒక అవినీతి కుటుంబం చేరిందని, ఆ కుటుంబం అధికారంలోకి వచ్చిన తర్వాత వందల రెట్లు ఆస్తులు పెంచుకొని రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ లీడర్ పేరు ఖాసీం చంద్రశేఖర్ రిజ్వీ అని.. తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. 'రాత్ బర్ పీతా...దిన్ బర్ సోతా... కిస్‌సే బీనహీ మిల్ తా...యే హై దేశ్‌కీ నేత'అంటూ తెలంగాణ సీఎం కేసీఆర్‌ను పరోక్షంగా విమర్శించారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై జరుగుతున్న చర్చలో గురువారం బీజేపీ పక్షాన ఎంపీ బండి సంజయ్ 10 నిమిషాల పాటు ఉద్వేగంగా మాట్లాడారు. 'అధికారంలోకి రాకముందుతో పోలిస్తే 2018 నాటికి ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ ఆస్తులు ఏ స్థాయిలో పెరిగాయంటే.. ఖాసీం రిజ్వీ కొడుకు ఆస్తులు 400 రెట్లు పెరిగినయ్. ఆయన భార్య ఆస్తులు 1800 శాతం పెరిగినయ్. ఆశ్చర్యమైన విషయమేందంటే.. తెలంగాణ రైతుల సగటు ఆదాయం రూ.1,12,836.. అదే కేసీఆర్ వ్యవసాయ ఆదాయం కోటి రూపాయలు, కేటీఆర్ వ్యవసాయ ఆదాయం రూ.59 లక్షల 85 వేలు.. రైతుల కంటే 5 వేల శాతం అధికం...కోడలు ఆదాయం 2 వేల శాతం అధికం... నా తెలంగాణలో రైతులు నష్టపోతున్నారు'అని అన్నారు.

కేంద్ర నిధులు కేసీఆర్ దారి మళ్లించారు

తెలంగాణకు కేంద్రం పుష్కలంగా నిధులిచ్చినా, కేసీఆర్ దారి మళ్లించారని సంజయ్ ఆరోపించారు. 9 ఏళ్లలో రూ.5 లక్షల కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసిందని, రూ.9 లక్షల 60 వేల కోట్లకు పైగా అప్పులిచ్చిందని తెలిపారు. టాయిలెట్లకు నిధులిస్తే దోచుకున్నారని, రూ.4 వేల కోట్ల అంచనాలతో రూపొందించిన మిషన్ భగీరథను రూ.40 వేల కోట్లకు పెంచి దోచుకున్నారని మండిపడ్డారు. ఉచితంగా రేషన్ అందిస్తుంటే వాటిని అమ్ముకుంటున్న దొంగలు బీఆర్‌ఎస్ నేతలని, జాతీయ ఉపాధిహామీ నిధులను సైతం దారి మళ్లించారని ఆరోపించారు.

నిక్కర్ పార్టీ అంటున్న కాంగ్రెస్‌కు పుట్టగతులుండవు

లిక్కర్‌తో సంబంధమున్నది కాంగ్రెస్ పార్టీకే అని, ఈ దేశంలో సనాతన సంప్రదాయంతో హిందూ సంఘటితశక్తిని ఏకం చేసే క్రమశిక్షణ కలిగిన సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అంత గొప్ప సంఘాన్ని నిక్కర్ లిక్కర్ అంటూ అవమానించే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని ధ్వజమెత్తారు.

ఆ పార్టీలవి కుమ్మక్కు రాజకీయాలు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. గల్లీలో కుస్తీ పడుతున్నట్టు యాక్షన్ చేస్తూ ఢిల్లీలో మాత్రం దోస్తీ చేస్తూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నారని సంజయ్ అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు ఓటేసినట్లేనని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పని ఖతమైందని.. కాంగ్రెస్ గల్లీలో లేదు..ఢిల్లీలో లేదని తెలిపారు. భారతమాతను హత్య చేశారంటూ కించపర్చారని, భారతమాత వైపు కన్నెత్తి చూస్తే కళ్లు పీకే ఆదర్శనేత మోదీ అని వ్యాఖ్యానించారు. వీళ్లంతా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన నాయకులు అని ఎద్దేవా చేశారు. యే కాంగీ..బెంగాల్ దీదీ..ఢిల్లీ క్రేజీ.. బిహార్ జేడీ..చోర్ చోర్..తెలంగాణ కేడీ... వీళ్లతో మోదీ ప్రభుత్వాన్ని ఏమీ చేయలేరని, ఆయన నాయత్వంలో ఎన్డీయే ప్రభుత్వం శక్తివంతమైన దేశంగా మారుతోందన్నారు. మరోవైపు రాహుల్‌గాంధీ ఎప్పుడేం చేస్తారో ఆయనకే తెలియదని, గజిని మాదిరిగా తయారయ్యారని ఎద్దేవా చేశారు.

24 గంటల కరెంట్ నిరూపిస్తే రాజీనామా చేస్తా

తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల పాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామంటూ బీఆర్‌ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు పార్లమెంట్‌ను పూర్తిగా తప్పుదోవ పట్టించాయని ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు బండి సంజయ్ సవాల్ విసిరారు 'తెలంగాణలో 24 గంటలపాటు నిరంతరాయంగా వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తా...ఇదిగో నా రాజీనామా...నిరూపించే దమ్ముందా? నిరూపించలేకపోతే మీరు రాజీనామా చేస్తారా? ముక్కు నేలకు రాసి సభకు క్షమాపణ చెబుతారా?' అంటూ సవాల్ విసిరారు.

మణిపూర్ సరే... తెలంగాణ సీఎం చేస్తున్నదేమిటి?

'మణిపూర్ అల్లర్ల గురించి మాట్లాడుతున్నారని...తెలంగాణలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు...భూకబ్జాల సంగతేంటి? తెలంగాణలో ఎంత పెద్ద దుర్ఘటన జరిగినా తెలంగాణ సీఎం ఎందుకు వెళ్లలేదు? రైతులు చనిపోయినా వెళ్లరు. ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నా వెళ్లరు'అని సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వీఆర్‌ఏల విలీనానికి నో

▶ మొదటి పేజీ తరువాయి

జీపీ రామారావు వాదనలు వినిపించారు.

సబార్డినేట్లకు అన్యాయం

తొలుత పిటిషనర్ల తరఫున పీవీ కృష్ణయ్య, శ్రీరాం పొలాలి వాదిస్తూ.. ''చట్ట ప్రకారం ఉద్యోగాల నియామకానికి ఒక ప్రక్రియ ఉంటుంది. వీఆర్‌ఏల విషయంలో ఆ ప్రక్రియ చేపట్టలేదు. సర్వీస్ రూల్స్‌లోనూ ఎలాంటి మార్పు చేయలేదు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంలో రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వం ఇష్టం వచ్చినట్టు జీవోలు జారీ చేసింది. సీనియర్లలో 19వ స్థానంలో ఉన్న నవీన్ మిట్టల్‌ను ఉద్దేశపూర్వకంగా సీసీఎల్‌ఏగా నియమించింది. దీనికి కృతజ్ఞతగా ఆయన చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోకుండానే ప్రొసీడింగ్స్ ఇచ్చేస్తున్నారు. సీసీఎల్‌ఏగా మిట్టల్ నియామకం చెల్లదు. రాత్రి జీవోలు ఇచ్చి ఉదయానికల్లా విధుల్లో చేరాలని ఆదేశించడం ఇంత వరకు ఎక్కడా, ఎప్పుడూ జరగలేదు. పైగా అంతా ఇప్పటికే విధుల్లో చేరారని కోర్టుకు చెప్పడం హాస్యాస్పదం. రాజ్యాంగబద్ధమైన కోర్టుల ముందు ఇలాంటి చర్యలను సమర్థించుకోజాలరు. ఓ వైపు సర్వీస్ నిబంధనలు అవసరం లేదంటూనే.. మరోవైపు అవసరమైతే జారీ చేస్తామనడం శోచనీయం. రాష్ట్రంలో ఆఫీస్ సబార్డినేట్లు ఏళ్లతరబడి ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. వారిని కాదని వీఆర్‌ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడం సరికాదు. వీఆర్‌ఏల సర్దుబాటు పేరిట ఆఫీస్ సబార్డినేట్లకు అన్యాయం చేయడం తగదు. అదేవిధంగా వీఆర్‌ఏలకు పదవీ విరమణ ఉండదు. దీన్ని అడ్డుపెట్టుకుని వారికి పింఛన్, గ్రాట్యుటీ వంటివి ఇవ్వకుండానే రిటైర్ అయ్యేలా చేయడం అన్యాయం. ఇది వయసు మీద పడిన వీఆర్‌ఏలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతుంది. దీనిపై పిటిషన్లు వేసిన వారిని ప్రభుత్వం బెదిరింపులకు గురిచేస్తోంది'' అని కోర్టుకు విన్నవించారు.

రాజకీయ విమర్శలు చేయడమేంటి?

పిటిషనర్ల వాదనల అనంతరం ప్రభుత్వం తరఫున జీపీ రామారావు వాదనలు వినిపించారు. ''పిటిషనర్లు ప్రభుత్వంపై, అధికారులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఉద్యోగులు సర్వీస్ నిబంధనల గురించి మాట్లాడకుండా రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరికాదు. సీసీఎల్‌ఏగా ఎవరిని నియమించాలనేది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయం. సర్వీస్ నిబంధనలకు, ఎన్నికలకు, సీసీఎల్‌ఏకు ఏమిటి సంబంధం? వీఆర్‌ఏలను ఒక్క రెవెన్యూ శాఖలోనే సర్దుబాటు చేయడంలేదు. ఇతర శాఖలకూ పంపుతున్నాం. వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినంత మాత్రాన ఆఫీస్ సబార్డినేట్లపై ప్రతికూల ప్రభావం ఉండదు. వీఆర్‌ఏల విలీనం కోసం ప్రభుత్వం సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించింది. అందువల్ల ఎవరికీ నష్టం ఉండదు. కొత్త పోస్టుల కోసం సర్వీసు నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉండదు. వీఆర్‌ఏలకు పింఛను, గ్రాట్యుటీ వంటివి ఇతర ఉద్యోగులకు వర్తించినట్లే ఉంటాయి. పెద్ద వయసు వారికి తక్కువ సర్వీసు ఉందనే కారణంగా మొత్తం ప్రక్రియ అక్రమమని చెప్పలేం. ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చట్టబద్ధంగా నిర్ణయం తీసుకుంది. అందులో జోక్యం కూడదు. వీఆర్‌ఏలను ఇప్పటికే సర్దుబాటు చేశాం.. మెజారిటీ విధుల్లో చేరారు. ఈ పిటిషన్లు సమర్థనీయం కాదు..కొట్టివేయాలి'' అని కోర్టుకు వాదనలు వినిపించారు.

వీఆర్‌ఏ ఉద్యోగ విషయంలో అన్యాయం!

మంత్రి సత్యవతి ఎదురుగానే ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న సలీం

మహబూబాబాద్: వీఆర్‌ఏ ఉద్యోగం విషయంలో తమ కుటుంబానికి అన్యాయం జరిగిందని, విచారణ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ షేక్ సలీం అనే వ్యక్తి మంత్రి సత్యవతి రాథోడ్ సమక్షంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం ఈ ఘటన జరిగింది. మహబూబాబాద్ పట్టణ శివార్లలోని బాలాజీ గార్డెన్‌లో మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా వీఆర్‌ఏలకు ఉద్యోగ నియామక పత్రాలు అందించే కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో నెల్లికుదురు మండలం మునీగలవీడు గ్రామానికి చెందిన షేక్ సలీం అక్కడికి వచ్చాడు. వీఆర్‌ఏ ఉద్యోగం విషయంలో తమకు అన్యాయం జరిగిందంటూ మంత్రి సత్యవతి రాథోడ్ ఎదురుగానే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోబోయాడు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే గమనించి, అతడిని రక్షించారు. అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ.. తన తండ్రి షేక్ హుస్సేన్ మునీగలవీడు గ్రామంలో షేక్ సింధ్ (గ్రామ సహాయకుడు)గా పనిచేసి 1986లో చనిపోయాడని.. ఆ స్థానంలో తనకు ఉద్యోగం ఇవ్వాల్సి ఉన్నా, తమ కుటుంబానికి సంబంధం లేని మరో గ్రామానికి చెందిన యాకుబ్ అలీకి ఇచ్చారని వివరించాడు. 2010లో అతను పదోన్నతిపై వెళ్లాక అయినా తమ కుటుంబానికి ఇవ్వకుండా.. యాకుబ్ పాషా అనే వ్యక్తికి ఉద్యోగం ఇచ్చారని వాపోయాడు. ఐదేళ్లుగా పోస్టు ఖాళీగా ఉందని.. తమ కుటుంబానికి ఇవ్వాలని ఎన్నిసార్లు డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదని చెప్పాడు. ఇప్పుడు వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తున్న క్రమంలో యాకుబ్ పాషా పేరును చేర్చారని.. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

కొత్తగూడెం నుంచి పోటీ చేసేది నేనే: వనమా



సూపర్‌బజార్ (కొత్తగూడెం): గత 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, కొత్తగూడెం నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికలోనూ తానే పోటీ చేస్తానని, ఇక్కడి ప్రజ ల నుంచి తనను ఎవరూ విడదీయలేరని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన పదవి విషయంలో సుప్రీంకోర్టు నుంచి స్టే లభించిన అనంతరం తొలిసారి గురువారం ఆయన కొత్తగూడెంకురాగా, జూలూరుపాడు వద్ద ఆయనకు పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కొత్తగూడెం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ, దేవుడి ఆశీర్వాదం, సీఎం కేసీఆర్, కేటీఆర్‌తో పాటు కార్యకర్తలు, ప్రజల అండతో తనకు అంతా మంచే జరుగుతుందన్నారు.

విద్వేష రాజకీయాలు దేశానికి చేటు

మణిపూర్, హరియాణాలో హింస జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వ మనస్సాక్షి ఎక్కడికి పోయింది

- అవిశ్వాసంపై చర్చలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శలు



సాక్షి, న్యూఢిల్లీ: అధికార బీజేపీ దేశంలో విద్వేషం సృష్టిస్తోందని..ప్రభుత్వం చేస్తున్న రాజకీయాలు దేశానికి చేటు చేస్తాయని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హెచ్చరించారు. చైనా ఓ పక్క దేశాన్ని ఆక్రమిస్తుంటే, కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. మణిపూర్, హరియాణాలో జరుగుతున్న హింసాకాండకు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బాధ్యత వహించాలన్నారు. దేశాన్ని ఓ దుకాణదారుడు, ఓ చౌకీదార్ ఏలుతున్నారని, మైనార్టీలపై దాడులు జరుగుతున్నా ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదని..ఇది ఇలానే కొనసాగితే దుకాణదారుడి దుకాణం మూతపడుతుందని, చౌకీదార్ మారుతాడని స్పష్టం చేశారు. అవిశ్వాస తీర్మానంపై చర్చలో ఒవైసీ మాట్లాడారు. నుహ్ హింస, యూసీసీ, హిజాబ్, మణిపూర్ సహా పలుఅంశాలను ఆయన ప్రస్తావించారు. అక్కడ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నప్పుడు మీ మనస్సాక్షి ఎక్కడికి పోయిందని కేంద్రాన్ని ప్రశ్నించారు. సీఎం సహకరిస్తున్నారు కాబట్టి ఆయన్ను తొలగించడం ఇష్టం లేదని ఎద్దేవా చేశారు. హరియాణాలోని నూహ్‌లో 750 భవనాలను ముస్లింలవి అనే కారణంగానే నిబంధనలు పాటించకుండా కూల్చివేశారని, అవి పూర్తిగా చట్టవిరుద్ధమని, హైకోర్టు పేర్కొందని గుర్తు చేసిన ఒవైసీ, భవనాలు కూలుస్తున్నప్పుడు దేశ మనస్సాక్షి ఎక్కడికి పోయిందన్నారు.

క్విట్ ఇండియా నినాదం ముస్లిందే

ఇటీవల మీనాసాహబ్ అనే వ్యక్తిని అతను ధరించిన దుస్తులు, గడ్డం చూసి, పేరు అడిగి ఒకరు చంపారు...అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలో బతకాలంటే మోదీకి ఓటేయాలన్నారు. ఇది ఛాందస వాదానికి ఉదాహరణ కాదా? అని ఒవైసీ ప్రశ్నించారు. ఇక దేశంలో హిజాబ్‌ను సమస్యగా మార్చి, ముస్లిం బాలికలను చదువుకు దూరంగా ఉంచారని దుయ్యబట్టారు. 'బిల్కిస్‌బానో ఈ దేశపు పుత్రిక కాదా అని నేను అడుగుతున్నా. బిల్కిస్‌బానోపై 11 మంది అత్యాచారం చేశారు, ఆమె తల్లిపై అత్యాచారం చేసి హత్య చేశారు. మీరు నేరస్తులను విడుదల చేశారు. మీరు మెజారిటీ కోసం పనిచేస్తున్నారు'అని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీజేపీ నేతలు మాట్లాడితే 'క్విట్ ఇండియా'అంటున్నారని, అయితే ఈ నినాదం ఒక ముస్లిం ఇచ్చారని తెలిస్తే మాత్రం ఈ మాట చెప్పడం మానేస్తారని ఎద్దేవా చేశారు. మహాత్మాగాంధీ ఆమోదించిన క్విట్ ఇండియా నినాదాన్ని యూసుఫ్ మెహర్ అలీ రూపొందించారని చెప్పారు. పాకిస్తాన్‌లో ఉన్న కులభూషణ్ జాదవ్‌ను ఎందుకు తీసుకురావడం లేదన్నారు. 'విశ్వగురు–విశ్వగురు అంటారు కానీ మీరు కులభూషణ్ జాదవ్‌ను మర్చిపోయారు. నేవీ అధికారులు ఖతార్‌లో ఒక సంవత్సరం జైలులో ఉన్నారు, కానీ మీరు వారిని తీసుకురాలేకపోయారు'అని అన్నారు.

చైనా ఆక్రమిస్తుంటే ఏం చేస్తున్నారు

ఇక చైనా అంశాన్ని ప్రస్తావిస్తూ 'మీరు చైనా గురించి ఏమీ మాట్లాడరు. 2013లో మోదీ సమస్య ఢిల్లీలో ఉందని, సరిహద్దులో లేదన్నారు. ఈ రోజు చైనా మన భూమిపై కూర్చోలేదా?, ప్రభుత్వం ఏం చేస్తోంది. మోదీ అహ్మదాబాద్‌లో జిన్‌పింగ్‌ను పిలిచి, హత్తుకున్నారు.అతన్ని చెన్నైకి తీసుకెళ్లారు. అయితే ఏం జరిగింది, ఫలితం ఏమిటి?'అని అడిగారు. ఒకదేశం, ఒకేచట్టం అనే యూసీసీ ఫార్ములా ఏంటని ఒవైసీ ప్రశ్నించారు. దేశంలో ఒకే మతం, ఒకే సంస్కృతి, ఒకే భాష అనేది నియంతల ఫార్ములా అని పేర్కొన్నారు. దేశంలో లెక్కలేనన్ని భాషలు, అనేక మతాలు ఉన్నాయని గుర్తు చేశారు.



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ కె.కేశవరావు. చిత్రంలో నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, కవిత తదితరులు

దమ్మూ ధైర్యముంటే నిరూపించండి

- కాళేశ్వరానికి కేంద్రం ఒక్కపైసా ఇచ్చినట్లు చూపిస్తే దేనికైనా రెడీ
- బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చాం
- కేంద్రంపై మండిపడ్డ బీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.86 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే పార్లమెంట్ సాక్షిగా చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ ఎంపీలు ఖండించారు. దమ్మూ ధైర్యముంటే కేంద్రం ఈ విషయాన్ని నిరూపించాలని వారు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు వేల కోట్ల రూపాయలు కాదు.. ఒక్క రూపాయి, కనీసం ఒక్క పైసా ఇచ్చినట్లు బీజేపీ నిరూపిస్తే రాజీనామాలు సహా దేనికైనా రెడీ అని సవాల్ విసిరారు. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే పార్లమెంట్‌ను తప్పుదారి పట్టించారన్న బీఆర్‌ఎస్ ఎంపీలు, ఆయనపై చర్యలు తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్‌కు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చామన్నారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిస్తోందని వారు ఆరోపించారు.

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం మధ్యాహ్నం బీఆర్‌ఎస్ ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు మీడియాతో మాట్లాడుతూ, గత తొమ్మిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ సాయం లేకుండానే తెలంగాణ అభివృద్ధి జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఎన్నిసార్లు అడిగినా ఎలాంటి లాభం లేకపోయిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రధాని, హోంమంత్రిని కలిసి విన్నవించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చులతో నిర్మించిందన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గతంలో అడిగిన ప్రశ్నోత్తరాల్లోనే ఒప్పుకుందన్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు, నవోదయ విద్యాలయాల మంజూరు విషయంలోనూ జరిగిన నష్టాన్ని అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో దేశం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అంతేగాక కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పును మాఫీ చేయాలన్నారు. రేవంత్‌రెడ్డి రాజకీయంగా పోరాడాలే తప్ప లిక్కర్, నిక్కర్ అంటూ పిచ్చి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల గురించి మాట్లాడేటప్పుడు రేవంత్ నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు.

కేసీఆర్ పాలన ఇక వందరోజులే

రాష్ట్రాదాయాన్ని ఏటీఎం కార్డులా వాడుకుంటున్నారని తరుణ్ ఛుగ్ ఆరోపణ



ఓల్డ్ బోయిన్‌పల్లి/కీసర: కేసీఆర్ కుటుంబపాలనకు వందరోజుల కౌంట్‌డౌన్ మొదలైందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు అన్నివర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి, ఓల్డ్ బోయిన్‌పల్లిలో జరిగిన మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్, రూరల్ జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తలు, పదాధికారుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని సీఎం కేసీఆర్ ఏటీఎం కార్డులా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. గడువుకు ముందే మద్యం దుకాణాలకు టెండర్లు వెయ్యడం, ప్రభుత్వ భూములను విక్రయిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం కేసీఆర్ పాలనాతీరుకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రజలకు పనులు చేసేవారే కరువయ్యారని, అధికార ధనదాహానికి ప్రజలను బలి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల రాజకీయ వ్యూహాలు వేరైనప్పటికీ లోపాయికారీ ఒప్పందాలతో ముందుకు వెళ్తున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కామ్‌పై ఈడీ విచారణ విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటూ ముందుకు వెళుతుందని చెప్పారు. వంద రోజుల తర్వాత రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు ప్రజలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి మూడోస్థానానికి పరిమితం కావడం ఖాయమని, ఓటమి భయం వల్లే ఆయన గ్రామాల్లో డబ్బులు పంపిణీ మొదలుపెట్టారని విమర్శించారు. అనంతరం 75 ఏళ్ల స్వాతంత్య్ర అమృతోత్సవాల ముగింపు సందర్భంగా మేరీ మాటి–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా రాంపల్లి చౌరస్తాలో 75 దీపాలు వెలిగించి, పంచప్రాణాల ప్రతిజ్ఞ కార్యక్రమంలో తరుణ్ ఛుగ్ పాల్గొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి.ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, కోశాధికారి శాంతికుమార్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ ఎంపీగా గెలుస్తా

ఎమ్మెల్సీ కవిత

- పార్లమెంటులో బండి సంజయ్ అబద్ధాలు



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో తాను నిజామాబాద్ ఎంపీ గానే పోటీ చేస్తానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఎంపీగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ఎల్పీలో ఎమ్మెల్యే గణేష్ బిగాల, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్‌తో కలిసి గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ధర్మపురి అర్వింద్ ఓ దౌర్భాగ్యుడు అని, ఆయన ఎంపీగా గెలవడంతో నిజామాబాద్ అభివృద్ధిలో ఇరవై ఏళ్లు వెనక్కి పోయిందని ధ్వజమెత్తారు. అర్వింద్ కోరుట్ల ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు కూడా పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ ఐటీ హబ్ గురించి అర్వింద్ దారుణంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో నిజామాబాద్ జిల్లాలో జరిగిన అభివృద్ధిలో బీజేపీ భాగస్వామ్యం సున్నా అని విమర్శించారు. నిజామాబాద్ ఐటీ హబ్ తో జిల్లా దశ దిశ మారబోతోందని, ఉద్యోగాల కల్పనపై అర్వింద్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనన్నారు. సీఎంకు సవాల్ విసిరే స్థాయి ఆయనకు లేదన్నారు.

స్విచ్‌లో వేలు పెట్టి చూస్తే కరెంటు వస్తుందో లేదో తెలుస్తుంది

తెలంగాణలో కరెంటు 24 గంటలు వస్తుందో లేదో ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ బీజేపీ కార్యాలయంలోని స్విచ్‌లో వేలుపెట్టి చూడాలని కవిత సలహా ఇచ్చారు. పార్లమెంటులో ఏం మాట్లాడుతారో సంజయ్‌కే తెలియదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని కాళేశ్వరం సహా ఏ ప్రాజెక్టుకూ కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వలేదని, మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు ఉండడంతో అక్కడున్న ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడమే కాక, రూ.22వేల కోట్లు మంజూరు చేశారని చెప్పారు. రెండురోజుల కిందట కేంద్ర మంత్రి నిషికాంత్ దూబే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.86 వేల కోట్లు ఇచ్చామని అబద్ధాలు మాట్లాడారని, దానికి కొనసాగింపుగా బండి సంజయ్ అదే మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథకు రూ. 24 వేల కోట్లు ఇవ్వమంటే ఇవ్వలేదని గుర్తు చేశారు. తమ నాయకుడిని వ్యక్తిగతంగా దూషించిన బండి సంజయ్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాళేశ్వరంపై బీజేపీ ఎంపీ తప్పుడు ప్రచారం చేయగా, బీఆర్‌ఎస్ ఎంపీలు సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారని కవిత పేర్కొన్నారు.

భూములమ్మి రాష్ట్రాన్ని నడుపుతున్నారు

ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మెదక్: రాష్ట్రంలో భూములను అమ్మి పాలన సాగిస్తున్నారని, ఇది ముమ్మాటికీ చేతగాని పాలనేనని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీఆర్‌ఎస్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. తొమ్మిదేళ్ల కాలంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అంతుచూసేవరకు విశ్రమించబోమని శపథం చేశారు. కేసీఆర్ పుట్టిన మెదక్ నుంచే యుద్ధం మొదలుపెట్టామని హెచ్చరించారు. అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇవ్వాలనే డిమాండ్‌తో ఉమ్మడి మెదక్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మెదక్ సాయిబాలాజీ గార్డెన్ నుంచి పట్టణంలోని రాందాస్ చౌరస్తా వరకు వేలాదిమందితో భారీగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ రూ.5 లక్షలతో డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఇప్పుడు రూ.3 లక్షలు ఇస్తాం ఇళ్లు నిర్మించుకోండి అని చెప్పడం ప్రజల్ని మోసగించడమేనని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. నాలుగు రోజులు మాత్రమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తమపై దాడులు చేశారని, మీరు ఆశీర్వదించి గెలిపిస్తే అవే దాడులు కేసీఆర్‌పై ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ పదోన్నతుల్లో రిజర్వేషన్లు.. ఎంపీ కృష్ణయ్య డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగుల పదోన్నతులకు రిజర్వేషన్లు కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని ఆయన కోరారు. ఈ డిమాండ్ల సాధనకు గురువారం జంతర్‌మంతర్‌లో ఆలిండియా ఓబీసీ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో జరిగిన ధర్నాలో కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లకు పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు పెడతామన్నా రు. కార్యక్రమంలో ఆలిండియా ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కరుణానిధి, తెలంగాణకు చెందిన దానకర్ణ చారి, మాజీ ఎంపీ వీహెచ్, ఆనంద భాస్కర్ పాల్గొన్నారు.

ఓ విశ్వాసులారా! ఒకరిని చెడ్డపేరుతో పిలిచిన పిదప పశ్చాత్తాపపడకుంటే, అలాంటి వారు చాలా దుర్మార్గులు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 11 ఆగస్టు 2023

భూతల స్వర్గం ఇక 'కేరళమ్'!

పచ్చని ప్రకృతితో భూతల స్వర్గంగా, 'దేవుడి సొంతగడ్డ'గా పేరుబడ్డ రాష్ట్రానికి త్వరలోనే కొత్త పేరు ఖరారు కానుందా? కేరళ అతి త్వరలోనే అధికారికంగా పేరు మార్చుకోనుందా? అవును. దేశానికి దక్షిణ కొసనున్న ఈ మలయాళ రాష్ట్రం 'కేరళమ్'గా కొత్త నామధేయం స్వీకరించడానికి సన్నాహాలు సాగుతున్నాయి. రాష్ట్రం పేరును రాజ్యాంగంతో సహా అన్ని ఆఫీసు రికార్డుల్లోనూ అధికారికంగా 'కేరళమ్'గా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ, కేరళ శాసనసభ తీర్మానం చేయడంతో అందుకు రంగం సిద్ధమైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరాయి విజయన్ బుధవారం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని విపక్షాలతో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం పార్టీలకతీతంగా కొత్త పేరుకున్న సర్వ జనామోదాన్ని తెలియజేస్తోంది. అసెంబ్లీ తీర్మానం తర్వాత కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఇంకా అనేక అంచెలున్నందున అవన్నీ దాటుకొని మలయాళీల ఆకాంక్ష నెరవేరడానికి మరికొంత కాలం పట్టవచ్చు.

నిజానికి, మలయాళంలో అసలు ఆ రాష్ట్రం పేరు కేరళమే. మలయాళీలు సాధారణంలో వాడుకలో చెప్పేది అలానే. ఎటొచ్చీ అధికారిక, ఇంగ్లీష్ రికార్డులోనే ఈ కేరళ అనే మాట. చరిత్ర పరికిస్తే – మలయాళం మాట్లాడే ప్రజలు రకరకాల రాజులు, సంస్థానాల పాలనలో ఉండేవారు. మలబార్, కొచ్చి, ట్రావన్‌కోర్‌లను కలిపి, మలయాళ భాషీయులు అందరికీ సమైక్యంగా ఒకే రాష్ట్రం కావాలనే 'ఐక్య కేరళ ఉద్యమం' 1920ల నుంచే ఉంది. ఒకే భాష, ఒకే చరిత్ర, సంస్కృతి, సంప్రదాయమున్న మలయాళీలంతా ఐక్యం కావాలనే బలమైన డిమాండ్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సంస్థానాల విలీనంతో క్రమక్రమంగా నెరవేరింది. 1949 జూలై 1న ట్రావన్‌కోర్, కొచ్చి రాష్ట్రాలు రెండూ ఏకమై, ట్రావన్‌కోర్ – కొచ్చిన్ రాష్ట్రం ఏర్పడింది. ఆ తర్వాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నప్పుడు పునర్వ్యవస్థీకరణ సంఘం కేరళ రాష్ట్ర ఏర్పాటును సిఫార్సు చేసింది. అలా 1956 నవంబర్ 1న ఇప్పటి కేరళ రాష్ట్రం ఆవిర్భవించింది. రాష్ట్రం పేరును మలయాళంలో కేరళమ్ అని పేర్కొన్నా, అప్పట్లో రాజ్యాంగం తొలి షెడ్యూల్‌లో ఇంగ్లీషులో కేరళ అని రాశారు. ఇప్పుడు అదే రాజ్యాంగం 3వ అధికరణ కింద అంతటా కేరళమ్‌గా మార్చాలన్నది కేంద్రానికి అసెంబ్లీ తీర్మానం.

సాధారణంగా పేరులో ఏముంది పెన్నిధి అనుకోవచ్చు. కానీ, అనేక సందర్భాల్లో ఆ పేరు, ఆ పేరు వెనుక చరిత్ర, దానితో ముడిపడ్డ అనుబంధం నిజంగానే ఓ పెన్నిధి. అస్తిత్వానికీ, అపారమైన సెంటిమెంట్‌కూ నెలవు. అనేక ప్రాంతీయ, అస్తిత్వ ఉద్యమాలకు ఆ యా ప్రాంతాల ప్రజల భాష, గోస, ఊరు, పేరు బలమైన ఊతమిచ్చాయనేది మర్చిపోలేని చరిత్ర. ఒకప్పుడు మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి విడిగా తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ తెలుగువారు చేసిన పోరాటమే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు దారి తీసింది. దక్షిణాదిన తెలుగువారికి, తమిళులకు, కన్నడిగులకు, మలయాళీలకు ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడ్డాయి. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత స్థానిక సెంటిమెంట్లను గౌరవిస్తూ, కొన్ని రాష్ట్రాల పేర్లూ మారాయి. 'మద్రాస్ రాష్ట్రం' అనంతర కాలంలో 1967 నుంచి తమిళనాడు అయినా, 'మైసూర్ స్టేట్' అటుపైన 1973లో కర్ణాటకగా పేరు మార్చుకున్నా అలాగే జరిగింది. ఇప్పుడు కేరళ ప్రజాప్రతినిధులు అసెంబ్లీ ఏకగ్రీవంగా తమ రాష్ట్రం పేరును స్థానిక పురాతన చరిత్రను ప్రతిఫలించేలా కేరళమ్‌గా మార్చాలంటూ చేసిన తీర్మానం కూడా ఆ కోవలోనిదే!

శబ్ద వ్యుత్పత్త్యర్థాల ప్రకారం చూసినా చాలా కథే ఉంది. మలయాళంలో 'కేర' అంటే కొబ్బరి కాయ. అలా 'కేరళ' అంటే నారికేళాల భూమి అని శబ్దార్థం. కేరళ సీమలో ఎటు చూసినా పచ్చటి కొబ్బరి చెట్లు విస్తృతంగా ఉండడమే ఈ శబ్దోత్పత్తికి నేటికీ సాక్ష్యం. క్రీ.పూ. 257 నాటి అశోకుని రెండో శిలాశాసనంలోనే తొలిసారి కేరళ ప్రస్తావన కనిపిస్తుంది. అందులో స్థానిక పాలకుణ్ణి 'కేరళపుత్ర' అనీ, చేర రాజవంశాన్ని ప్రస్తావిస్తూ 'చేర పుత్రుడ'నీ ఉంది. గోకర్ణం నుంచి కన్యాకుమారి మధ్య ఉన్న ప్రాంతాన్ని 'చేరమ్' అనేవారట. 'చేర' అనే మూలపదానికి అనుసంధానించడమనీ, 'అళం' అంటే ప్రాంతమనీ అర్థం. అలా చేరమ్, చేరళమ్ పదాల నుంచే 'కేరళమ్' అనే మాట పుట్టిందట.

దేశపు నైరుతి మూలన మలబార్ తీరంలో నెలకొన్న ఈ రాష్ట్రానికి అనేక విశిష్టతలున్నాయి. ఇది పరశురామ క్షేత్రమనీ, బలి చక్రవర్తి ఇక్కడ నుంచే భూమండలాన్ని పాలించాడనీ పురాణగాథ. మలబార్ సీమ వారిది ప్రత్యేక భాష, సంస్కృతి, సంప్రదాయం. సహజంగానే స్వరాష్ట్రం పేరు సైతం వాటిని ప్రతిఫలించేలా, స్థానిక భావోద్వేగాలను ప్రతిబింబించేలా ప్రతిష్ఠాత్మకంగా ఉండాలని వారు కోరుకుంటారు. అది నూరుపాళ్ళూ సమంజసమే. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు మొదలు సమైక్య ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్ర విభజన దాకా ఇవన్నీ ఆ కోవలో వచ్చినవే! అయితే, పేరు మార్పుకూ పెద్ద తతంగం ఉంది. కొత్త రాష్ట్రాల ఏర్పాటు, సరిహద్దులు, పేర్లలో మార్పుల అంశాలు రాజ్యాంగం 3వ అధికరణం కిందకు వస్తాయి. నగరాల పేర్లు మార్చేందుకు కేంద్ర ఆమోదం అవసరం లేకున్నా, రాష్ట్రాల పేర్ల మార్పునకు కేంద్ర హోమ్‌శాఖ అంగీకారం తప్పనిసరి. రాజ్యాంగ సవరణ అవసరం. సాధారణంగా రాష్ట్ర సర్కార్ నుంచి ప్రతిపాదన రాగానే కేంద్రం పేరు మార్పు ప్రక్రియ ఆరంభమవుతుంది. ఆ పైన ఇంటెలిజెన్స్ బ్యూరో, రైల్వే, తపాలా శాఖలు వగైరాల నుంచి నిరభ్యంతర పత్రాలు కోరుతుంది. పార్లమెంట్ ఆమోదంతో చట్టమయ్యాక, రాష్ట్రానికి కొత్త పేరు అమలులోకి వస్తుంది. కేరళ విజయాలను ప్రపంచానికి చాటేలా ఈ నవంబర్ 1న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి 'కేరళీయమ్ 2023' పేరున ఉత్సవాలు జరగనున్నాయి. ఆలోగా పేరు మారితే ఉత్సవాలకూ నిండుదనమన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన ఫలిస్తుందా?

అగ్నికి ఆజ్యం పోసిన అరెస్టు

విశ్లేషణ



సి. ఉదయ్ భాస్కర్

రావల్పిండిలోని సైనిక ప్రధాన కార్యాలయ కనుసన్నల్లో ఇస్లామాబాద్ ప్రభుత్వం మెలగాల్సి రావడం పాకిస్తాన్ రాజకీయాలకు సంబంధించిన ఒక క్రూరమైన వ్యంగ్యాన్ని సూచిస్తుంది. ప్రధాని పదవికి ఇమ్రాన్ ఖాన్ చేరువకావడం, ఆ తర్వాత ఆయన అవమానకరమైన పతనం రెండూ సైనిక నాయకత్వపు స్థిరత్వానికి చక్కటి ఉదాహరణ. పాకిస్తాన్ రాజకీయ, ఆర్థిక, భద్రతకు సంబంధించిన అనేక సవాళ్లను ఇమ్రాన్ అరెస్టు ఉదంతం మరింతగా పెంచుతుంది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే పాకిస్తాన్ రూపాయి 282 రూపాయల కంటే తక్కువగా ఉండటంతో ఆర్థిక అవకాశాలు వట్టిపోతున్నాయి. దాతల సహాయాన్ని కోరుతున్నప్పుడు తరచుగా తిరస్కారానికి గురయినట్లు పాక్ తాజా మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా అంగీకరించారు.

పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను అక్రమాస్తుల కేసులో దోషిగా తేలిన తర్వాత ఆగస్టు 5న అరెస్టు చేశారు. చట్టం నిర్దేశించినట్లుగా 'విచారణ ప్రక్రియ' మార్గంలో వెళ్ళడానికి ఎలాంటి ప్రయత్నం చేయకుండానే, ప్రభుత్వ వ్యవస్థ ప్రధాన అంగం మాజీ ప్రధానమంత్రిపై దాడి చేసింది. ఇమ్రాన్ ఖాన్‌కు మునుపటి పాలకుల్లో కొందరు ఇటీవలి దశాబ్దాలలో అనుభవించిన సుపరిచితమైన శిక్షా క్రమంలో ఇదీ భాగమే. రాజకీయ నేతగా మారిన ఈ ప్రజాకర్షక క్రికెటర్‌ను 2023 మే 9న అరెస్టు చేశారు. పాకిస్తాన్ సుప్రీంకోర్టు ఈ అరెస్టును 'చట్టవిరుద్ధం'గా ప్రకటించి, ఆయన్ని విడుదల చేయగా, అది హింసాత్మక నిరసనలకు దారి తీసింది. ఫలితంగా 10 మంది మరణించారు. ప్రజా ఆస్తులకు గణనీయమైన నష్టం వాటిల్లింది.

ఈసారి ఇమ్రాన్ అరెస్టుకు వీధుల్లో ప్రజల ప్రత్యక్ష మద్దతు ఇంకా లభించలేదు. ఇమ్రాన్ సొంత పార్టీ అయిన పాకిస్తాన్ తహరీక్–ఎ–ఇన్సాఫ్ (పీటీఐ), ఆయన్ని పంజాబ్ రాష్ట్రంలోని అటక్ జైలు నుండి రావల్పిండిలోని అత్యంత భద్రత కలిగి వున్న అదియాలా జైలుకు మార్చాలని ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఇమ్రాన్‌కు మునుపు దేశాన్ని పాలించిన మాజీ ప్రధానులు షాహిద్ ఖాకన్ అబ్బాసీ, నవాజ్ షరీఫ్, బేనజీర్ భుట్టో కూడా అదే విధంగా క్రూర బెదిరింపులకు గురయ్యారు. విచారణను ఎదుర్కొంటూ, 1979లో ఉరిశిక్షకు గురైన జుల్ఫికర్ అలీ భుట్టోకు పట్టిన గతి తెలిసిందే. రాజకీయ అదృష్టం ముఖం చాటేసినప్పుడు, పాకిస్తాన్ రాజ్యవ్యవస్థ తన సొంత అగ్రనేతలకు విధించే తీవ్రమైన శిక్ష ఎలాంటిదో భుట్టో ఉదంతం గుర్తుచేస్తుంది. ఇమ్రాన్ పొందిన ఈ పతనం, పాకిస్తాన్ సైన్యం ఆయన పట్ల అభిమానం కోల్పోయిందని సూచిస్తుంది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాక్ సైన్యం చేతుల్లో పగ్గాలు ఉంటాయి. సైనిక ప్రయోజనాలకు అనుగుణంగా రాజకీయ నాయకత్వం మసలుకోనప్పుడు లేదా మరీ ఎక్కువగా స్వతంత్రత ప్రదర్శించినప్పుడు పాక్ సైన్యం రాజకీయ నాయకత్వాన్ని అధికారం నుండి దింపేస్తుంది.

రావల్పిండిలోని సైనిక ప్రధాన కార్యాలయ కనుసన్నల్లో ఇస్లామాబాద్ ప్రభుత్వం మెలగాల్సి రావడం పాక్ రాజకీయాలకు సంబంధించిన ఒక క్రూరమైన వ్యంగ్యాన్ని సూచిస్తుంది. శాసన సభ్యులు ఎంత ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించవచ్చో నిర్ణయించేది సైన్యమే. స్పష్టంగా, సైన్యం మద్దతిచ్చి మరీ ప్రధానమంత్రి కుర్చీలో కూర్చో బెట్టిన ఇమ్రాన్ ఆ సైన్యం చేతినే కొరకడంతో పాక్ సైనిక నాయకత్వం చాలా అసౌకర్యాన్ని అనుభవించింది. పాకిస్తాన్‌లో అత్యున్నత కార్యా లయానికి (ఆగస్టు 2018) ఇమ్రాన్ ఒక్కసారిగా చేరువకావడం, ఆ తర్వాత ఆయన అవమానకరమైన పతనం రెండూ సైనిక నాయ కత్వపు స్థిరత్వానికి చక్కటి ఉదాహరణగా చెప్పవచ్చు.



1996లో ఇమ్రాన్ స్థాపించిన పాకిస్తాన్ తహరీక్–ఎ–ఇన్సాఫ్ (పీటీఐ) ఒకప్పుడు దేశ రాజకీయాల్లో పరాయి పార్టీగా ఉండేది. దశాబ్ద కాలంలోనే, పాక్‌లో బలంగా ఉన్న పార్టీలకు ఇది గట్టి ప్రత్యర్థిగా నిలిచింది. నైతికంగా తన ఉన్నత స్థానాన్ని ప్రకటిస్తూ, పాత నాయకులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించింది. ఎన్నికైతే స్వచ్ఛమైన ప్రభుత్వాన్ని అందిస్తానని వాగ్దానం చేసింది.

2013 జూన్‌లో మూడవసారి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నవాజ్ షరీఫ్ ఎప్పుడూ పూర్తి కాలంపాటు దేశాన్ని పాలించలేకపోయారు. ప్రభుత్వం లోపలి ప్రభుత్వం, అంటే సైనిక వ్యవస్థ ప్రయోజనాలకు ఎంతో కాలం సేవచేయడని రావల్పిండిలోని సైనిక హెడ్ క్వార్టర్స్ నిర్ణయించుకున్న ప్రతిసారీ షరీఫ్ తన ప్రధాని పదవి కోల్పోయారు. ఇమ్రాన్ పార్టీ ఆయన్ని లక్ష్యంగా చేసుకున్న తర్వాత 2017 జూలైలో షరీఫ్ చివరిసారిగా బలవంతంగా అధికారం నుంచి నిష్క్రమించారు. వివిధ నేరాలకు పాల్పడ్డారని అభియోగాలు మోపబడి, అవమానకరమైన రీతిలో దేశం విడిచి వెళ్లడానికి ముందు నవాజ్ షరీఫ్ జైలు పాలయ్యారు. అనంతరం ఆయన సోదరుడు షెహబాజ్ షరీఫ్ ప్రధాని అయ్యారు. పెద్ద షరీఫ్ త్వరలో దేశానికి తిరిగి వస్తారనీ, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తమ పార్టీ పీఎమ్ఎల్(ఎన్)ను అధికారంలోకి తేవడానికి నాయకత్వం వహిస్తారనీ షెహబాజ్‌కు తెలుసు.

పాకిస్తాన్ రాజకీయ, ఆర్థిక, భద్రతకు సంబంధించిన అనేక సవాళ్లను ఇమ్రాన్ అరెస్టు ఉదంతం మరింతగా పెంచుతుంది. ప్రస్తుత జాతీయ అసెంబ్లీ తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకొని, ఆపద్ధర్మ ప్రభుత్వానికి పగ్గాలు అప్పగించడానికి మూడు రోజుల ముందు, ఆగస్టు 9న జాతీయ అసెంబ్లీ రద్దవుతుందని షెహబాజ్ షరీఫ్ గత వారం ప్రకటించారు (అనుకున్నట్టుగానే ఆగస్టు 9న రద్దయింది). ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించేందుకే ప్రజాదరణ ఉన్న ఇమ్రాన్ అరెస్టును ప్లాన్ చేశారనీ, ఈ అంశంపై షరీఫ్, భుట్టో–జర్దారీ నేతృత్వంలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలు రావల్పిండి సైనిక నాయకత్వంతో కుమ్మక్కయ్యాయనీ విమర్శకులు అంటున్నారు.

రాజకీయ దుమారాన్ని మరింతగా పెంచడానికి, షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం మొట్టమొదటిసారిగా డిజిటల్‌గా ప్రారంభించిన జాతీయ జనాభా గణన ఫలితాన్ని ఆమోదించింది. తద్వారా అక్టోబర్, నవంబర్‌లో జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేయవచ్చనే ఊహాగానాలకు తెరలేచింది.

పాకిస్తాన్ ప్రస్తుత ఆర్థిక ద్రవ్య స్థితి శుష్కించి ఉంది. దాతల సహాయాన్ని కోరుతున్నప్పుడు తరచుగా తిరస్కారానికి గురవుతున్నట్లు షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. 'ఈరోజు మనం తలెత్తుకుని జీవించాలా లేక భిక్షాటన చేస్తూ బతకాలా అనేది నిర్ణయించుకోవాలి' అని ఆయన అన్నారు. 'భారతదేశం ముందుకు సాగింది, కానీ మన సొంత తప్పిదాల వల్ల మనం వెనుకబడిపోయాము' అని కూడా అంగీకరించారు. దాయాది దేశం పట్ల ఇది అరుదైన దాపరికం లేని మాట అనే చెప్పాలి.

పాకిస్తాన్ లోపాలు దాని డీఎన్ఏలో నిక్షిప్తమై ఉన్నాయి. వలస పాలన అనంతర ఎన్నో దేశాలు సమర్థవంతమైన పౌర పాలనకు పరివర్తన చెందడానికి అనుసరించిన సూత్రప్రాయ రాజకీయ ప్రక్రియలను అణచివేయడంలో ఉన్నాయి. విచారకరంగా, పాక్ సైన్యం, కశ్మీర్‌ను తన శాశ్వత బోగీగా ఉపయోగించుకుని, రాజ్యాధికారం, ఆర్థిక ప్రాధాన్యతలకు చెందిన చాలా ముఖ్యమైన మీటలను ఏకీకృతం చేసుకుంది. అటువంటి ఆధిపత్య ప్రదర్శనకు సైన్యాన్ని అనుమతించడం వల్ల ప్రభుత్వంపై పడే ఖర్చు గురించి పాకిస్తాన్ పౌర సమాజంలోని కొన్ని వర్గాలు జాతిని హెచ్చరించాయి కానీ అవి ఫలించలేదు.

ఈ ప్రాణాంతకమైన ప్రణం జనరల్ జియా–ఉల్–హక్ పాలనలో సమ్మిళితం అయింది. ఇది ప్రభుత్వం, సమాజం స్థిరంగా ఇస్లామీకరణకు గురవడానికి నాంది పలికింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో ప్రాంతీయ భౌగోళిక రాజకీయ పరిణామాలు (1979లో అఫ్గానిస్తాన్‌పై సోవియట్ దండయాత్ర వంటివి) అంతర్జాతీయ పర్యవసానాలకు దారి తీశాయి. ఈ కారణాలన్నీ పాక్‌కు భద్రతా సవాలును మరింత తీవ్రతరం చేశాయి. ఖైబర్–పఖ్తూన్‌ఖ్వా రాష్ట్రంలోని బాజౌర్ జిల్లాలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి, 60 మందికిపైగా మరణానికి కారణమైంది. ఈ చర్యకు కారణం తామేనని ఇస్లామిక్ స్టేట్ (ఖురా సాన్) ప్రకటించింది. అంతర్గత భద్రతా పరిస్థితికి ఇది విషాద సాక్ష్యం.

యూఎస్ డాలర్‌తో పోలిస్తే పాకిస్తాన్ రూపాయి 282 రూపాయల కంటే తక్కువగా ఉండటంతో ఆర్థిక అవకాశాలు వట్టిపోతున్నాయి. ఇమ్రాన్ అరెస్టు అనేది తాత్కాలిక ప్రభుత్వం పరిష్కరించాల్సిన సంక్లిష్టమైన అనేక పెను సవాళ్లకు చెందిన మురికి మంచు కొండ కొస మాత్రమే. ఎప్పటిలాగే రావల్పిండి సైనిక నాయకత్వం మోసపోయిన పాకిస్తానీ ప్రజల అదృష్టాన్ని నిర్ణయిస్తుంది.

వ్యాసకర్త, సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా…!

ఇదా పద్ధతి?



ఆరోగ్యం బాలేనప్పటికీ పార్లమెంట్‌కు హాజరవుదామని వచ్చాను. కానీ జరుగుతున్నది చాలా నిరాశ కలిగించింది. నా సుదీర్ఘ అనుభవాన్ని బట్టి ఇది సరికొత్త దారుణస్థితి అని చెప్పగలను. ప్రతి ఒక్కరూ గౌరవ మర్యాదలు పాటించినప్పుడే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలం.

– దేవెగౌడ, రాజ్యసభ ఎంపీ

వినోదం నుంచి విద్యకు…



గ్రామీణ భారతీయ విద్యార్థుల్లో సగం మందికి స్మార్టుఫోన్లు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలామంది వాటిని ప్రాథమికంగా విద్య కోసం కాకుండా వినోదం కోసం వాడుతున్నారు. విద్యార్థులను విద్యవైపు నెట్టడానికి 'నడ్జ్ భావన' (బిహేవియరల్ సైన్స్‌లో భాగం) ఉపయోగ పడగలదు.

– రోనీ స్క్రూవాలా, ఆంట్రప్రెన్యూర్

పోటీ ఎక్కువ



ఏ ఇబ్బందులూ లేకుండా, మంచి వేతనం వచ్చే విభాగం రేడియాలజీ అని చాలామంది మెడికల్ విద్యార్థులు అను కుంటారు. ఇది నిజం కాదు. మనుషులు, కృత్రిమ మేధ నుంచి పోటీని ఎదుర్కోవాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆ పనిని కృత్రిమ మేధతో భర్తీ చేసే రిస్క్ ఎక్కువ.

– కార్తీక్, ఎండోక్రైనాలజిస్ట్

పట్టించుకోరు!



పాకిస్తాన్ నిజమైన సమస్య ఏమిటంటే, యూఎస్ దానిమీద ఆసక్తి కోల్పోయింది. వాళ్లు పక్కకు వెళ్లిపోయారు. ఇక ఖాతరు చేయరు.

– సిరిల్ అల్‌మీడా, పాకిస్తాన్ జర్నలిస్ట్

విషానికి విరుగుడు



మీ ఆహారాన్ని ప్లాస్టిక్ కంటెయినర్స్‌లో నిల్వ చేసుకోవద్దు. దానికి బదులుగా గాజువి వాడండి. అవి ఎక్కువ కాలం మన్నుతాయి. పైగా విషపూరిత మైక్రో ప్లాస్టిక్స్‌ను మీ ఆహారంలోకి పీల్చుకోవు.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

పత్రికాధిపతిగా ఉంటూనే ఎనలేని సేవ



బి. నర్సన్

హైదరాబాద్ నుండి వెలువడే 'సియాసత్' ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ అయిన జహీరుద్దీన్ అలీ ఖాన్ ఊహించని రీతిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఏడవ తేదీన గద్దర్ పార్థివ దేహ అంతిమ యాత్రలో లాల్ బహదూర్ స్టేడియం నుండి పాల్గొన్న ఆయన సాయంత్రం అయిదు గంటలకు ఛాతీలో నొప్పిగా ఉందని పక్కవారికి చెప్పి అక్కడే కూలబడిపోయారు. ఆస్పత్రికి వెళ్లేలోపే ఈ లోకాన్ని వదిలారు. ఆప్తమిత్రుడి అంతిమ యాత్రలోనే జహీర్ ఖాన్ గుండెపోటుతో మరణించడం ఊహించని విషాదం. ఆయన వయసు 63 ఏళ్ళు.

ప్రజా సమస్యలపై స్పందించే గుణమున్న మానవతావాది జహీరుద్దీన్. పత్రిక నిర్వహణతో పాటు పేదలను చేరదీసి సాయపడడం ఆయన దినచర్య. రోజూ ఆయన సహాయం కోరేవారు ఆఫీసు వద్ద కనబడుతుంటారు. తన తండ్రి అబిద్ అలీ ఖాన్ స్థాపించిన పత్రికకు మేనేజింగ్ ఎడిటర్‌గా ఉంటున్న జహీర్ ఖాన్ ప్రజాస్వామ్య పరిరక్షణకు అగ్ర పీఠం వేశారు. ఆయన స్వయంగా నిర్వహించే 'సియాసత్ డాట్ కామ్'లో అన్ని రాజకీయ పార్టీల నేతల నడవడికను, ప్రజా వ్యతిరేక చర్యలను, తప్పుడు విధానాలను విమర్శించేందుకు వెనుకాడేవారు కాదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో ఆయన క్రియాశీలంగా పాల్గొనేవారు. తెలంగాణ ఉద్యమానికి వ్యక్తిగానూ, తమ పత్రిక తరఫునా పూర్తిస్థాయి మద్దతునిచ్చారు.

ఉన్నత కుటుంబంలో పుట్టిన జహీర్ ఖాన్ జీవన లక్ష్యాల్లో విలువలు గల పాత్రికేయ వృత్తితో పాటు దాతృత్వం కూడా ఉంది. తనలాంటి దయార్ద్ర హృదయులను ఏకం చేసి ఎన్నో సంస్థలను నెలకొల్పారు. 'మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరం' స్థాపించి పేదలకు ఎనలేని సేవలందించారు. ఎందరో పేద మహిళలకు ఇంగ్లీష్ మాట్లాడడంలో, టైలరింగ్, ఎంబ్రాయిడరీలలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించి బతుకు తోవ చూపించారు. కరోనా సమయంలో వందలాది మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. మతవాద పార్టీలకు యువత దూరంగా ఉండాలని పాతబస్తీ యువకులకు బోధిస్తూ, వారిని ఆధునిక విద్య వైపు మళ్ళించడానికి అనేక స్వచ్ఛంద కార్యక్రమాలను ఆరంభించారు.

తాను స్థాపించిన 'సియాసత్ మిల్లత్ ఫండ్' ద్వారా బిహార్, గుజరాత్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఉత్తర్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని వేల మంది పేదలకు కోట్లాది రూపాయల ఆర్థిక సహాయం అందించారు. 'అబిద్ అలీ ఖాన్ ట్రస్ట్' ద్వారా 1994 నుండి చదువులో రాణిస్తున్న పేద పిల్లలకు పై చదువుల కోసం సాయపడుతున్నారు. 1997లో మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరమ్ స్థాపించి మురికివాడల్లో ఉండే వారికి నెలవారీగా ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ కోసం ఒక కార్పొరేట్ హాస్పిటల్‌తో ఒప్పందం చేసుకున్నారు.



జహీరుద్దీన్ అలీ ఖాన్


వికారాబాద్‌లో వయసుడిగిన అనాథల కోసం 'సుకూన్' అనే వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. పేద ముస్లిం మహిళలకు సంబంధాల వెదుకులాటను, పెళ్లి ఖర్చులను తగ్గించేందుకు 2007లో 'దో బ దో' (ముఖాముఖి)ను ఏర్పాటు చేసి ఇప్పటికి 7 వేల కట్న ప్రసక్తి లేని వివాహాలను జరిపించారు. ఎన్నో ముస్లిం అనాథ శవాలకు అంత్యక్రియలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరిలో హరియాణాలోని భివాని ప్రాంతంలో కారులో కాలిపోయి చనిపోయిన నాసిర్, జునైద్ కుటుంబాలకు హైదరాబాద్ నుండి విరాళాలు సేకరించి అందించారు.

గద్దర్ మరణానికి ఒక రోజు ముందు జరిగిన విద్వేషపు విషగురు పుస్తకావిష్కరణ సభకు హాజరై అందరినీ పలకరించారు. పత్రిక నిర్వహణ బాధ్యతల్లో బిజీగా ఉంటూ ఇన్ని రకాల సామాజిక కార్యక్రమాలను చేపట్టడం ఎంతో గొప్ప విషయం. వీటన్నిటికీ జహీరుద్దీన్ అలీ ఖాన్ మరణం ఒక ఆశనిపాతమే.

వ్యాసకర్త తెలంగాణ గ్రామీణ బ్యాంకు విశ్రాంత అధికారి

బొమ్మలమ్మ బొమ్మలు దిష్టి బొమ్మలు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ. పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్ డబ్బ కాడ జమైతరు.

''పట్నంల గీ నడ్మ బొమ్మల దుక్నాలు బెట్టిండ్రు'' అని యాద్గిరి అన్నడు.

''కొండపల్లి బొమ్మల దుక్నాలా?'' సత్నారి అడిగిండు.

''కాదు.''

''నిర్మల్ బొమ్మల దుక్నాలా?''

''కాదు.''

''గాజు బొమ్మల దుక్నాలా?''

''కాదు.''

''చెక్క బొమ్మల దుక్నాలా?''

''గవి గుడ్క గాదు.''

''మన్నుతో జేసిన బొమ్మల దుక్నాలా?''

''కాదు.''

''గవి గాదంటవు, గివి గాదంటవు. మల్ల గవి ఏం దుక్నాలు?''

''దిష్టి బొమ్మలు దుక్నాలు.''

''దిష్టి బొమ్మల దుక్నాలా!''

''దివిలె ముంగట పటాకులకు గిరాకీ ఉంటది. గని దిష్టి బొమ్మలకు దినాం గిరాకీ ఉంటది.''

''ఇంతకు ముందు గుడ్క దిష్టి బొమ్మలున్నయి గదా. అవ్విటికి గిప్పుడు అమ్మేటి దిష్టి బొమ్మలకు ఫరక్ ఏమన్న ఉన్నదా?''

''ఉన్నది. ఇంతకుముందు లీడర్ల చెంచగాల్లు దిష్టి బొమ్మలను జేసెటోల్లు. గప్పుడు ముఖ్యమంత్రి దిష్టి బొమ్మ, గల్లి లీడర్ దిష్టి బొమ్మ ఒక్క తీర్గనే ఉండేది. గిప్పుడు కేసీఆర్ దిష్టి బొమ్మ కేసీఆర్ తీర్గనే ఉంటది. చెంద్రబాబు దిష్టి బొమ్మ చెంద్రబాబు తీర్గనే ఉంటది. రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ రేవంత్ రెడ్డి తీర్గనే ఉంటది. మోదీ దిష్టి బొమ్మ అచ్చం మోదీ తీర్గనే ఉంటది. దిష్టి బొమ్మలు రొండు తీర్ల ఉంటయి…''

''గవ్వేంటియి?''

''ఉత్త దిష్టి బొమ్మలు, మాట్లాడే దిష్టి బొమ్మలు. ఉత్త దిష్టి బొమ్మల దర తక్వ. మాట్లాడే దిష్టి బొమ్మల దర ఎక్వ. దర ఎక్వ అయినా మాట్లాడే దిష్టి బొమ్మనే ఎక్వమంది కొంటున్నరు. 'సన్నాసులు, దద్దమ్మలు' అని ఒక దిష్టి బొమ్మ అంటది. 'ఆ విధంగా ముందుకు పోతున్నం' అని ఒక దిష్టి బొమ్మ అంటది. 'నాకు తిక్కుంది. దానికో లెక్కుంది' అని ఒక దిష్టి బొమ్మ అంటది. 'చౌరస్తల చెప్పుతీస్కొని కొడ్త' అని ఇంకొక దిష్టి బొమ్మ అంటది. 'పాల క్యాన్లను సైకిల్‌కు కట్టుకోని అమ్మిన' అని మరో దిష్టి బొమ్మ అంటది. అన్ని దిష్టి బొమ్మలు అన్ని దినాలు అమ్ముడుబోవు. ఒక్కో దినం ఒక్కో దిష్టి బొమ్మకు గిరాకీ ఉంటది. దిష్టి బొమ్మలకు చౌరస్త డెలివరి గుడ్క ఉన్నది. దిష్టి బొమ్మల దుక్నాల్ల మెలలు, సూదులు, పాడెలు గూడ అమ్ముతుంటరు. దుక్నాల ముంగట నేడు నగదు – రేపు ఉద్దెర అని రాసి ఉన్న బోర్డు ఉంటది. ఒక్కోపారి లీడర్ దిష్టి బొమ్మకు మెలలు, సూదులు గుచ్చి పాడె మీద ఉంచుతారు. ఆ పాడెను చౌరస్త కాడ్కి మోస్కపోతరు. పాడె దించి దిష్టి బొమ్మను కిందపెడ్తరు. కొందరు చెప్పుతోని ఆ బొమ్మను కొడ్తరు. అంత అయినంక దిష్టిబొమ్మను తగలబెడ్తరు. ఎప్పుడన్న ఒకసారి పిండం గూడ బెడ్తరు. గాల్ల లెక్క ఉన్న దిష్టి బొమ్మలను తగ్గ బెట్టినందుకు లీడర్లు కోపానికి రారు. ఎవలియి ఎక్వ దిష్టి బొమ్మలు తగలబడ్తె గాల్లకు ఎక్వ పేరున్నట్టు లెక్క. దిష్టి బొమ్మల దుక్నాలే గాకుంట గవ్విటిని జేసేటి కార్ఖానలు గూడ ఉన్నయి. గవ్వి బెట్టితందుకు పారిన్‌కెల్లి అప్పులు గూడ దెస్తుంటరు. 'దార్కారినంటివి, పేరున్నదంటివి. ఒక్కడు ఇదువరదాంక నీ దిష్టి బొమ్మ తగ్గ బెట్టలేదు. నీకున్న పతార గిదేనా?' అని ఒక లీడర్ పెండ్లాం అడిగింది.''




గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టిండ్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

ఆర్తులను ఆదుకున్నాకే…

జెన్ బౌద్ధంలో విశ్వాసం ఉన్న టెట్సుజెన్ అనే ఆయన చీనీ భాషలో ఉన్న బౌద్ధ సూత్రాన్ని జపాన్ భాషలోకి అనువాదం చేసి ప్రచురించేందుకు నిర్ణయం తీసుకున్నాడు. ఆ కాలంలో చెక్క పలకలతో గ్రంథ ముద్రణ చెయ్యవలసి వచ్చేది. అలా ఏడువేల ప్రతులు ముద్రించటం అంటే మాటలు కాదు. అదొక బృహత్ కార్యం.

ఇందుకొరకు టెట్సుజెన్ ఊరూరా తిరిగి చందాలు వసూలు చేయటం మొదలు పెట్టాడు. అర్థం చేసుకొన్న కొందరు సానుభూతిపరులు నూరు బంగారు నాణేల వరకు ఇచ్చేవారు కానీ, ఎక్కువ మంది నుండి చిల్లర కాసులు మాత్రమే జమ అయ్యేవి. ఎవరు ఎంత ఇచ్చినా, అందరికీ సమానంగా కృతజ్ఞతలు చెప్పేవాడు. తను అనుకొన్న పని మొదలు పెట్టడానికి పదేళ్ళు పట్టింది.



ఆ సమయంలోనే 'ఉజి' నదికి వరదలు వచ్చాయి. కరువు తాండవించింది. గ్రంథ ముద్రణ కొరకు వసూలు చేసిన డబ్బు యావత్తు ప్రజల్ని కరువు కోరల నుండి రక్షించటానికి ఖర్చు చేశాడు. అప్పుడు మళ్ళీ నిధులు సేకరించటం మొదలు పెట్టాడు.

చాలా ఏళ్ళు గడిచాక, వింత అంటువ్యాధి ఒకటి దేశంలో ప్రబలి, ప్రజల్ని కలచివేసింది. తన ప్రజల్ని కాపాడేటందుకు, టెట్సుజెన్ తను కూడబెట్టిన డబ్బును ఉపయోగించాడు.

మూడోసారి మళ్ళీ తన పని మొదలు పెట్టాడు. ఇరవై ఏళ్ళ తర్వాత అతడి కోరిక నెరవేరింది. సూత్ర గ్రంథాల ముద్రణకు వాడిన చెక్క పలకలను ఇవాళ్టికి కూడా క్యోటోలో ఉన్న ఒబకు బౌద్ధ విహారంలో చూడవచ్చు.

జపాన్ దేశస్థులు తమ పిల్లలకు చెబుతుంటారు, టెట్సుజెన్ సూత్ర గ్రంథాలను మూడు విడతలుగా ముద్రించాడనీ, అదృశ్యంగా ఉన్న మొదటి రెండు ముద్రణ ప్రతులు, చివరివైన మూడవ ముద్రణ ప్రతుల కంటే ఎన్నో రెట్లు విలువైనవనీ.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: బ.దశమి ఉ.7.40 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: రోహిణి ఉ.7.31 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: ప.1.22 నుండి 3.02 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.16 నుండి 9.08 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.22 వరకు, అమృతఘడియలు: రా.11.21 నుండి 1.03 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.26.

ప్రజలకు సేవ చేసేవారికే టికెట్లు ఇవ్వాలి: ఎఫ్‌జీజీ

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు సేవ చేసేవారికి, పేద, మధ్య తరగతి వాళ్లకు మాత్రమే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్'(ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్‌కు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి చిత్తశుద్ధి పాటించాలని, నేర చరిత్ర ఉన్న వాళ్లకు టికెట్లు ఇవ్వొద్దని లేఖలో పేర్కొన్నారు.

డబుల్ డెక్కర్ | ఫ్లైఓవర్‌లకు గ్రీన్ సిగ్నల్

- 158 ఎకరాల అప్పగింతకు ఆర్మీ అంగీకారం
- మంత్రి కేటీఆర్ వినతుల నేపథ్యంలో స్పందించిన రక్షణ శాఖ
- రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవే మార్గాల్లో రెండు ప్రాజెక్టులకు తొలగిన అడ్డంకులు
- రెండు మార్గాలు 200 అడుగుల మేర విస్తరణ


నాగ్‌పూర్‌లోని డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్

కంటోన్మెంట్ (హైదరాబాద్): ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కైవేల ప్రాజెక్టు ఎట్టకేలకు పట్టాలెక్కనుంది. కీలకమైన స్థల సేకరణకు వీలుగా ఆర్మీ అంగీకారం తెలుపడంతో రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవే మార్గాల్లో రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు ప్రధాన అడ్డంకులు తొలగిపోయాయి. స్కైవేలకు ఆర్మీ స్థలాలు ఇవ్వడం లేదంటూ మంత్రి కేటీఆర్ పదే పదే ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులను కలిసి మరోసారి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో స్పందించిన రక్షణ శాఖ ఉన్నతాధికారులు తదనుగుణంగా చర్యలు చేపట్టాల్సిందిగా స్థానిక మిలటరీ అధికారులు (ఎల్ఎంఏ), కంటోన్మెంట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2017లోనే చేపట్టిన జాయింట్ సర్వేలో కొన్ని మార్పులు, చేర్పులతో తుది నివేదికను రూపొందించారు. రక్షణ వర్గాలు వెల్లడించిన సమాచారం మేరకు ప్రతిపాదిత రోడ్ల విస్తరణకు ఆర్మీ, కంటోన్మెంట్ 158 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించనుంది. ప్రైవేటు స్థలాలు దీనికి అదనం. ఇక ప్రతిపాదిత మార్గాల్లో ప్రస్తుత రోడ్లను 60 మీటర్ల (196 అడుగులు)కు విస్తరించనున్నారు.

ఎనిమిదేళ్ల క్రితమే ప్రతిపాదన

తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికే ఏఓసీ మార్గంలో రోడ్ల మూసివేత అంశం కొనసాగుతోంది. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కొలువు తీరాక ఈ ప్రాజెక్టును చేపట్టడంతో పాటు, సెక్రెటేరియట్‌ను కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేయాలని భావించింది. ప్రతిపాదిత సెక్రెటేరియట్ తూర్పు ద్వారం గుండా నేరుగా హకీంపేట వరకు రాజీవ్ రహదారి మీదుగా, పడమర ద్వారం గుండా సుచిత్ర వరకు మేడ్చల్ హైవే మీదుగా రెండు స్కైవేలు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా సూత్రప్రాయ అంగీకారం తెలుపడంతో పాటు ఆర్మీ, కంటోన్మెంట్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో జాయింట్ సర్వే కూడా పూర్తి చేశారు. ఈ మేరకు సెక్రెటేరియట్ కోసం 60 ఎకరాలు, స్కైవేలకు 90 ఎకరాల ఆర్మీ, కంటోన్మెంట్ స్థలాలు ఇవ్వాల్సి ఉంటుందని లెక్కతేల్చారు. అయితే విలువైన స్థలాలను కోల్పోతున్న నేపథ్యంలో కంటోన్మెంట్‌కు ఏటా రూ.31 కోట్ల చొప్పున సర్వీసు చార్జీ చెల్లించాలని ప్రతిపాదించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. సెక్రెటేరియట్ నిర్మాణ ప్రతిపాదనను కూడా విరమించుకుని, పాతభవనం తొలగించి నిర్మించారు.

90 కాదు..158 ఎకరాలు

వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఆర్‌డీపీ) కింద రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవే (ఎన్‌హెచ్–44) మార్గాల్లో స్కైవేల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. ఈ మార్గాల్లో రోడ్డును 150 అడుగుల మేరకు విస్తరించాలని నిర్ణయించారు. తాజాగా ఈ స్కైవేలను మెట్రో కోసం కూడా వినియోగించుకోవాలని నిర్ణయించారు. దీంతో రెండు మార్గాలను సుమారు 200 అడుగుల మేర విస్తరించనున్నారు. దీంతో గతంలో 90 ఎకరాల ఆర్మీ, కంటోన్మెంట్ స్థలం మాత్రమే అవసరం కాగా, ప్రస్తుతం 158 ఎకరాలు అవసరమని గుర్తించారు. ఈ ప్రతిపాదనకు ఆర్మీకూడా అంగీకరించడంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు మార్గం సుగమం అయ్యింది.

70 శాతం దుకాణాలు బంద్

ప్రతిపాదిత స్కైవేల నిర్మాణానికి స్థల సేకరణ చేపడితే కంటోన్మెంట్‌లో 70 శాతం కమర్షియల్ నిర్మాణాలు కనుమరుగు కానున్నాయి. ముఖ్యంగా రాజీవ్ రహదారి మార్గంలో సికింద్రాబాద్ క్లబ్ నుంచి అల్వాల్ వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ రోడ్డు కొన్నిచోట్ల 10 మీటర్ల నుంచి, గరిష్టంగా 30 మీటర్ల వరకు మాత్రమే ఉంది. తాజాగా ఈ రోడ్డును 60 మీటర్లకు విస్తరిస్తే రోడ్డుకు ఇరువైపులా వ్యాపార కేంద్రాలు దాదాపుగా తొలగించాల్సి వస్తుంది. ప్యారడైజ్–బోయిన్‌పల్లి మార్గంలోనూ కొన్ని వ్యాపార కేంద్రాలు రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించాల్సి వస్తుంది.

డీజీపీతో యూఎస్ కాన్సులేట్ ప్రతినిధి భేటీ

సాక్షి, హైదరాబాద్: యూఎస్ కాన్సులేట్ జనరల్ రెసిడెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ జి.నందుల గురువారం డీజీపీ అంజనీకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రత పరమైన అంశాలు, పరస్పర సహకారంపై ఇరువురు చర్చించుకున్నారు. అనంతరం తెలంగాణ పోలీస్ జ్ఞాపికను డీజీపీ నందులకు బహూకరించారు.

ఆదివాసీల అభివృద్ధే దేశాభివృద్ధి: గవర్నర్

గవర్నర్‌గా వచ్చాక ఆరు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నా


ఆదివాసీలతో కలిసి నృత్యం చేస్తున్న గవర్నర్

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): ప్రకృతితో మమేకమై స్వచ్ఛంగా ఉండే ఆదివాసీలు అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి చెందినట్లని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పేర్కొన్నారు. వారిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడమంటే దేశాన్ని ముందుకు తీసుకెళ్లడమేనని అభిప్రాయపడ్డారు. ఆధార్ సొసైటీ, ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమం సాంస్కృతిక సంస్థ, ఆదివాసీ విద్యార్థి మండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలకు ఆమె హాజరై మాట్లాడారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయడమంటే భగవంతుడికి సేవ చేయడమే నన్నారు. గవర్నర్‌గా ఇక్కడికి వచ్చాక ఆరు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకుని అక్కడ సర్వే చేయించగా...అక్కడి మహిళలు రక్తహీనతతో అధికంగా బాధపడుతున్నట్లు తేలిందని, వారికి ఐరన్ మాత్రలు పంపించగా...వాటిని తీసుకునేందుకు వారు ఇష్టపడలేదని వివరించారు. దీంతో ఐరన్ ఎక్కువగా లభించే మహువా పూలతో తయారు చేసిన లడ్డూలను పంపిణీ చేస్తే చాలా మంది మహిళలు రక్తహీనతనుంచి బయటపడ్డారని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆదివాసీలతో కలసి గవర్నర్ నృత్యాలు చేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ..ఆర్టికల్ 244 ప్రకారం ఆదివాసులకు ప్రత్యేక రక్షణ చట్టాలున్నాయని, కానీ వాటిని పరిరక్షించడం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆధార్ సొసైటీ జాతీయ అధ్యక్షులు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాతపెన్షన్ సాధన సాకారసభ

సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర ముగింపు సభను ఈనెల 12వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ తెలిపారు. గత నెల 16న ప్రారంభించిన యాత్ర ముగింపు సభను పాత పెన్షన్ సాధన సాకార సభ పేరుతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇటీవల కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఎస్‌డీఎల్‌తో ఒప్పందాన్ని ధిక్కరించి నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, తమ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేస్తామని చెప్పాయన్నారు. పెన్షన్ సాధనసాకార సభకు సీపీఎస్‌ను రద్దు చేసిన రాష్ట్రాల్లోని సీపీఎస్ యూనియన్ల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు హాజరవుతారని వివరించారు. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను ఈ సభకు ఆహ్వానించామని, అందరూ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఖాళీ పోస్టుల్లో నియమించండి

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్థక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులలో సీనియారిటీ ప్రకారం గోపాలమిత్రలను తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం పశుసంవర్థకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అదర్ సిన్హాను తెలంగాణ గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ముత్తయ్యలు కలిసి వినతి పత్రం సమర్పించారు. పశుసంవర్థకశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, కరోనా కాలంలో సైతం నిరంతరం పనిచేశామని వారు వివరించారు.

ఇజ్రాయెల్‌లోని పలు పంటల పరిశీలన

కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన వర్సిటీ వీసీ నీరజా ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: ఇజ్రాయెల్ తరహా కూరగాయల సాగుపై రాష్ట్ర రైతాంగానికి మెళకువలు అందిస్తామని కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ బి. నీరజా ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ హనుమంతరావు ఆధ్వర్యంలో జిల్లాల వ్యవసాయ అధికారులు, రైతుబంధు సమితి బాధ్యులు, శాస్త్రవేత్తలు మూడురోజులుగా ఇజ్రాయెల్ దేశంలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా అవకాడో, దక్షిణ ఇజ్రాయెల్‌లోని ద్రాక్ష, ఉత్తర ఇజ్రాయెల్‌లోని దానిమ్మతోటలను పరిశీలించారు. ఇజ్రాయెల్ పాటిస్తున్న యాంత్రీకరణ, వంగడాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ...నాణ్యత కలిగిన వంకాయ, నిమ్మ ఉత్పత్తిలో రైతుల అనుభవాలను, వాళ్లు పాటిస్తున్న శాస్త్రీయ మెళకువలను సేకరించామన్నారు. తక్కువ నీటి వనరులతో అత్యధిక ఉత్పాదకత, నాణ్యతను సాధిస్తున్నారని తెలిపారు.

అవిశ్వాసం.. శుభప్రదం

▶ మొదటి పేజీ తరువాయి

మీకు అండగా ఉన్నారంటూ మణిపూర్ మహిళలకు భరోసా కల్పించారు. అవిశ్వాసంపై జరిగిన చర్చలో టీడీపీ తరఫున ఎవరూ మాట్లాడలేదు. మోదీ ప్రసంగం అనంతరం సభలో అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో వీగిపోయింది. ప్రధాని ప్రసంగం ఆయన మాటల్లోనే...

2028లోనూ అవిశ్వాసం పెట్టండి

వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మేము మళ్లీ ఘన విజయం సాధించడం తథ్యం. రికార్డులను తిరగరాయడం ఖాయం. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మాకు శుభప్రదమే. 2018లో మాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. 2019లో జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించాం. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చాం. ఆ అవిశ్వాస తీర్మానం మాకు శుభ సూచకమని నిర్ధారణ అయ్యింది. ఇప్పుడు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మాకు శుభప్రదమే. 2018లో మాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. 2019లో జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించాం. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చాం. ఆ అవిశ్వాస తీర్మానం మాకు శుభ సూచకమని నిర్ధారణ అయ్యింది. ఇప్పుడు ప్రవేశపెట్టిన అవిశ్వాసం కూడా మాకు శుభాలు చేకూర్చబోతోంది. వచ్చే ఎన్నికల్లో నెగ్గబోతున్నాం. ప్రజలకు కుంభకోణాల రహిత, అవినీతి రహిత పాలన అందిస్తున్నాం. వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తాం. 2028లో కూడా మాపై మరో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడితే మన దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం తథ్యం. మా ప్రభుత్వంపై దేశ ప్రజలు మళ్లీ మళ్లీ విశ్వాసాన్ని కనబరుస్తున్నారు. అందుకు వారికి కృతజ్ఞతలు. ఈ పేదల బిడ్డను ప్రజలు ఆశీర్వదిస్తారు.

నార్త్‌ఈస్ట్‌... జిగర్ కా తుక్డా

ఈశాన్య ప్రాంతం మన దేశం హృదయంలో ఒక భాగం(జిగర్ కా తుక్డా). మణిపూర్‌లో హింస జరగడం నిజంగా బాధాకరం. మణిపూర్‌లో శాంతియుత పరిస్థితుల పునరుద్ధరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయి. త్వరలోనే అక్కడ శాంతి నెలకొంటుంది. మహిళలపై అరాచకాలను ఎంతమాత్రం సహించబోం. మహిళలను అవమానించిన వారిని, అకృత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తాం. మణిపూర్‌లో త్వరలోనే శాంతి నెలకొంటుందని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా. మణిపూర్ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు హామీ ఇస్తున్నా. దేశం మొత్తం మీకు అండగా ఉంది. పార్లమెంట్ మీకు అండగా ఉంది. మణిపూర్‌లో సమస్యలకు పరిష్కారాన్ని కచ్చితంగా కనుగొంటాం. మణిపూర్ త్వరలోనే మళ్లీ అభివృద్ధి పథంలో పయనిస్తుంది.

మహిళలపై నేరాలు క్షమార్హం కావు

మణిపూర్ హైకోర్టు నిర్ణయం తర్వాతే అక్కడ సమస్య మొదలైంది. చిన్నచిన్న సంఘటనలు ఉద్రిక్తతలకు దారితీశాయి. హింస చోటుచేసుకుంది. ఎన్నో కుటుంబాలను సమస్యలను ఎదుర్కొన్నాయి. చాలామంది తమ ఆప్తులను కోల్పోయారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగాయి. మహిళలపై నేరాలు క్షమార్హం కావు. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగడం ప్రతిపక్షాలకు ఎంతమాత్రం ఇష్టం లేదు. అందుకే నిత్యం ఉభయ సభల్లో ఉద్దేశపూర్వకంగా రగడ సృష్టిస్తున్నాయి. దేశ అభివృద్ధికి సంబంధించిన బిల్లులపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతలు చర్చ జరగనివ్వడం లేదు. వారికి దేశం కంటే పార్టీయే ముఖ్యమని నిరూపిస్తున్నారు. ప్రజలు వంచిస్తున్నారు. కాంగ్రెస్‌కు ప్రభుత్వంపై విమర్శలపై ఉన్న శ్రద్ధ పార్లమెంట్‌లో ఆమోదం పొందాల్సిన కీలక బిల్లులపై లేదు. విపక్షాలు నోబాల్స్ వేస్తుంటే అధికార పక్షం సెంచరీలు కొడుతోంది. మణిపూర్ విషయంలో రాజకీయాలు చేయొద్దని విపక్షాలను కోరుతున్నా. ప్రజల బాధలను తగ్గించే ఔషధంగా పనిచేయండి.

మా అంకితభావానికి నిదర్శనం

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గత తొమ్మిదేళ్లలో ఈశాన్య రాష్ట్రాల్లో 50 పర్యాయాల కంటే ఎక్కువే పర్యటించా. మా మంత్రులు 400 కంటే ఎక్కువసార్లు అక్కడ పర్యటించారు. ఇవి కేవలం గణాంకాలు కాదు. ఈశాన్యంపై మా ప్రభుత్వానికున్న అంకితభావానికి ఇదొక నిదర్శనం. ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1966 మార్చి 5న మిజోరాం ప్రజలపై వైమానిక దాడులకు పాల్పడింది. సొంత ప్రజలపై వైమానిక దాడుల చేసిన ఘటన దేశ చరిత్రలో ఇదొక్కటే. 1962లో భారత్–చైనా యుద్ధ సమయంలో ఈశాన్య ప్రాంతాల ప్రజలను అప్పటి నెహ్రూ ప్రభుత్వం గాలికొదిలేసింది. 1980వ దశకంలో పంజాబ్‌లో అకల్ తఖ్త్‌పై కాంగ్రెస్ సర్కారు సైనిక చర్యకు దిగింది. మణిపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తీవ్రవాదులు చెలరేగిపోయారు. ర్‌లోని వేర్పాటువాదులంటే విపక్ష నాయకులకు ఎంతో మక్కువ. వారు ఎక్కువగా వేర్పాటువాదులనే కలుస్తుంటారు. పాకిస్తాన్ మన సరిహద్దుల్లో దాడులు చేస్తోంది. ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి మన దేశంలోకి పంపిస్తోంది. భారత్‌లో ఉగ్రదాడులు జరిగితే పాకిస్తాన్ ఎలాంటి బాధ్యత తీసుకోదు. అయినా మన ప్రతిపక్ష నాయకులు పాకిస్తాన్‌నే సమర్థిస్తుంటారు. పాకిస్తాన్ దేశం ఏది చెబితే అది వాస్తవమని నిస్సిగ్గుగా వెనకేసుకొస్తారు. మన భారతగడ్డపై పాకిస్తాన్ ముష్కరులు దాడులు చేస్తున్నా ఆ దేశంతో చర్చలు జరపాలని మూర్ఖంగా వాదిస్తుంటారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

విపక్ష దుకాణం త్వరలో బంద్

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అహంకారులైన వారసత్వ రాజకీయ నాయకులతో నిండిపోయింది. విద్వేషం, విభజన, అత్యవసర పరిస్థితి, సిక్కులపై దాడులు, అబద్ధాలు, అవినీతి, కుంభకోణాలు, రెండంకెల ద్రవ్యోల్బణం, అస్థిరత, బుజ్జగింపు రాజకీయాలు, వారసత్వ రాజకీయాలు, నిరుద్యోగం, ఉగ్రవాదం.. ఇవన్నీ ప్రతిపక్షాల ఘనతలే. ప్రతిపక్ష నాయకులు గనుక అధికారంలోకి వస్తే దేశాన్ని రెండు శతాబ్దాలు వెనక్కి తీసుకెళ్తారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి బీటలువారిన ఇంటికి పూతలు పూసే ప్రయత్నంలా ఉంది. మా కూటమి ఎన్డీయే కేవలం అభివృద్ధి రాజకీయాలు చేస్తోంది. దేశం పేరు పెట్టుకున్న విపక్ష కూటమితో ఒరిగేదేమీ లేదు. విపక్షాల కొత్త దుకాణం త్వరలో బంద్ అవుతుంది. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. అది కేవలం లూటీ దుకాణం, విద్వేష బజార్. మా కూటమి ఎన్డీయే. దానికి రెండు 'ఐ' అక్షరాలు కలిపి 'ఇండియా' అని పెట్టుకున్నారు. అందులో ఒక 'ఐ' 26 పార్టీల అహంకారం. మరో 'ఐ' ఒక కుటుంబ అహకారం. పేరు మార్చుకున్నంత మాత్రాన పాత పాపాలను దాచలేరు. వారసత్వ రాజకీయాలు అంతం కావాలని మహాత్మాగాంధీ, అంబేడ్కర్, మౌలానా ఆజాద్ తదితర గొప్ప నాయకులు ఆకాంక్షించారు. కానీ, వారసత్వ రాజకీయాలు, డబ్బుతోనే ఒక కుటుంబం చుట్టూ 'ఇండియా' కూటమి ఏర్పాటైంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలు పెట్టనివ్వలేదు. స్కూళ్లలో జాతీయ గీతం పాడనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహంపై ముష్కరులు బాంబుదాడి చేశారు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో దారుణాలు జరిగాయి.

దాడులు చేస్తున్న దేశంతో చర్చలు జరపాలా?

కాంగ్రెస్‌కు, దాని మిత్రపక్షాలకు పాకిస్తాన్ అంటే ఎనలేని ప్రేమ. మనదేశంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడల్లా పాకిస్తాన్‌పై అనురాగం ప్రదర్శిస్తుంటాయి. భారతీయులను మనోభావాలను పక్కన పెట్టి పాకిస్తాన్‌ను సమర్థిస్తుంటాయి. విపక్షాలు ఎప్పుడూ పాకిస్తాన్‌నే నమ్ముతుంటాయి. భారతదేశపు అంతర్గత శక్తియుక్తులపై, భారత సైనికుల సామర్థ్యంపై ప్రతిపక్షాలకు విశ్వాసం లేదు. కశ్మీ

కాంగ్రెస్ నిర్వాకం వల్లే ఈశాన్యంలో సమస్యలు

పరాయి గడ్డ నుంచి దేశంలోకి వస్తున్న ముష్కర మూకలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ మాట్లాడిన దాఖలాలు లేవు. అందుకే కాంగ్రెస్ పట్ల దేశ ప్రజలు పూర్తి అవిశ్వాసం ప్రదర్శిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఒక విజన్ గానీ, విధానం లేవు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో దేశ ఆర్థిక వ్యవస్థ పాత్ర గురించి కాంగ్రెస్‌కు తెలియదు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి వెనుక తమ పాత్ర ఉందని ఆ పార్టీ చెప్పుకుంటోంది. అందులో ఎంతమాత్రం నిజంలేదు. ఈశాన్య రాష్ట్రాల్లో అన్ని సమస్యలకు కాంగ్రెస్, ఆ పార్టీ నీచ రాజకీయాలే మూలకారణం. అక్కడి ప్రజలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసింది. ఈశాన్యంతో నాకు భావోద్వేగ అనుబంధం ఉంది. ప్రధానమంత్రిని కాకముందే ఆ ప్రాంతంలో ఎన్నోసార్లు పర్యటించా.

రాహుల్.. విఫల ఉత్పత్తి

మన భరతమాత మృతి చెందాలని కొందరు ఎందుకు కోరుకుంటున్నారో అర్థం కావడం లేదు. భారతమాత హత్య అంటూ అనుచితంగా మాట్లాడడం భారతీయుల మనోభావాలను తీవ్రంగా గాయపర్చింది. ప్రజాస్వామ్యం హత్య, రాజ్యాంగం హత్య అంటూ మాట్లాడే ఈ వ్యక్తులే(కాంగ్రెస్ నాయకులు) భరతమాతను మూడు ముక్కలు చేశారు. బానిసత్వం నుంచి భరతమాతకు విముక్తి కలిగించే సమయం వచ్చినప్పుడు ఆమె అవయవాలను నరికేశారు. కాంగ్రెస్‌కు రాజకీయాలు చేయడం తప్ప మరేమీ తెలియదు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని పలుమార్లు రాజకీయాల్లో ప్రవేశపెట్టారు. ప్రతిసారీ ఆయన విఫలమయ్యారు. ఆయనొక 'విఫల ఉత్పత్తి'.

ప్రతిపక్షాల వద్ద 'రహస్య వరం'

ప్రతిపక్షాలు అహంకారానికి, అవిశ్వాసానికి మారుపేరు. వాటిది నిప్పుకోడి తరహా మనస్తత్వం. భారతదేశ కీర్తిప్రతిష్టలు అంతర్జాతీయ నూతన శిఖరాలకు చేరుతున్నాయి. ప్రజల్లో కొత్త ఉత్సహం, కొత్త శక్తి నిండుతోంది. ఈ నిజాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రతిపక్షాల వద్ద 'రహస్య వరం' ఏదో ఉన్నట్టుంది. ఇతరులకు చెడు జరగాలని వారు (విపక్ష నేతలు) కోరుకుంటే మంచి జరుగుతోంది. అందుకు నేనే ఉదాహరణ. గత 20 ఏళ్లుగా నన్ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. కానీ, నాకు ఏమీ కాలేదు. బ్యాంకింగ్ రంగంపై, ప్రభుత్వ రంగంలోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌పై, భారతీయ జీవిత బీమా సంస్థపై ప్రతిపక్షాలు ఎన్నో ఆరోపణలు చేశాయి. వాస్తవానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించాయి. హెచ్ఏఎల్ రికార్డు స్థాయిలో రెవెన్యూ సాధించింది. ఇక ఎల్ఐసీ అద్భుత పనితీరుతో లాభాల బాటలో దూసుకెళ్తోంది. విపక్షాలు ఇప్పుడేం చేయాలో తెలియక చివరకు దేశాన్ని శపిస్తున్నాయి. కానీ, మన దేశం మరింత శక్తివంతంగా మారుతోంది. ప్రభుత్వం సైతం బలోపేతం అవుతోంది. మూడో పర్యాయం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అప్పుడు మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. భారత్ ఇప్పుడు చాలా కీలక దశలో ఉంది. దీని ప్రభావం మరో వెయ్యేళ్లు ఉంటుంది. దేశ ప్రజల బలం, శ్రమ, కష్టపడే తత్వం వచ్చే వెయ్యి సంవత్సరాలకు బలమైన పునాది వేస్తాయి. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. దేశంలో ఐదేళ్లలో ఏకంగా 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు.

పాకిస్తాన్ జెండాలు మోసినవారే కాంగ్రెస్‌కు ఇష్టం

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉగ్రవాద మంటల్లో కశ్మీర్ చిక్కుకుంది. కశ్మీర్ ప్రజలను కాంగ్రెస్ విశ్వసించలేదు. హురియత్ కాన్ఫరెన్స్‌ను, వేర్పాటువాదులను, పాకిస్తాన్ జెండాలు మోసినవారిని కాంగ్రెస్ నమ్మింది. పాక్‌లో నక్కిన ముష్కరులపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించినప్పుడు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నానా యాగీ చేశాయి. మన సైనిక దళాల బలాన్ని విశ్వసించలేదు. మన శత్రువులు చెప్పిన దాన్నే విశ్వసించాయి. భారతదేశానికి వ్యతిరేకంగా ఎవరు ఏది మాట్లాడినా దాన్ని మరింత పెద్దది చేసి చూపి, సంబరపడే శక్తి ప్రతిపక్షాలకు ఉంది.

నేను ప్రధాని కావడం కాంగ్రెస్ జీర్ణించుకోవడం లేదు

నేను పేద కుటుంబం నుంచి వచ్చా. పేదల బిడ్డ అధికారంలోఉండడాన్ని గాంధీ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. దేశంలో 30 ఏళ్ల తర్వాత ప్రజలు పూర్తి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. నిరుపేద బిడ్డ ఉన్నత పదవిలో ఉండడం ఏమిటని కాంగ్రెస్ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. వారు(కాంగ్రెస్ నాయకులు) గతంలో విమానాల్లో పుట్టిన రోజు కేకులు కట్ చేసుకున్నారు. మనం అదే విమానాల్లో వ్యాక్సిన్లు రవాణా చేశాం. వారు తమ దుస్తులను విమానాల్లో పంపించుకున్నారు. నేడు పేదలు సైతం విమానాల్లో ప్రయాణిస్తున్నారు. వారు నావికాదళం నౌకలను విందులు వినోదాల కోసం వాడుకున్నారు. అది 'ఇండియా' కాదు, ముమ్మాటికీ అహంకార కూటమి. అందులోని ప్రతి నాయకుడు పెళ్లి కొడుకు(ప్రధానమంత్రి) కావాలను



కుంటున్నారు. కాంగ్రెస్‌ను ఒక విదేశీయుడు స్థాపించారు. ఆ పార్టీ జెండా, పార్టీ గుర్తు, సిద్ధాంతాలు ఇతరుల నుంచి దొంగిలించినవే. అహంభావం వల్లే కాంగ్రెస్ 400 సీట్ల నుంచి 40 సీట్లకు పడిపోయింది. బెంగళూరులో 'యూపీఏ'కు సమాధి కట్టిన విపక్ష స్నేహితులకు ఇదే నా సానుభూతి.



పార్లమెంట్ నుంచి బయటకు వస్తున్న సోనియా, రాహుల్ గాంధీ

మోదీకి కాంగ్రెస్ ఫోబియా

- రావణుడిలా అహంకారి: కాంగ్రెస్
- వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదని జోస్యం
- లోక్‌సభ నుంచి విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ ఫోబియాలో నిండా కూరుకుపోయారని ఆ పార్టీ ఎద్దేవా చేసింది. అందుకే గురువారం లోక్ సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చకు బదులిచ్చే క్రమంలో దాదాపు రెండు గంటల ప్రసంగంలో ఆసాంతం కాంగ్రెస్‌పై విమర్శలకే పరిమితమయ్యారని విమర్శించింది. ప్రధాన సమస్య అయిన మణిపూర్ జాతుల హింసాకాండను కేవలం ప్రస్తావనతో సరిపెట్టారని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ దుయ్యబట్టారు. ప్రధాని ప్రసంగంలో మణిపూర్ ప్రస్తావన లేదని ఆరోపిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్, సహా పలు విపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం పార్లమెంట్ ఆవరణలో నేతలు మీడియాతో మాట్లాడారు. బీజేపీది కుహనా జాతీయవాదమని గొగొయ్ ఆరోపించారు. వాళ్లసలు దేశ భక్తులే కారన్నారు. 'మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయడంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ ఆపసోపాలు పడుతోంది. విపక్ష ఇండియా కూటమి నిండు సభలో తన కళ్ల ముందే ఒక్కతాటిపై రావడం, ఇండియా, ఇండియా అంటూ నినాదాలతో హోరెత్తించడాన్ని మోదీ భరించలేకపోయారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఇండియా కూటమి పోరాడుతుంది. 2024 సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఓడించి అధికారంలోకి వస్తుంది' అని ధీమా వెలిబుచ్చారు. 'మేం లేవనెత్తిన మూడు ప్రశ్నలకు బదులివ్వనందుకు, మణిపూర్ బీజేపీ ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు, అన్ని రకాలుగా విఫలమైన మణిపూర్ సీఎంకు క్లీన్ చిట్ ఇచ్చినందుకు, మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులపై మౌనంగా ఉన్నందుకు... ఇలాంటి పలు కారణాలతో మేం వాకౌట్ చేశాం' అని వివరించారు. 'రావణుడు తనను తాను మహా మేధావిని అనుకునేవాడు. కానీ అహంకారమే అతని పతనానికి కారణమైంది' అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, విదేశీ చట్ట సభల్లో పేరు గొప్ప ప్రసంగాలు మాని మన పార్లమెంటులో దేశ సమస్యలకు సమాధానాలు ఇచ్చేలా చేయడమే మా అవిశ్వాస తీర్మానం లక్ష్యం. రోజుల తరబడి పోరాడి మోదీని లోక్ సభకు రప్పించడంలో ఇండియా కూటమి విజయం సాధించింది. కానీ రాజ్యసభలో కూడా చర్చలో పాల్గొనాలనే ఇంగితం ఆయనలో లేకపోయింది' అంటూ తూర్పారబట్టారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాట్లాడుతూ..'మణిపూర్ అంశంపై మాట్లాడాలని ప్రధానిని కోరాము. ఒక గంటా 45 నిమిషాల ప్రసంగం ముగిసినా మణిపూర్ పేరును ఆయన ప్రస్తావించనేలేదు. ఆయన మొత్తం రాజకీయాలపైనే మాట్లాడారు. అందులో కొత్తేముంది? గతంలో మాదిరిగానే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేశారు. దేశ ప్రజలకు ఆయన చెప్పేదేమిటో మనకు తెలియదా? అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన ప్రశ్నలకు ఆయన ప్రసంగంలో ఎటువంటి సమాధానాల్లేవు'అని అన్నారు. డీఎంకే ఎంపీ టీఆర్ బాలు మాట్లాడుతూ..మణిపూర్ సహా దేశంలో హింసాత్మక ఘటనలు జరుగుతున్న మిగతా ప్రాంతాల్లో పరిస్థితులపై ప్రధాని మోదీ మాట్లాడతారని మేమంతా ఎదురుచూశాం. ఆయన మాత్రం రాజకీయ ప్రసంగం చేశారు. అవిశ్వాస తీర్మానం లక్ష్యం నెరవేరలేదు. ఆయన ప్రసంగానికి అంతరాయం కలిగించాం. ఆయన స్పందించలేదు'అని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం మాట్లాడుతూ..దేశ చరిత్రలో గొప్ప స్పిన్నర్ ఎవరనే చర్చ ముగిసింది. అది ఎవరో కాదు ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వమే. 90 నిమిషాల ప్రసంగంలో అసలు అంశం మణిపూర్‌పై ప్రసంగించలేదు. ప్రధాని సభకు వచ్చి, మణిపూర్ సమస్యపై ప్రభుత్వం ఏం చేస్తుందనే విషయం చెబుతారనే లక్ష్యంతోనే అవిశ్వాస తీర్మానం పెట్టాం. ఇది దేశ సమగ్రతకు అవమానం . అందుకే మేం వాకౌట్ చేశాం'అని తెలిపారు.

అధిర్ రంజన్ చౌదరి సస్పెన్షన్

అప్రజాస్వామికం: కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ: లోక్ సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరిపై సస్పెన్షన్ వేటు పడింది. సభా కార్యకలాపాలకు పదేపదే అడ్డు తగులుతున్నారనే అభియోగాలపై స్పీకర్ ఓం బిర్లా గురువారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అధీర్‌పై అధికార బీజేపీ పక్షం మోపిన అభియోగాలపై సభా హక్కుల సంఘం విచారణ జరపనుంది. అప్పటిదాకా ఆయనపై సస్పెన్షన్ అమల్లో ఉండనుంది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. దీన్ని నమ్మశక్యం కానీ అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించింది. ప్రధాన ప్రతిపక్ష నేతను ఇలా సస్పెండ్ చేయడం బహుశా పార్లమెంట్ చరిత్రలోనే తొలిసారి అని ఎద్దేవా చేసింది. అధీర్ సస్పెన్షన్ తీర్మానాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ సభలో ప్రవేశపెట్టారు. అధీర్ పదేపదే సభా కార్యకలాపాలకు అడ్డు తగులుతున్నారని అందులో ఆరోపించారు. ముఖ్యంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల ప్రసంగాలకు పదే పదే అడ్డు తగులుతూ వస్తున్నారని పేర్కొన్నారు. 'ఇలా ప్రవర్తించడం ఆయనకు పరిపాటిగా మారింది. సభలో అతి పెద్ద విపక్ష నేతగా ఇలా చేయడం చాలా దురదృష్టకరం. చర్చల్లో అధీర్ నిత్యం నిరాధార ఆరోపణలు చేస్తారు. ఎన్నిసార్లు హెచ్చరించినా ఆయన తీరు మెరుగు పడలేదు. ఎన్నడూ కనీసం క్షమాపణలు చెప్పరు. ఈ రోజూ అంతే. కేంద్ర హోం మంత్రిపై కూడా ఇలాంటి ఆరోపణలే చేశారు. సభా అన్నా, స్పీకర్ స్థానమన్నా ఆయనకు గౌరవమే లేదు' అన్నారు. సస్పెన్షన్ తీర్మానాన్ని మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. గురువారం చర్చ సందర్భంగా అధీర్, బీజేపీ ఎంపీ వీరేంద్ర సింగ్ ప్రవర్తన హుందాగా లేదని ఓం బిర్లా అన్నారు. దాంతో వీరేంద్ర క్షమాపణలు తెలిపారు.

అనంతరం అధీర్ పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సభలో తాను మోదీని అవమానించలేదని స్పష్టం చేశారు. అది తన ఉద్దేశం కూడా కాదన్నారు. మణిపూర్ హింసాకాండపై మోదీ నీరవ్ (నిశ్శబ్దం)గా ఉన్నారంటూ తూర్పారబట్టారు. 'మోదీకే తననేదో అవమానించారని అనిపించలేదు. కానీ ఆయన దర్బారీలు (సహచర మంత్రులు, ఎంపీలు) మాత్రమే అలా అనుకున్నారు' అని ఎద్దేవా చేశారు.

కాషాయీకరణ 'క్విట్ ఇండియా'

పాలకుడు ధృతరాష్ట్రుడిలా అంధుడైతే మహిళలను రక్షించేదెవరు?

- మణిపూర్ ప్రజలకు ప్రధాని మోదీ శాంతి సందేశం ఇవ్వాలి
- లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి డిమాండ్

న్యూఢిల్లీ: కాషాయీకరణను, మత శక్తుల ఏకీకరణను, మతతత్వాన్ని దేశం నుంచి తరిమికొట్టాల్సిన సమయం వచ్చిందని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదర అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో గురువారం జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. అవినీతి క్విట్ ఇండియా అంటూ బీజేపీ ఇచ్చిన నినాదాన్ని తిప్పికొట్టారు. క్విట్ ఇండియా ఉద్యమం జరగాల్సిందేనని చెప్పారు. కాషాయీకరణ, మతతత్వం క్విట్ ఇండియా అని సభలో అధిర్ రంజన్ నినదించారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే..

కేవలం ఒక రాష్ట్ర సమస్యగా చూడొద్దు

''నరేంద్ర మోదీ 100సార్లు ప్రధానమంత్రి అయినా మాకు ఎలాంటి ఆందోళన, అభ్యంతరం లేదు. మా ఆందోళన అంతా దేశ ప్రజల గురించే. మణిపూర్ ప్రజలకు ప్రధానమంత్రి స్వయంగా శాంతి సందేశం ఇవ్వాలని మా పార్టీ కోరుతోంది. మణిపూర్ హింసాకాండ గురించి 'మన్ కీ బాత్'లో కనీసం ఒక్కసారైనా మోదీ మాట్లాడాలని మేము ఆకాంక్షిస్తున్నాం. మణిపూర్‌లో హింస అనేది సాధారణ అంశం కాదు. ఆ రాష్ట్రంలో తెగల మధ్య ఘర్షణ



జరుగుతోంది. పౌర యుద్ధం కొనసాగుతోంది. మణిపూర్ హింస మొత్తం ప్రపంచం దృష్టిలో పడింది. యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌తోపాటు అమెరికాలోనూ దీనిపై చర్చ జరిగింది. మణిపూర్ వ్యవహారాన్ని కేవలం ఒక రాష్ట్ర సమస్యగా చూడొద్దు. అందుకే ప్రధానమంత్రి స్వయంగా కలుగజేసుకోవాలని, మణిపూర్‌లో పరిస్థితిని చక్కదిద్దాలని, శాంతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రధానమంత్రిని లోక్‌సభకు రప్పించడానికి అవిశ్వాస తీర్మానం మినహా మాకు (విపక్ష 'ఇండియా' కూటమి) మరో మార్గం లేకుండా పోయింది.

బఫర్ జోన్.. ప్రజల మధ్య వద్దు

అది హస్తినాపురం అయినా, మణిపూర్ అయినా మహిళలపై అకృత్యాలు, అత్యాచారాలు జరుగుతూ ఉంటే దేశాన్ని పరిపాలించే రాజు అంధుడిగా వ్యవహరించకూడదు. కఠిన చర్యలు ఉపక్రమించాలి. దోషులను శిక్షించాలి. దేశాన్ని ఏలే పాలకుడు అంధుడైన ధృతరాష్ట్రుడిలా మిన్నకుండిపోతే ఇక మహిళలకు రక్షణ కల్పించేదెవరు? మణిపూర్‌లో రెండు వర్గాల ప్రజల మధ్య 'బఫర్ జోన్'ను ప్రభుత్వం సృష్టించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బుధవారం సభలో చెప్పారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. బఫర్ జోన్ అనేది రెండు దేశాల మధ్య ఉంటుంది. అంతేతప్ప ప్రజల మధ్య ఉండడం తగదు. అవిశ్వాస తీర్మానంపై సభలో మాట్లాడేందుకు మణిపూర్‌కు చెందిన ఇద్దరు ఎంపీలు ప్రయత్నిస్తే స్పీకర్ అనుమతించకపోవడం దారుణం'' అని అధిర్ రంజన్ చౌదరి అసంతృప్తి వ్యక్తం చేశారు.

అధిర్ రంజన్ వ్యాఖ్యలు తొలగింపు

లోక్‌సభలో అధిర్ రంజన్ చేసిన వ్యాఖ్యలపై హోంమంత్రి అమిత్ షా తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రధాని మోదీని ధృతరాష్ట్రుడితో పోల్చడం ఏమిటని నిలదీశారు. అధిర్ రంజన్ వ్యాఖ్యల రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్లా చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ సైతం అధిర్ రంజన్ వ్యాఖ్యలను ఖండించారు. సభకు, దేశానికి అధిర్ రంజన్ క్షమాపణ చెప్పాలని సోషల్ మీడియాలో డిమాండ్ చేశారు.

పటిష్టంగా భారత్ ఆర్థిక వ్యవస్థ

- ప్రపంచ దేశాల కంటే మెరుగ్గా ఉన్నాం
- ప్రధాని మోదీ పాలనలో సమూల మార్పులతో ఆర్థిక పురోగతి
- అవిశ్వాసంపై చర్చలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కష్టాల్లో ఉన్న సమయంలో భారత ప్రభుత్వం తన భవిష్యత్ వృద్ధిపై ఆశాజనకంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తాము ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తూ పాలనలో సమూల మార్పులు తీసుకువచ్చిందన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో గురువారం నిర్మలా సీతారామన్ మాట్లాడారు. అమెరికా, యూకే, యూరోజోన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఎన్నో ఆర్థిక సవాళ్ల మధ్య ఉన్నాయని, అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా కూడా వినియోగదారుల డిమాండ్లు, వేతనాల స్తబ్దత వంటి సమస్యలనెదుర్కొంటోందని తెలిపారు. ''ప్రపంచబ్యాంకు గణాంకాల ప్రకారం 2022లో ప్రపంచ ఆర్థిక పురోగతి 3%గా ఉంది. 2023 నాటికి అది 2.1శాతానికి పడిపోయింది. అదే సమయంలో మోర్గన్ స్టేన్లీ సంస్థ 2013లో భారత ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉందని పేర్కొంది. అదే సంస్థ తాజాగా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్‌ను గుర్తించింది. కేంద్రం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే దీనికి కారణం'' అని చెప్పారు.

మిలేగా స్థానంలో మిల్‌గయా

ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ



నినాదం గరీబీ హఠావో నినాదాన్ని సీతారామన్ ఎగతాళి చేస్తూ వాస్తవంగా పేదరికం తొలగిపోయిందా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక పరిపాలనలో సమూల మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. ఒకప్పుడు మిలేగా (లభిస్తుంది) అన్న పదం స్థానంలో ఇప్పుడు మిల్‌గయా (అన్నీ అందాయి) అని ప్రజలు చెప్పుకునే స్థాయికి పాలన వెళ్లిందన్నారు. అవినీతి, బంధుప్రీతితో దశాబ్దాల పాటు కాంగ్రెస్ సమయాన్ని వృథా చేసిందని, అన్ని సంక్షోభాల్ని అవకాశాలుగా అందిపుచ్చుకొని ముందుకు వెళుతున్నామన్నారు. నిర్మలా సీతారామన్ ప్రసంగంలో తమిళనాడు ప్రస్తావన వచ్చినప్పుడల్లా తమిళంలో మాట్లాడారు. సెంగోల్ (రాజదండం) గురించి ఆమె ప్రస్తావిస్తూ దానిని ఎక్కడో మ్యూజియంలో పడేశారని అది తమిళనాడు ఆత్మగౌరవాన్ని అవమానించడం కాదా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సెంగోల్‌ను లోక్‌సభలో ప్రతిష్టించి సముచిత స్థానాన్ని కల్పించారన్నారు. అదే సమయంలో ఆమె సభను పక్కదారి పట్టిస్తున్నారంటూ కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, లెఫ్ట్ పార్టీల ఎంపీలు వాకౌట్ చేశారు.

నిండుసభలో జయలలిత చీర లాగారు

మణిపూర్‌లో మహిళల అకృత్యాల గురించి సీతారామన్ ప్రస్తావిస్తూ కేవలం మణిపూర్ మాత్రమే కాదు మహిళల్ని అవమానపరిచే, కించపరిచే ఘటనలు రాజస్తాన్, ఢిల్లీ ఇలా ఏ రాష్ట్రంలో జరిగినా ఆందోళన కలిగిస్తాయన్నారు. ఈ ఘటనలు ఎక్కడ జరిగినా తీవ్రంగా పరిగణించాలన్నారు. మణిపూర్ అంశంపై ప్రసంగించిన డీఎంకే ఎంపీ కనిమొళికి ఈ సందర్భంగా ఒక ఘటనను గుర్తు చేయాలనుకుంటున్నాను అంటూ తమిళనాడు అసెంబ్లీలో జయలలితకు జరిగిన పరాభవం గురించి ప్రస్తావించారు. ''జయలలిత ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్నప్పుడు 1989 మార్చి 25న పరమ పవిత్రమైన నిండు సభలో ఆమె చీరను లాగారు. డీఎంకే సభ్యులు అదంతా చూస్తూ జయలలితను గేలి చేశారు. ఆమెను చూసి నవ్వుకున్నారు. రెండేళ్ల తర్వాత జయలలిత ముఖ్యమంత్రిగా మళ్లీ అసెంబ్లీలో అడుగుపెట్టారు. తమిళనాడు అసెంబ్లీలో జయలలితను పరాభవించినప్పుడు అధికారంలో ఉన్న పార్టీ వారు ఇప్పుడు విపక్ష నేతలుగా ద్రౌపదికి చీర లాగడం గురించి మాట్లాడుతున్నారు'' అని డీఎంకేకి చురకలు అంటించారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



ఇంట్లోకి వెళ్లి.. కంట్లో కారం చల్లి

ఇంట్లో ఉన్న ఓ యువకుడిపై కొందరు పోకిరీలు చొరబడి కంట్లో కారంచల్లి దాడి చేసి సెల్‌ఫోన్‌తో పాటు నగదును అపహరించుకుపోయారు. -8లో



నకిలీ రూ.2వేల నోట్ల మార్పిడికి యత్నం

నకిలీ రూ.2 వేల నోట్లను మార్చేందుకు యత్నిస్తున్న నలుగురు వ్యక్తులను కాలాపత్తర్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.69 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. -8లో


ఓటీపీ కోసం సిమ్ స్వాపింగ్



వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) చెప్పని వినియోగదారుల్ని సిమ్ స్వాపింగ్‌తో ఆన్‌లైన్ మోసగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. సిమ్‌కార్డుల్ని బ్లాక్ చేయించి తమ 'పని' పూర్తి చేసుకుంటున్నారు. -8లో

న్యూస్‌రీల్

ప్యాంట్ జేబులో 553 గ్రాముల బంగారం



శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని తనిఖీ చేయగా ప్యాంట్‌కు ప్రత్యేకంగా కుట్టించుకున్న జేబులో 553 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ. 33.53 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మంత్రులు తలసాని, మహమూద్ అలీ



చార్మినార్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సద్వినియోగం చేసుకొనే విధంగా చూడాలని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ అన్నారు. గురువారం చాంద్రాయణగుట్ట, చార్మినార్, మలక్ పేట, బహదూర్‌పురా, యాకత్‌పురా, నాంపల్లి, గోషామహల్, కార్వాన్, కంటోన్మెంట్ తదితర నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గాల పరిధిలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నగేష్, నియోజకవర్గ ఇన్‌చార్జులు ఆనంద్ గౌడ్, నందు బిలాల్, బాక్రి, ఆజం అలీ, రాంరెడ్డి, సలావుద్దీన్ లోధీ, శ్యాంసుందర్ రెడ్డి, జీవన్ సింగ్, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, లాస్య నందిత, మమతా సంతోష్ గుప్తా, పరమేశ్వరి సింగ్ పాల్గొన్నారు.

రూపాయికే బస్సు ప్రయాణం

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్-సిటీ ఎలక్ట్రిక్ ఏసీ కోచ్ సేవలందించే న్యూగో సంస్థ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రూపాయికే బస్సు ప్రయాణ ఆఫర్‌ను అందిస్తోంది. ఈ నెల 15న తమ రవాణా మార్గాల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా కేవలం రూపాయితోనే ప్రయాణించవచ్చని పేర్కొంది. ఈ సందర్భంగా గ్రీన్‌సెల్ మొబిలిటీ సీఈఓ దేవేంద్ర చావ్లా మాట్లాడుతూ.. పర్యావరణ స్థిరత్వంతో పాటు దేశాన్ని పచ్చదనంగా మార్చడానికి ఈవీ సేవలు కొనసాగిస్తున్నామని తెలిపారు. పర్యావరణహిత ప్రయాణాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంలో భాగంగా ఈ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. పంద్రాగస్టు రోజున ఈ ప్రయాణ ఆఫర్‌ను పొందడానికి బుకింగ్స్ మొదలయ్యాయని, రాష్ట్రంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు తమ రవాణా సేవలు కొనసాగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఇండోర్- భోపాల్, ఢిల్లీ-చండీగఢ్, ఢిల్లీ- ఆగ్రా, ఢిల్లీ-జైపూర్, ఆగ్రా-జైపూర్, బెంగళూరు-తిరుపతి, చెన్నై-తిరుపతి, చెన్నై-పుదుచ్చేరి తదితర మార్గాల్లో తమ సేవలు కొనసాగుతున్నాయని, దేశమంతా ఈ ఆఫర్ వర్తిస్తుందని వివరించారు. బుకింగ్స్ కోసం న్యూగో వెబ్‌సైట్ https:// nuego. in/ booking, సంస్థ అధికారిక మొబైల్ అప్లికేషన్లలోనూ బుకింగ్ చేసుకోవచ్చని దేవేంద్ర చావ్లా తెలిపారు.



పంద్రాగస్టు వేడుకలు సమీపిస్తుండటంతో జాతీయ జెండాలకు డిమాండ్ పెరిగింది. నగరంలోని అంబర్‌పేటలో కొందరు మహిళలు ఉపాధి కోసం త్రివర్ణ పతాకాల తయారీలో నిమగ్నమయ్యారు. జెండాలను మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు.

మువ్వన్నెల ముస్తాబు

ఎక్స్‌ప్రెస్ వేగంతో ఎయిర్‌పోర్టు మెట్రో

విమానాశ్రయంలో మెట్రో డిపోకు జీఎమ్మార్ 48 ఎకరాలు ఇవ్వాలి

- నగరం నలువైపులా మెట్రో విస్తరణతోనే విశ్వనగరం వైపు పరుగులు
- ప్రయాణికుల రద్దీ మేరకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలి
- బీహెచ్ఈఎల్- లక్డీకాపూల్, ఎల్బీనగర్- నాగోల్‌పై కేంద్రంతో సమన్వయం
- హైదరాబాద్ మెట్రో రైల్ మాస్టర్ ప్లాన్‌పై మంత్రి కేటీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష
- నగర భవిష్యత్తు కోసం భారీగా మెట్రో విస్తరణ అవసరమన్న మంత్రి

సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టును వేగంగా పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఇప్పటికే మంత్రిమండలి తీర్మానం ప్రకారం నగరం నలువైపులా మెట్రో విస్తరణ కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై కసరత్తు చేపట్టింది. ఈ మేరకు మంత్రి కేటీఆర్ గురువారం బేగంపేట్‌లోని మెట్రో భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ మెట్రో రైల్ మాస్టర్ ప్లాన్, ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్, జయేష్ రంజన్ తదితర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందేందుకు బలమైన ప్రజారవాణా వ్యవస్థ ఎంతో అవసరమని, అందుకు మెట్రో రైల్ విస్తరణ దోహదం చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ విస్తరణకు అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ దిశగా మెట్రో రైల్ విస్తరణ పనులను కూడా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని, కాలుష్యాన్ని తగ్గిస్తూ విశ్వ నగరంగా మార్చాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా నగరానికి మరిన్ని భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం కూడా ఉంటుందన్నారు.

రద్దీ మేరకు అదనపు కోచ్‌లు..

ప్రస్తుతం నగరంలో మెట్రో ప్రయాణికుల సంఖ్య 5 లక్షలు దాటింది. రోజురోజుకూ మెట్రోకు ఆదరణ పెరుగుతోంది. పలు మార్గాల్లో అనూహ్యంగా రద్దీ పెరిగింది. ఇందుకనుగుణంగా మెట్రో రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలని కేటీఆర్ సూచించారు. మెట్రో లాస్ట్‌మైల్ కనెక్టివిటీపైన దృష్టి సారించాలని, ఎక్కువ మంది ప్రయాణికులను మెట్రో వైపు ఆకర్షించడం వల్ల వ్యక్తిగత వాహనాల వినియోగం గణనీయంగా తగ్గడమే కాకుండా మెట్రో ప్రయాణికుల సంఖ్య కూడా రెట్టింపవుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం ఫీడర్ సర్వీసులను పెంచాలని చెప్పారు. ఈ సందర్భంగా మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎయిర్‌పోర్టుమెట్రో ఎక్స్‌ప్రెస్‌వేతో పాటు, ప్రభుత్వం ప్రకటించిన హైదరాబాద్ మెట్రో రైల్ మాస్టర్ ప్లాన్ ప్రణాళికలపై పూర్తి వివరాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



మెట్రో డిపోకు 48 ఎకరాలు ఇవ్వాలి..

రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 31 కిలోమీటర్ల మార్గంలో చేపట్టనున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌వేపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. 48 ఎకరాల భూమిని జీఎంఆర్ ఆధ్వర్యంలోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ వర్గాలు వెంటనే మెట్రో డిపో కోసం కేటాయించాలని ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోకు భూమిని అప్పగించాలని కోరారు. మరోవైపు మెట్రో విస్తరణ ప్రణాళికలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మంత్రి కేటీఆర్ సూచించారు. ఇప్పటికే సవివరమైన నివేదికలను సిద్ధం చేసిన బీహెచ్ఈఎల్- లక్డీకాపూల్, ఎల్బీనగర్- నాగోల్ కారిడార్‌లపై కేంద్రం నుంచి రూ.9100 కోట్ల అంచనా వ్యయంలో కొంత ఆర్థిక సహాయాన్ని అడిగామని, దీనికి సంబంధించిన అంశాన్ని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నివేదికలను సిద్ధం చేయండి...

నగరం నలువైపులా భారీగా మెట్రో విస్తరించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆయా మార్గాలలో వెంటనే అవసరమైన సర్వేలను చేపట్టి ప్రాథమిక నివేదికలను, అనంతరం సవివరమైన ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయాలని మంత్రి మెట్రో రైల్ అధికారులను ఆదేశించారు. మెట్రో రైల్ విస్తరణలో భాగంగా మెట్రో స్టేషన్లతో పాటు భారీ కార్ పార్కింగ్ కాంప్లెక్సుల నిర్మాణానికి ప్రభుత్వ అధీనంలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించాలని హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, జిల్లాలకు చెందిన కలెక్టర్లను మంత్రి కేటీఆర్ ఆదేశించారు.

వేగంగా పాతబస్తీ మెట్రో..

అనంతరం మంత్రి కేటీఆర్‌తో ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సమావేశమయ్యారు. పాతబస్తీ మెట్రోను వేగంగా చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో కారిడార్ కి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను చేపట్టామని త్వరలోనే కారిడార్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న మార్గాన్ని ఎయిర్‌పోర్టు మెట్రో వరకు పొడిగించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని మంత్రి కేటీఆర్ మెట్రో అధికారులకు సూచించారు.

వడివడిగా..

ఎన్నికల పనుల కోసం

- నోడల్ అధికారుల నియామకం



సాక్షి, సిటీబ్యూరో: రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఓటరు జాబితా నుంచి పోలింగ్ ముగిసేంత వరకు ఎక్కడ, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితా సవ్యంగా ఉండేందుకు ఇప్పటికే రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల సహకారం తీసుకుంటుండంతో పాటు ప్రజలకు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఎన్నికల సంఘం ఆదేశాల కనుగుణంగా ఎన్నికల ప్రక్రియలో అవసరమైన వివిధ కార్యక్రమాల కోసం, ఆయా అంశాల వారీగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లలో మునిగారు.

ఇవి కీలకం..

- హైదరాబాద్‌లోని అన్ని పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సిబ్బందిని నియమించడం కత్తిమీద సామే. వేలసంఖ్యలో ఉద్యోగులు ఇందుకు అవసరం. నియమించినా, వివిధ కారణాలతో విధుల్ని తప్పించుకునేందుకు ప్రయత్నించేవారుంటారు. అనుకోని పరిస్థితులు ఎదురైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అవసరం. గోడౌన్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించేందుకు వందల సంఖ్యలో వాహనాలు, వేల సంఖ్యలో సిబ్బంది అవసరం. ఈవీఎంలు, వీవీప్యాట్‌లలో సమస్యలు తలెత్తితే పరిస్థితి గందరగోళమవుతుంది. వాటి వినియోగంపై తగిన అవగాహనతో పాటు సాంకేతిక సమస్యలు ఎదురైనా తగిన ప్రత్యామ్నాయాలు ఉండాలి.
- ఎన్నికల విధులు నిర్వహించే వారికి శిక్షణ ఎంతో అవసరం. వేల సంఖ్యలోని సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన కోసం తగిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. బ్యాలెట్ పత్రాల ముద్రణ అత్యంత జాగ్రత్తగా జరగాలి. అభ్యర్థుల సీరియల్ నంబర్, పార్టీ గుర్తు తదితరమైనవి సవ్యంగా ఉండాలి. ఇలా వివిధ అంశాలు అత్యంత పకడ్బందీగా, జాగ్రత్తగా జరగాల్సి ఉండటంతో తీరా సమయం ముంచుకొచ్చాక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆయా అంశాల వారీగా నోడల్ ఆఫీసర్లను నియమించారు. వీరు ఎన్నికల సంఘం షెడ్యూలు మేరకు ఆయా కార్యక్రమాలు నిర్ణీత వ్యవధుల్లో పూర్తిచేయాలి. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన అవగాహనతో తమకు అప్పగించిన పనులు నిర్వహించాల్సి ఉంది.

తప్పుడు సమాచారానికి చెక్ పెట్టండి

డీజీపీ అంజనీ కుమార్

చార్మినార్: తప్పుడు సమాచారాన్ని పదే పదే చెబితే అది నిజమైపోయే ప్రమాదముందని.. అలాంటి వాటికి చెక్ పెట్టాల్సిన అవసరముందని డీజీపీ అంజనీ కుమార్ అన్నారు. ఫేక్ వార్తలను ఎప్పటికప్పుడు క్రాస్‌చెక్ చేసుకోవాల్సిన అవసరముందన్నారు. గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగం, యూఎస్ కాన్సులేట్ జనరల్ సంయుక్తాధ్వర్యంలో సాలార్‌జంగ్ మ్యూజియంలోని సమావేశ మందిరంలో ఉర్దూ జర్నలిస్టులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. దిస్ ఇన్ఫర్మేషన్, మిస్ ఇన్ఫర్మేషన్, ఫేక్ ఇన్ఫర్మేషన్ తదితర అంశాలపై ఎనిమిది నెలల పాటు ఉర్దూ జర్నలిస్టులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. అనంతరం పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సాలార్‌జంగ్ మ్యూజియంలో జరిగిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో డీజీపీ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో అప్పుడప్పుడు తప్పుడు సమాచారం ప్రజల వద్దకు చేరుతోందని.. ఇది సరైంది కాదన్నారు. తామే ముందుగా సమాచారాన్ని అందజేస్తున్నామనే తొందరలో క్రాస్ చెక్ చేసుకోకుండా ఫేక్ సమాచారాన్ని సర్క్యులేట్ చేస్తున్నారన్నారు. ఇలాంటి తప్పుడు సమాచారంతో కూడిన వార్తలను ప్రసారం చేస్తే పరిస్థితులు ఉద్రిక్తతకు దారి తీస్తాయన్నారు. ఏ సమాచారాన్నైనా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరైన వివరణతో వార్తలను ప్రచురిస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ స్టీవెన్‌సన్ కోహిర్ తదితరులు పాల్గొన్నారు.



డీజీపీని సన్మానిస్తున్న ఉర్దూ జర్నలిస్టులు

'గృహలక్ష్మి'లో గందరగోళం

హైదరాబాద్ కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

- మధ్యాహ్నం వరకు దరఖాస్తుల స్వీకరణ నిలిపివేత
- ఆ తర్వాత పెరిగిన ఒత్తిడితో దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పటికే ఎమ్మెల్యేల అనుచరుల చేతిలో అర్హుల జాబితా

సాక్షి, సిటీబ్యూరో: గృహలక్ష్మి దరఖాస్తుల పరిస్థితి గందరగోళంగా తయారైంది. సొంత స్థలం కలిగి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించే గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తుల స్వీకరణ తీరు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యేల అనుచరులు స్థానికంగా దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసినట్లు ప్రచారం సాగుతుండగా.. దానికి బలం చేకూర్చే విధంగా హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా దరఖాస్తులను స్వీకరణ ప్రక్రియ ఆకస్మికంగా గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలిపివేయడం మరిన్ని అనుమానాలకు దారితీసింది. కలెక్టరేట్‌కు దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆందోళనకు సిద్ధమవుతున్న తరుణంలో గత్యంతరం లేక మధ్యాహ్నం 3 గంటల తర్వాత దరఖాస్తులను స్వీకరించారు. వాస్తవంగా గృహలక్ష్మి పథకం ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ దరఖాస్తుల స్వీకరణపై స్పష్టత ఇవ్వలేదు. అయినప్పటికీ స్థానికంగా పక్షం రోజులుగా దరఖాస్తుల హడావుడి కొనసాగుతోంది.

కలెక్టరేట్‌కు పెరిగిన తాకిడి..

ఎన్నికల వేళ ఎమ్మెల్యేల చేతిలో లబ్ధిదారుల ఎంపిక ఉండటంతో వారి అనుచరులకు మరింత కలిసి వచ్చినట్లయింది. దీంతో ఇప్పటికే క్షేత్ర స్థాయి జాబితా సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇదీలా ఉండగా.. తాజాగా జిల్లా యంత్రాంగం అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్ ఆఫీస్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభినప్పటికీ గురువారం ఆకస్మికంగా నిలిపివేశారు. ఆర్డీఓ, తహసీల్ ఆఫీసుల్లో దరఖాస్తులు స్వీకరించకపోవడంతో వారు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అప్పటికే కలెక్టరేట్‌లో ఉన్న దరఖాస్తుదారులు జత కావడంతో మరింత తాకిడి పెరిగింది. ఒక దశలో దరఖాస్తులు ఆందోళనకు సిద్ధమవుతుండగా కలెక్టర్ ఆదేశాలతో కౌంటర్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కొనసాగించారు.

దరఖాస్తులపై విచారణ అనుమానమే?

గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల నిర్మాణానికి సాయం అందించేందుకు ప్రత్యేక కౌంటర్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయి విచారణ కొనసాగడం అనుమానమే. ఇప్పటికే అధికారులు, సిబ్బంది వివిధ పథకాలపై విచారణలో బిజీగా తలమునకలై ఉన్నారు. మరోవైపు ఇప్పటికే ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో స్థానికంగా లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. దీంతో అధికారికంగా స్వీకరించిన దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురకావడం ఖాయంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు సిఫార్సు చేసే జాబితా ఆమోదమై ఆ లబ్ధిదారులకు మాత్రమే సాయం అందే అవకాశాలు కనిపిస్తున్నాయి.



హైదరాబాద్ కలెక్టరేట్‌లో కిక్కిరిసిన దరఖాస్తుదారులు

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: సమస్యల పరిష్కరించడంలో ఎలాంటి జాప్యం వద్దని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో రెవెన్యూ అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రతి సమాచారాన్ని వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా తెలియజేయాలన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో డైరెక్టుగా సమాచారాన్ని కలెక్టర్‌కు ఫోన్ ద్వారా చెప్పాలన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్లందరూ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. అధికారులు రెవెన్యూ సంబంధించిన పనులే కాకుండా ఇతర శాఖలకు సంబంధించినవీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పదిహేను రోజులకోసారి గురువారం రెవెన్యూ అధికారులతో సమావేశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలైన డబుల్ బెడ్రూం ఇళ్లు, గృహలక్ష్మి, దళితబంధు, బీసీబంధు, మైనారిటీ బంధు పథకాలపై త్వరగా క్షేత్ర పరిశీలన చేసి నివేదికలు సమర్పించాల్సిన సూచించారు. ల్యాండ్ బ్యాంకు నవీకరణ కోసం ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి శిథిలావస్థలో ఉన్న వాటిని గుర్తించి తెలపాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను తక్షణమే అఫిడవిట్లు దాఖలు చేయాలని, జీపీతో చర్చించి కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. 58, 59 జీఓల అమలులో ఎలాంటి ఉపేక్ష వహించవద్దని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మహిళలు సవాళ్లను అధిగమించాలి



సదస్సులో మాట్లాడుతున్న జయేష్ రంజన్

సనత్‌నగర్: మహిళలు తాము పని చేస్తున్న రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి స్ఫూర్తిదాయకంగా నిలిచినప్పుడే సమాజం గర్విస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ), తెలంగాణ ప్రభుత్వ వి-హబ్ సంయుక్తంగా 'ఆద్యశ్రీ' పేరిట జాతీయ స్థాయి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సదస్సును బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో గురువారం నిర్వహించింది. 'అవరోధాలను అధిగమించండి-సవాళ్లు-అవకాశాలు' అంశంపై సదస్సు కొనసాగింది.

ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. మహిళలకు సవాళ్లతో పాటు అవకాశాలూ మెండుగా ఉన్నాయన్నారు. ఇజ్రాయిల్ రాయబారి నౌర్ గిలోన్ మాట్లాడుతూ.. మహిళలు తాము ఎంచుకున్న రంగంలో పట్టుదల, కృషితో పనిచేసి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఆర్థికంగా ఎదగడం ద్వారా 2025 నాటికి వార్షిక ప్రపంచ జీడీపీని 28 ట్రిలియన్ డాలర్లకు పెంచవచ్చని ఫిక్కీ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. ఫిక్కీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మహిమ దాట్ల, దీప్తి రావుల, అంతర్జాతీయ వినియోగదారుల పాలసీ నిపుణుడు ప్రొఫెసర్ బెజోన్‌కుమార్ మిశ్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ మంజుశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ కోసం సిమ్ స్వాపింగ్!

- కొత్త ఎత్తులు వేస్తున్న సైబర్ నేరగాళ్ళు
- కస్టమరే తన సిమ్‌ను బ్లాక్ చేసేలా వ్యూహం
- తరచుగా నమోదవుతున్న ఈ తరహా కేసులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ నిపుణులు



సాక్షి, సిటీబ్యూరో: బ్యాంకుల కాల్ సెంటర్ల మాదిరిగా ఫోన్లు చేస్తూ వ్యక్తిగత సమాచారం తెలుసుకుని ఆన్‌లైన్‌లో అందినకాడికి కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్ళు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్నారు. అనేక వివరాలు చెప్పినా... వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) చెప్పని వినియోగదారుల్ని 'సిమ్ స్వాపింగ్'తో బురిడీ కొట్టిస్తున్నారు. వినియోగిస్తున్న సిమ్‌కార్డుల్ని వారితోనే బ్లాక్ చేయిస్తూ తమ 'పని' పూర్తి చేసుకుంటున్నారు. ఈ తరహా నేరాలు తరచుగా చోటు చేసుకుంటున్నాయని సైబర్ క్రైమ్ నిపుణులు చెప్తున్నారు.

ఇప్పటి వరకు ఈ రకంగా దోచారు...

బ్యాంకుల పేర్లతో ఫోన్లు చేసి ఖాతాలు ఖాళీ చేసే నేరాలు జోరుగా సాగుతున్నాయి. జమ్‌తార, ఢిల్లీ కేంద్రాలుగా సూత్రధారులు వ్యవస్థీకృతంగా ఈ నేరాలు చేస్తున్నారు. ప్రత్యేక కాల్ సెంటర్ల నుంచి తమ ఉద్యోగులతో బ్యాంకు ఖాతాదారులకు ఫోన్లు చేయిస్తుంటారు. తాము ఫలానా బ్యాంక్ కాల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నామంటూ పరిచయం చేసుకునే నేరగాళ్ళు క్రెడిట్/డెబిట్ కార్డ్‌ను అప్‌గ్రేడ్, ఆధార్, పాన్ లింకేజ్, కేవైసీ అప్‌డేట్ అని చెప్తూ వినియోగదారుల నుంచి కార్డ్, పిన్ నెంబర్లతో పాటు ఓటీపీ సైతం తీసుకుంటున్నారు. ఆపై ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా వారి ఖాతాల్లో ఉన్న నగదు స్వాహా చేయడం, ఈ-కామర్స్ సైట్స్‌లో ఖరీదు చేయడం, ఈ-వ్యాలెట్స్‌లోకి బదిలీ చేసుకోవడం చేసి మోసం చేస్తున్నారు.

డేటా వివిధ మార్గాల్లో సంగ్రహణ...

వివిధ బ్యాంకులకు చెందిన డెబిట్/క్రెడిట్ కార్డుల వినియోగదారుల డేటాను సైబర్ నేరగాళ్ళు అనేక మార్గాల్లో చేజిక్కించుకుంటున్నారు. ఆయా బ్యాంకులకు చెందిన కాల్ సెంటర్ల ద్వారా కార్డు నెంబర్, వినియోగదారుడి పేరు ఇతర వివరాలతో పాటు కొన్ని సందర్భాల్లో సీవీవీ కోడ్స్ కూడా వీరికి అందుతున్నాయి. ఖాతాల్లో ఉన్న నగదు కాజేయడానికి ఓటీపీ తప్పనిసరి. బ్యాంకుల పేరుతో కాల్స్ చేస్తున్న కేటుగాళ్ళకు బాధితులు అనేక వివరాలూ చెప్తున్నప్పటికీ... ఓటీపీ దగ్గరకు వచ్చేసరికి మాత్రం అనుమానిస్తున్నారు. దీంతో ఆ నెంబర్ చెప్పకుండా ఫోన్లు కట్ చేస్తున్నారు. ఈ రకంగా తాము 'నష్టపోతున్నామనే' ఉద్దేశంతో సైబర్ నేరగాళ్ళు ఇటీవల వేసిన ఎత్తుగడే సిమ్ స్వాపింగ్.

ఏకంగా కొత్త సిమ్ కార్డుల్ని తీసుకుంటున్నారు..

సిమ్ స్వాపింగ్ కోసం సైబర్ నేరగాళ్ళు ఉత్తరాదికి చెందిన కొన్ని సిమ్ కార్డుల విక్రయ కేంద్రాలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఎలాంటి గుర్తింపుకార్డులు సమర్పించకుండానే వారి వద్ద నుంచి టార్గెట్ చేసిన వినియోగదారుడి సెల్ నెంబర్‌తోనే మరో సిమ్‌కార్డు తీసుకుంటున్నారు. ఇది యాక్టివేట్ కావాలంటే అసలు వినియోగదారుడు అప్పటికే వినియోగిస్తున్న సిమ్ నుంచి కొత్త సిమ్‌పై ఉన్న నెంబర్లను సర్వీస్ ప్రొవైడర్‌కు ఎస్సెమ్మెస్ చేయాల్సి ఉంటుంది. అలా చేసిన తర్వాత మాత్రమే కొత్త సిమ్ యాక్టివేట్ కావడంతో పాటు పాత సిమ్ బ్లాక్ అవుతుంది. సరిగ్గా ఇదే విధానాన్ని సైబర్ నేరగాళ్ళు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. 'మీ సిమ్ బ్లాక్/డ్యామేజ్ అయింది. ఇబ్బందులు సరిదిద్దడానికి మీ సెల్‌కు వచ్చే నెంబర్‌కు ఫలానా నెంబర్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్‌కు పంపండి' అంటూ వివిధ నెంబర్ల నుంచి వినియోగదారులకు సర్వీస్ ప్రొవైడర్ల మాదిరిగా సిమ్ కలిగిన వ్యక్తికి ఎస్సెమ్మెస్‌లు పంపిస్తున్నారు.

అనుమానం రాకుండా 'పని' పూర్తి...

ఎస్సెమ్మెస్ సర్వీసు ప్రొవైడర్ నుంచే వచ్చిందని భావిస్తున్న వినియోగదారులు సదరు సిమ్ నెంబర్‌ను కాల్‌సెంటర్‌కు ఎస్సెమ్మెస్ చేస్తున్నారు. దీంతో కొద్దిసేపటికే ఈ సిమ్ బ్లాక్ కావడంతో పాటు నేరగాళ్ళ దగ్గర ఉన్న సిమ్ యాక్టివేట్ అవుతోంది. అప్పటికే సదరు వినియోగదారుడికి సంబంధించిన కార్డ్, పిన్ వివరాలు వారి వద్ద ఉండటంతో వాటితో ఆన్‌లైన్ లావాదేవీలు మొదలుపెడుతున్నారు. అసలు వినియోగదారుడి సెల్ నెంబర్‌కు రావాల్సిన ఓటీపీ సైబర్ నేరగాళ్ల స్వాపింగ్ చేసిన నెంబర్‌కు చేరిపోతోంది. ఇలా వినియోగదారుడికి ఏమాత్రం అనుమానం రాకుండా కొల్లగొట్టేస్తున్నారు. కస్టమర్‌కు జరిగిన వ్యవహారం తెలిసే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఎవరైనా వినియోగదారుడు తన సిమ్ బ్లాక్ అయినట్లు గుర్తించినా.. సర్వీస్ ప్రొడర్‌ను సంప్రదించడం, ఫిర్యాదు చేయడం జరిగే సరికే సైబర్ నేరగాళ్ళు తమ పని పూర్తి చేసుకుంటున్నారు. ఇలాంటి నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలి



మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

మేడ్చల్: ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని కోరుతూ బీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆశ వర్కర్లు మంత్రిని కలిసి ఆయనకు వినతి పత్రం అందజేసి తమ సమస్యలు, డిమాండ్లను వివరించారు.

కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారయ్య, ఆశ వర్కర్లు మహాలక్ష్మి, పద్మ, లక్ష్మి, దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రూ.2వేల నోట్ల మార్పిడికి యత్నం

నలుగురి అరెస్ట్



నకిలీ నోట్లను చూపుతున్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య

చాంద్రాయణగుట్ట: నకిలీ రూ.2 వేల నోట్లను మార్చేందుకు యత్నిస్తున్న నలుగురిని కాలాపత్తర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.69,04,000 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపిన మేరకు..చింతల్‌కు చెందిన ఖాజా నవీదుద్దీన్, షిండే, చార్మినార్‌కు చెందిన జాహెద్ ఖాన్(45), రయీసుద్దీన్(46), మహ్మద్ అన్వర్(36), మహ్మద్ మునీర్(40)లు నకిలీ రూ.2 వేల నోట్లు, చిల్డ్రన్స్ నోట్లను కాలాపత్తర్‌లోని స్థానిక మార్కెట్లలో మార్చేందుకు యత్నించారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న ఫలక్‌నుమా ఏసీపీ సుధాకర్ నేతృత్వంలో బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ బృందం వలపన్ని నలుగురిని అరెస్ట్ చేసి నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకుంది. నవీదుద్దీన్, షిండేలు పరారీలో ఉన్నారు. కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్ పాల్గొన్నారు.

మణిపూర్ విద్యార్థినులకు ఉచిత విద్య

హఫీజ్‌పేట్ : మణిపూర్ రాష్ట్రంలో 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు చందానగర్‌లోని మహిళా దక్షత సమితి విద్యా సంస్థలకు చెందిన సుమన్ జూనియర్ కళాశాల, శ్రీ వీడి బజాజ్ మహిళా డిగ్రీ కళాశాల, బన్సీలాల్ మలాని నర్సింగ్ కళాశాలలో ఉచిత విద్యతో పాటు హాస్టల్ వసతిని కల్పిస్తామని సంస్థ చైర్మన్ డాక్టర్ బజాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సుమన్ కాలేజీలో నిర్వహించిన మహిళా సామర్థ్య కమిటీలో ఆమె మాట్లాడుతూ బాలికలకు అండగా మా విద్యాసంస్థలు చేయూతను అందిస్తున్నామన్నారు. మణిపూర్ విద్యార్థులు కళాశాలలో చేరాలనుకునే వారు కళాశాల ప్రిన్సిపల్ రమాకుమారిని సంప్రదించాలన్నారు. వివరాలకు 779938887 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

వీఆర్‌ఏలకు నియామకపత్రాలు అందజేత

సాక్షి, సిటీబ్యూరో : జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన 66 మంది వీఆర్‌ఏలకు మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీలు నియామక పత్రాలను అందజేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి గ్రామ సేవకులుగా సేవలుందిస్తున్న వీఆర్‌ఏలందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ వివిధ ప్రభుత్వ శాఖలలో వారి వారి విద్యార్హతల ఆధారంగా జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ తదితర కేటగిరీలలో నియమించామన్నారు. హైదరాబాద్ జిల్లాకు 182 ని కేటాయించామన్నారు.

డమ్మీ రైఫిల్ కలకలం



నాంపల్లి: ఆర్మీ ప్రాంగణాల్లో జవాన్ల శిక్షణకు వినియోగించే ఓ రైఫిల్ కలకలం రేపింది. హైదరాబాదు రైల్వే స్టేషన్ సమీపంలోని ఎంసీఓ కార్యాలయం పక్కన ముళ్ల పొదల్లో బుధవారం రైఫిల్ కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాంపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైఫిల్‌ను పరిశీలించారు. అది డమ్మీదని, ఈ రైఫిల్‌ను శిక్షణలో మాత్రమే వినియోగిస్తారని పోలీసులు తెలిపారు. రెండు నెలల క్రితం గోల్కొండ పోలీసు స్టేషన్ పరిధిలో రైఫిల్ పోయినట్లుగా కేసు నమోదైనట్లు వివరించారు. గోల్కొండలో మిస్సయిన రైఫిల్, నాంపల్లిలో లభ్యమైన రైఫిల్ ఒకటేనని తేలడంతో గోల్కొండ పోలీసులు నాంపల్లికి చేరుకుని స్వాధీనం చేసుకున్నారు.

అర్ధరాత్రి రోడ్డుపై బర్త్‌డే వేడుకలు.. వద్దన్న వ్యక్తిపై దాడి

పంజగుట్ట: అర్ధరాత్రి రోడ్డుపై పెద్ద శబ్దాలతో పుట్టినరోజు వేడుకలు చేసుకుంటుంటే.. ఇదేంటి అని ప్రశ్నించిన స్థానికుడిపై దాడి చేసిన వ్యక్తిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. బుధవారం అర్ధరాత్రి బీఎస్ మక్తాకు చెందిన ఎస్.కె.అహ్మద్ పుట్టినరోజు ఉండటంతో అర్ధరాత్రి పెద్దశబ్దంతో పాటలు పెట్టి వేడుకలు చేసుకుంటున్నాడు. ఇంటిపక్కనే ఉండే డ్రైవర్ మహ్మద్ అలీఖాన్ బయటకు వచ్చి తనతల్లి వయస్సు 82 సంవత్సరాలు ఆమె ఆరోగ్యం బాగుండదు సౌండ్ తక్కువచేసి పాటలు పెట్టుకోండి అన్నాడు. దీంతో కోపంతో ఊగిపోయిన అహ్మద్ వాగ్వాదానికి దిగడమే కాకుండా అలీఖాన్‌పై దాడి చేసి తిట్టాడు. అంతటితో ఆగకుండా అలీఖాన్ కారును కూడా ధ్వంసం చేశాడు. దీంతో మహ్మద్ అలీఖాన్ గురువారం తెల్లవారు జామున పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్.కె.అహ్మద్‌పై కేసు నమోదు చేశారు. ఆ సమయంలో అక్కడ అహ్మద్‌తో మరెంతమంది ఉన్నారు అన్న విషయంపై ఆరాతీస్తున్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు



నిందితులు గిరీష్, రాధాకృష్ణ

వెంగళరావునగర్: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు యువకులకు న్యాయమూర్తి పదిరోజుల జైలు శిక్ష విధించారు. మధురానగర్ ఎస్ఐ ఉదయ్ తెలిపిన మేరకు.. బుధవారం రాత్రి రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని కార్మికనగర్‌బస్తీలో మధురానగర్ పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్స్ వంశీ, రాము విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో గిరీష్, రాధాకృష్ణ అనే ఇరువురు నడిరోడ్డుపై మద్యం తాగుతూ హడావుడి చేస్తున్నారు. వారిని పోలీసులు తమ ఇళ్ళకు వెళ్ళాలని సూచించారు. దీంతో రెచ్చిపోయిన నిందితులు పోలీసులను దుర్భాషలాడటమే కాకుండా వారిపైనే దాడికి ప్రయత్నించారు. దాంతో నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. గురువారం నాంపల్లిలోని కోర్టుకు హాజరు పరిచారు. పదవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ ఇరువురు నిందితులకు పది రోజుల పాటు జైలుశిక్ష విధించారు.

డీసీఎంను ఢీకొట్టిన బొలెరో..18 మందికి గాయాలు



డీసీఎంను ఢీకొట్టిన బొలెరో

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యేను కలిసేందుకు డీసీఎంలో బయలుదేరిన 35 మంది రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో 18 మంది గాయపడ్డారు. సీఐ రామకృష్ణ తెలిపిన మేరకు.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామానికి చెందిన 35 మంది సర్పంచ్ సంతోష ఆధ్వర్యంలో గురువారం డీసీఎం వాహనంలో ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బయల్దేరారు. బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు, ఏవీఎం కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న బొలేరో.. వీరి వాహనాన్ని ఢీకొట్టింది. డీసీఎం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడం, బొలేరో ఢీకొట్టడంతో డీసీఎం ఒక్కసారిగా కుదుపునకు గురైంది. వ్యాన్‌లో వెనుకవైపు నిలబడిన వారు అదుపు తప్పి ముందు కూర్చున్నవారిపై పడ్డారు. దీంతో 18 మందికి గాయాలయ్యాయి. వ్యాన్ క్యాబిన్‌లో కూర్చున్న సర్పంచ్ సంతోషినితో పాటు డీసీఎం డ్రైవర్ ఈశ్వర్, అండాలు, అశోక్, లత, పుష్ప, శోభ, శంకర్ తదితరులు గాయపడినవారిలో ఉన్నారు. క్షతగాత్రులను స్థానిక లిమ్స్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఇళ్లకు పంపించారు. సర్పంచ్ మాత్రం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలోని లిమ్స్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ తదితరులు గాయపడిన వారిని కలిసి ధైర్యం చెప్పారు.

బీఎస్‌హెచ్ హోం అప్లయెన్సెస్ ప్రారంభం

గచ్చిబౌలి: గచ్చిబౌలిలో బీఎస్‌హెచ్ హోం అప్లయెన్సెస్ గురువారం ప్రారంభమైంది. గృహోపకరణాల పరిశ్రమలలో గ్లోబల్ లీడర్ బీఎస్‌హెచ్ హోమ్ అప్లయెన్సెస్ గచ్చిబౌలిలో మొదటి కేంద్రాన్ని ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా బీఎస్‌హెచ్ హోమ్ అప్లయన్సెస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ సైఫ్‌ఖాన్ మాట్లాడుతూ.. ముంబయ్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నయ్, కోల్‌కతా, హైదరాబాద్‌లో ఏడు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగుడుకు బానిసైన భర్త.. భార్య ఆత్మహత్య



అంజలి(ఫైల్)

బంజారాహిల్స్: తాగుడుకు బానిసైన భర్తను భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని శ్రీరాంనగర్‌లో నివసించే వల్లూరి అంజలి(26) కాల్ సెంటర్‌లో పనిచేస్తోంది. ఆమె భర్త నరేంద్ర రోడ్ నెం. 12లోని టీఎక్స్ ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పని చేస్తుండేవాడు. ఇటీవల ఉద్యోగం కూడా చేయకుండా మద్యానికి బానిసై ఇంట్లోనే ఉంటూ భార్య సంపాదనతోనే మద్యం తాగుతున్నాడు. ఈ విషయంలో ఆమె ఎన్నిసార్లు మందలించినా వినిపించుకోకపోగా సెల్‌ఫోన్లు అమ్ముకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతుండటమే కాకుండా అబద్ధాలు కూడా చెప్తుండేవాడు. దీంతో విసిగిపోయిన అంజలి గురువారం తెల్లవారుజామున తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా దరూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన అంజలికి 2014లో పెళ్లి జరిగింది. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లోకి వెళ్లి కంట్లో కారంచల్లి దాడి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అనిల్‌కుమార్

జవహర్‌నగర్: ఇంట్లో ఉన్న ఓ యువకుడిపై కొందరు పోకిరీలు చొరబడి కంట్లో కారంచల్లి దాడి చేసి సెల్‌ఫోన్‌తో పాటు నగదును అపహరించుకుపోయారు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రపురికాలనీలో గురువారం చోటుచేసుకుంది. సీఐ సీతారాం, స్థానికులు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని చంద్రపురికాలనీలో శివగల్ల దేవదాస్ కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి దేవదాస్ కారులో ఇంటికి వస్తున్న క్రమంలో అజయ్, గోపి అతని కుటుంబ సుభ్యులు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపారు. వాహనాలను తీయాలని దేవదాస్ చెప్పగా అప్పటికే మద్యం తాగి ఉన్న అజయ్ అతని స్నేహితులు దేవదాస్‌పై దౌర్జన్యానికి దిగారు. ఉదయం మాట్లాడుకుందామని అక్కడి నుండి దేవదాస్ ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో దేవదాస్ ఇంటికి అజయ్‌తో పాటు అతని తండ్రి మరో ఇద్దరు కలిసి ఇంట్లోకి చొరబడి దేవదాస్‌పై కారం చల్లి దాడికిపాల్పడ్డారు. దేవదాస్ తేరుకుని ఇంటి నుంచి బయటకు వచ్చేలోపే దుండగులు ఇంట్లో ఉన్న ఐ ఫోన్‌తో పాటు కొంత నగదును అపహరించుకుపోయారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని అజయ్‌రాతోడ్, విష్ణు, దీరజ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా యువతిని వీడియో తీసిన వ్యక్తికి 8 రోజుల జైలు



నిందితుడు ఓంకార ఫణీంద్రసాయి

బంజారాహిల్స్: యువతి అనుమతి లేకుండా ఆమె వీడియోలు తీస్తూ ఆమెను కించపరచడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో నిందితుడికి 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీకి చెందిన కె. ఓంకార ఫణీంద్రసాయి(33) బుధవారం సాయంత్రం ఓ యువతిని ఆమె అనుమతి లేకుండా వీడియోతీయసాగాడు. ఇదేమిటని ఆమె ప్రశ్నించగా అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికంగా న్యూసెన్స్ క్రియేట్ చేశాడు. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదుచేసి గురువారం నాంపల్లిలోని 10వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్. లక్ష్మణ్‌రావు ఎదుట హాజరుపర్చగా ఆయన 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

క్లుప్తంగా...

ఇన్‌స్పెక్టర్‌గా రవీంద్రప్రసాద్ బాధ్యతల స్వీకరణ



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా పి.రవీంద్ర ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన వెంకటేశ్వర్‌రెడ్డిని సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో రవీంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. 2004 బ్యాచ్‌కు చెందిన రవీంద్ర ప్రసాద్ వనస్థలిపురం, అంబర్‌పేట పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా, ఆమనగల్, మాదాపూర్, సైబరాబాద్ ఐటీ సెల్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు.

జూబ్లీహిల్స్ సర్కిల్-18 ఇన్‌చార్జి డీపీవోగా లలితాకుమారి



బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం ఇన్‌చార్జి డీపీవోగా లలితాకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీపీవోగా పని చేసిన బాల చంద్రసుజన్‌ను నాగర్‌కర్నూల్ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. లలితా కుమారి ప్రస్తుతం కార్వాన్ సర్కిల్‌కి కూడా డీపీవోగా వ్యవహరిస్తుండగా జూబ్లీహిల్స్ సర్కిల్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

శ్రీనగర్‌కాలనీ: పేదలకు అండగా బీజేపీ ప్రభుత్వం ఉంటుందని బీజేపీ నేత లంకల దీపక్ రెడ్డి అన్నారు. గురువారం ఎర్రగడ్డ డివిజన్‌లోని సాత్‌శంకర్‌లాల్‌నగర్‌లో నివాసముండే సయ్యద్ షఫీ అనే దివ్యాంగుడికి ముడు చక్రాల సైకిల్‌ని అందజేశారు. నేతలు ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, నగేష్, రాజేష్, సునీత, విజయ్, గణేష్, మోయిన్, చిన్న, రాజేశ్వరి, ప్రభాకర్, కనకరాజు పాల్గొన్నారు.

సీఎం అభ్యర్థిగా బీసీని ప్రకటించే పార్టీకే మద్దతు

పంజగుట్ట: తెలుగు రాష్ట్రాల్లో జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలు ఒక్కసారి కూడా ముఖ్యమంత్రి కాలేదంటే అన్ని రాజకీయ పార్టీలు బీసీల అభివృద్ధిని కాంక్షించడంలేదని అర్థం అవుతుందని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ అన్నారు. కాని ఇప్పుడు బీసీల్లో చైతన్యం వచ్చిందని రాబోయే ఎన్నికల్లో ఏపార్టీ బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తుందో ఆ పార్టీకే మద్దతు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. గురువారం తుమ్మలబస్తీలో వేదిక రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి సమస్యలపై ఓబీసీలు అందరూ కలిసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైయిందన్నారు.

బోర్‌వెల్ ప్రారంభం



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 5లోని దేవరకొండ బస్తీ కమ్యూనిటీ హాల్ వద్ద కొద్ది రోజులుగా స్థానికులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ. 6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పవర్ బోర్‌ను కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి గురువారం ప్రారంభించారు. బోర్‌వెల్‌తో స్థానికంగా నీటి సమస్య తీరిపోతుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



వెంకటేశ్వరకాలనీ: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పంజగుట్ట పడవ హైస్కూల్‌లో విద్యార్థులు నోట్ పుస్తకాలను టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.వి జయారెడ్డి పంపిణీ చేశారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ యాదవ్, ఆనంద్, స్కూల్ హెచ్ఎం పాల్గొన్నారు.

ఆందోళనకు రోహిణ్‌రెడ్డి సంఘీభావం



బంజారాహిల్స్: గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ అభ్యర్థులు చేపట్టిన ధర్నాలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి పాల్గొని వారికి మద్దతు ప్రకటించారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీ కారణంగా గడచిన మూడు నెలలుగా అభ్యర్థులంతా మానసిక ఒత్తిడికి లోనై చదువుకు దూరమయ్యారని ఆరోపించారు. ఈ పరీక్షలను మూడు నెలల పాటు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది అభ్యర్థులు ఒకే నెలలో మూడు రకాల పోటీ పరీక్షలు నిర్వహించడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించాలని కోరారు.

ఓటు నమోదు.. తొలగింపు... సవరణకు ప్రత్యేక శిబిరాలు

- ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు
- ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన శిబిరాలు
- అర్హత ఉన్న వారు ఓటు నమోదు చేయించుకోవాలి

త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణలకు ఫారం-6, 7, 8కి దరఖాస్తులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. వీటిలో అత్యధికంగా ఓటు నమోదు కోసం వస్తున్నవే ఉన్నాయి.

బంజారాహిల్స్: గత నెల 27వ తేదీ వరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బీఎల్‌వోలు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటికే దరఖాస్తుల అప్‌డేట్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నది. అర్హత లేని దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఇంకోవైపు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై పరిశీలన ముమ్మరంగా సాగుతోంది.

- ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ఉన్న 245 పోలింగ్ బూత్‌లలో కొద్ది రోజులుగా ఓటు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులోనే తప్పొప్పుల సవరణకు సంబంధించిన దరఖాస్తులను కూడా స్వీకరిస్తున్నారు.

ప్రత్యేక ఓటు నమోదు

అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 26, 27 తేదీలతో పాటు సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రశాంతి తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని 245 పోలింగ్ బూత్‌లలో ఈ ఓటరు నమోదు కార్యక్రమాలు ఉంటాయన్నారు.



బంజారాహిల్స్ జవహర్ కాలనీలో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

- ఈ నెల 21న ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేయనున్నారు. ఈ జాబితాపై ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు అభ్యంతరాలు స్వీకరించి 28న అభ్యంతరాలపై సమాధానం చెప్పనున్నారు. అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా విడుదల కానుంది.

ఈవీఎంలపై ముమ్మర అవగాహన

- ఈవీఎంలు, వీవీప్యాట్ల పనితీరుపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించేందుకు ఒక్కో నియోజకవర్గానికి ఒక సంచార వాహనంతో పాటు రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అవగాహన కల్పించేందుకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల నుంచి ప్రత్యేక బృందాలను కూడా నియమించారు.
- ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో శిబిరం ఏర్పాటు చేసి ఇక్కడికి వచ్చేవారికి అవగాహన కల్పిస్తున్నారు. సంచార వాహనం ద్వారా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవగాహన కల్పించనున్నారు.
- గత నెల 20న ప్రారంభమైన ఈ ప్రక్రియ సెప్టెంబర్ 20 వరకు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

2,79,497 మంది ఓటర్లు...

ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 245 పోలింగ్ బూత్‌లు ఉండగా 2,79,497 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,45,951, మహిళలు 1,33,523, ఇతరులు 23 మంది ఉన్నారు.

త్వరలో 'మెగా స్టార్' సింగర్ పోటీల ఆడిషన్స్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: గాయకులు తమ గాత్రంతో జాతీయస్థాయిలో పేరుతెచ్చుకునేందుకు మెగా స్టార్ సింగర్ 2023 'ఇండియాకా చాంపియన్' పోటీలు నిర్వహించనున్నట్లు గ్రాస్‌షాపర్స్ స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ ముజఫర్ ఉద్దీన్ తెలిపారు. ఈ నెల 19 నుంచి ఆడిషన్స్ ప్రారంభం కానున్నాయని అన్ని రాష్ట్రాల్లో ఆడిషన్స్ పూర్తిచేసుకుని ఫైనలిస్టులను ఎంపికచేసి వారికి ముంబయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలోని 24 రాష్ట్రాల్లో, 28 పట్టణాల్లో ఆడిషన్స్ ఉంటాయని, తెలంగాణ రాష్ట్రానికి ఆడిషన్స్ సెప్టెంబర్ 17న ఉంటుందని ఇంకా వేదిక నిర్ణయించలేదన్నారు. కేవలం హిందీ భాషలో సూఫీ, గజల్, క్లాసికల్, ఆధ్యాత్మిక తదితర రంగాల్లో పాటలు పాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైల్వే మాజీ పీఆర్‌ఓ ఎఫ్.ఆర్.మైఖేల్, ప్రతినిధులు షా ఆశాన్, మిర్జా మహమ్మద్ భేగ్, ఉస్తాద్ ఎస్.జావిద్, జస్వంత్ సింగ్, ఎం.ఎ.నజీబ్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో చోరీ

వెంగళరావునగర్: బాలికల హాస్టల్‌లో సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... వెంగళరావునగర్‌లోని ఫ్రెండ్స్ డీలక్స్ హాస్టల్‌లో మనోజ్ఞ, ఝాన్సీ, ప్రియాంకలు ఒకే గదిలో ఉంటున్నారు. ఇటీవల వారి రెండు ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. చుట్టుపక్కల గదుల్లోని మహిళలు, సిబ్బందిని విచారించినా ఫలితం లేదు.

సీఎంఏ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: సీఎంఏ (కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్) ఫౌండేషన్ కోర్సులో బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని శ్రీ సరస్వతి జూనియర్ కాలేజీ విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ సునీల్, ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. గురువారం వెలువడిన ఈ ఫలితాల్లో కళాశాలలో సెకండియర్ చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారని వారంతా ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. తొలి ప్రయత్నంలోని క్లిష్టమైన ఈ పరీక్షలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు పాయల్, సచిన్, అంజు, పూర్ణిమ, మల్లికలను ప్రత్యేకంగా అభినందించారు. విద్యాసంస్థల చైర్మన్ రామ సుబ్బయ్య, నరేందర్, సత్యపాల్, సంజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని టైమ్స్ ఆఫ్ ఇండియా వెనుకాల నవోదయ కాలనీలో రూ. 12.50 లక్షల వ్యయంతో 300 ఎంఎం డయా సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు, రోడ్ నెం.3 మాజీ మంత్రి విజయారామారావు ఇంటి వద్ద రూ. 7.8 లక్షల వ్యయంతో 200 ఎంఎం డయా సీవరేజీ పైప్‌లైన్ పనులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గురువారం కార్పొరేటర్ కవితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. తరచూ ఈ ప్రాంతాల్లో మురుగు లీకవుతూ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ పనులను చేపట్టారు. సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే దానం సూచించారు.

తెలంగాణలో 'రిచ్‌మ్యాక్స్' కొత్త శాఖలు



మాట్లాడుతున్న సీఎండీ జార్జ్ జాన్ వాలెట్

బంజారాహిల్స్: తెలంగాణలో ప్రజల సౌకర్యార్థం కొత్త శాఖలు ప్రారంభించబోతున్నట్లు రిచ్‌మ్యాక్స్ గోల్డ్ లోన్ కంపెనీ సీఎండీ జార్జ్ జాన్ వాలెట్ వెల్లడించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని జింఖానా క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మొదటి దశలో 25 శాఖలను, రెండో దశలో 15 శాఖలను ప్రారంభించి ఏడాదిలోపు 100 బ్రాంచీల లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. తెలంగాణ అంతటా 400 శాఖలు ప్రారంభించాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. ఉత్తమ సేవలతో, కంపెనీ వినియోగదారులకు సమగ్ర ఆర్థిక పరిష్కారాలు అందించేందుకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. 2 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 2040 నాటికి పూర్తి బ్యాంకు హోదాను పొందేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ జాలిసీఎం ప్రవీణ్ బాబు, అలెక్స్ జోసెఫ్, భద్ర, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

శ్రీనగర్‌కాలనీ: సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకుంటూ.. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం విద్యార్థినులకు ఎంతైనా ఉందని డాక్టర్ అదితి కిషోర్ అన్నారు. గురువారం ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో రోటరీ క్లబ్ హైదరాబాద్, సాక్షి ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ది రక్షిణ్ ప్రాజెక్ట్‌లో భాగంగా 8 నుంచి 10వ తగరతి విద్యార్థినులకు పోక్సో చట్టం, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించి, మనోధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపారు. పలు సందేహాలను అదితి కిషోర్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, రోటరీ క్లబ్ హైదరాబాద్, సాక్షి ఎన్‌జీఓ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని ముఫకంజా ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం బేగంపేట టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు పంజగుట్ట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ట్రాఫిక్‌పట్ల మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. రోడ్డు దాటే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. రోడ్డు ప్రమాదాలు ఇతరులకు హానికలిగిస్తాయని కుటుంబాన్ని రోడ్డున పడేస్తాయని అన్నారు. యువత 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వాహనాలు నడపాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనంతో రోడ్డెక్కాలని కోరారు.

బందోబస్తు నడుమ ప్రహరీ నిర్మాణం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్‌లో అయ్యప్ప దేవాలయాన్ని ఆనుకొని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టారు. కొంత మంది స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తుండగా జీహెచ్ఎంసీ ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టే క్రమంలో గురువారం భారీ పోలీస్ బందోబస్తు నడుమ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్ పర్యవేక్షణలో నిర్మాణం కొనసాగింది. ఇక్కడ మల్టీపర్పస్ నిర్మాణం కోసం 2015లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ప్రాంగణంలో ఇండియా హ్యాండ్‌మేడ్ కలెక్టివ్ పేరుతో ప్రత్యేక నేచురల్ డై ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. గురువారం ప్రముఖ కళాకారిణి ఉజ్రాబిల్గ్రామి ప్రదర్శనను ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి పేరొందిన హస్తకళాకారులు తమ చేతివృత్తులను ఇక్కడ ప్రదర్శించారు. ఆకట్టుకునే రీతిలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నగరవాసులను విశేషంగా ఆకర్షిస్తున్నది. ముఖ్యంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రఖ్యాత చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను ఇక్కడ అందుబాటులో ఉంచారు. తెలంగాణ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్పారెల్ అండ్ టెక్స్‌టైల్స్ విద్యార్థులు తయారు చేసిన వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ నెల 12వ తేద వరకు మూడు రోజుల పాటు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.

క్రిస్టియన్ మైనార్టీల రుణాల దరఖాస్తు గడువు పొడిగించాలి

వెంగళరావునగర్: క్రిస్టియన్ మైనార్టీలకు ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయల రుణాలు దరఖాస్తులకు చివరి తేదీని సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగించాలని ఇండియన్ బిలీవర్స్ పార్టీ (ఐబీపీ) జాతీయ అధ్యక్షుడు, ఆలిండియా ఇండిపెండెంట్ చర్చెస్ డయాసిస్ (ఏఐఐసీడీ) నిర్వాహకులు ఆర్చ్ బిషప్ డాక్టర్ హ్యారీ సెబాస్టియన్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఐబీపీ సెంట్రల్ కార్యాలయంలో ఐబీపీ, ఏఐఐసీడీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఆయా చర్చిల బిషప్‌లు, పాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బిషప్ సెబాస్టియన్ మాట్లాడుతూ... క్రిస్టియన్ మైనార్టీల రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 14 చివరి తేదీగా నిర్ణయించడం సరైన నిర్ణయం కాదన్నారు. రాష్ట్రంలోని అనేకమంది క్రిస్టియన్ మైనార్టీల వద్ద ఇన్‌కమ్ సర్టిఫికెట్స్, మైనారీ సర్టిఫికెట్లు లేవని, వాటిని పొందడానికి రెవెన్యూ కార్యాలయాల నుంచి కనీసం మూడు వారాల పైగా పడుతుందన్నారు. సమావేశంలో బిషప్ అరుణ్, బిషప్ వినోద్, బిషప్ ఎన్‌డి సునీల్, పాస్టర్ ఐజయ్య, పాస్టర్ కళమ్మ తదితర పాస్టర్లు పాల్గొన్నారు.

మార్కెట్లోకి ఎలక్ట్రిక్ సైకిల్



బంజారాహిల్స్: సంప్రదాయ, ఎలక్ట్రిక్ సైకిళ్ల నడుమ వ్యయ, అంతర సమస్యలు పరిష్కరించడానికి విర్టస్ మోటర్స్ ఆల్ఫా ఏ, ఆల్ఫా-1 ఈ బైక్‌లను గురువారం మార్కెట్‌లోకి విడుదల చేసింది. అత్యాధునిక మోడల్స్‌ను రూ. 15,999 కి విక్రయిస్తున్నారు. ఎలక్ట్రిక్ సైకిళ్ల రంగంలో గణనీయమైన పురోగతి కనిపిస్తున్నదని విర్టస్ మోటార్స్ సహ వ్యవస్థాపకుడు తుషార్ బజాజ్ వెల్లడించారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ఖైరతాబాద్: వాసవి సేవాకేంద్రం వ్యవస్థాపకుడు దివంగత కొత్తూరు సీతయ్యగుప్తా జయంతి సందర్భంగా గురువారం వాసవి సేవాకేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నేపాల్ చైర్మన్ అండ్ సీఈఓ పంపాటి నాగేందర్ కిషన్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తదితరులు హాజరై సీతయ్యగుప్తా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం 45 మందికి కుట్టు మిషన్లు, 25 మందికి గ్రైండర్లు, పెన్షన్లు, బియ్యం పంపిణీ చేశారు. నేతలు కొండ్లె మల్లికార్జున్, కొత్తూరు జయప్రకాష్ రామ్, కాసనగొట్టు రాజశేఖర్, పంపాటి జ్ఞానచందర్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్య

అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులే కారణం

హిమాయత్‌నగర్: అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నారాయణగూడ పోలీసుల సమాచారం మేరకు... గాంధీకుటీర్‌కు చెందిన రాముగౌడ్(52) అనారోగ్య సమస్యల కారణంగా ఉద్యోగం మానేశాడు. గత ఏడాది నిమ్స్‌లో రాముగౌడ్‌కు బ్రెయిన్ సర్జరీ సైతం జరిగింది. ఓ పక్క ఉద్యోగం లేకపోవడం ఇంకో వైపు మందులు కొనుక్కునేందుకూ డబ్బు లేకపోవడంతో మానసిక్షోభకు గురయ్యాడు. ఈ కష్టాల నుంచి గట్టెక్కలేనని భావించిన రాముగౌడ్ గురువారం తన వెంట అరలీటరు పెట్రోల్ తెచ్చుకున్నాడు. స్నానం చేసి వస్తానంటూ భార్యకు చెప్పి బాత్‌రూమ్‌లోకి వెళ్లిన రాముగౌడ్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. వేడి తాళలేక బిగ్గరగా కేకలు వేశాడు. గమనించిన భార్య ఇరుగుపొరుగు వారిని పిలిచి సహాయక చర్యలు చేపట్టింది. అప్పటికే 50 శాతంకు పైగా కాలిపోయాడు. దీంతో రాముగౌడ్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తుండగానే మృతిచెందాడు. ఈ మేరకు నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌ను చెల్లించాలి: బీజేపీ



ఆందోళనలో పాల్గొన్న బీజేపీ నేతలు

వెంగళరావునగర్: కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయుర్వేద కళాశాల విద్యార్థులకు తక్షణమే స్టైఫండ్‌ను పెంచాలని పలువురు బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. స్టైఫండ్ పెంచాలని కోరుతూ ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల విద్యార్థులు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. శుక్రవారం కళాశాలలో జరిగిన ఆందోళనకు బీజేపీ నేతలు తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... ఆయుర్వేద విద్యార్థులు చేస్తున్న ఆందోళనపై ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు. తక్షణమే వారికి రూ. 23 వేల నుంచి రూ. 40 వేలకు స్టైఫండ్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ తరపున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, ఉపాధ్యక్షులు కిలారి మనోహర్, కార్పొరేటర్లు సురేఖ, సరళ, జూబ్లీహిల్స్ నాయకురాలు కీర్తిరెడ్డి, గాయత్రీదేవి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఈసీ నియామకంలో సీజేఐకు అధికారం లేనట్టే

- నియామక కమిటీలో సీజేఐకి బదులుగా కేబినెట్ మంత్రికి స్థానం
- రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం



ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ మధ్య కొలీజియంపై విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో మరో వివాదాస్పద బిల్లును మోదీ సర్కార్ గురువారం రాజ్యసభలో ప్రవేశ పెట్టింది. కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించింది. ఆయన స్థానంలో కేబినెట్ మంత్రికి స్థానం కల్పించింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఎన్నికల సంఘంపై కేంద్ర ప్రభుత్వానికి మరిన్ని అధికారాలు లభిస్తాయి. కేంద్రం ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువచ్చే వరకు ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య కమిటీ సీఈసీ, ఇతర కమిషనర్ల నియామకాలు చేపడుతుందని గత మార్చిలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సీజేఐను తప్పించి కేబినెట్ మంత్రిని చేర్చడం వివాదానికి దారితీసింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ రాజ్యసభలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్ కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీసు) బిల్లు, 2023ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ప్రధానమంత్రి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ప్రధాని నామినేట్ చేసిన కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉంటారు. ఆ కమిటీయే సీఈసీ, ఈసీలను ఎంపిక చేస్తుంది. కాంగ్రెస్, ఆప్ ఇతర విపక్ష పార్టీ సభ్యుల ఆందోళనల మధ్య ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

సుప్రీం తీర్పుని లెక్క చేయరా ?

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఉత్తర్వుల్ని నీరుకార్చేలా ఈ బిల్లు ఉందని విపక్షాలు విమర్శించాయి. కమిటీ నుంచి సీజేఐని తప్పించడం అత్యంత ప్రమాదకరమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలపై ఇది ప్రభావం చూపిస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పులేమైనా బీజేపీకి నచ్చకపోతే వాటిని లెక్క చేయదని ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘం మొత్తాన్ని ప్రధాని మోదీ తన గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఆరోపించారు. కమిటీలో ఇద్దరు బీజేపీకి చెందినవారే ఉంటే నిష్పాక్షికంగా కమిషనర్ల ఎంపిక ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు.

వచ్చే ఏడాది ఈసీలో ఖాళీ

కేంద్ర ఎన్నికల కమిషన్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఖాళీ ఏర్పడనుంది. ఎన్నికల కమిషనర్ అనూప్ చంద్ర పాండేకి 65 ఏళ్లు నిండనుండడంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న పదవీ విరమణ చేస్తారు. 2024 లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది రోజుల ముందే ఆయన పదవీ విరమణ చేస్తారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించాలి. తాము చెప్పినట్టు వినే కమిషనర్‌ను నియమించుకొని ఎన్నికల కమిషన్‌ను తన గుప్పిట్లో పెట్టుకోవడానికే కేంద్రం ఇదంతా చేస్తోందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల కంటే ముందు కేంద్ర ప్రభుత్వం సిఫార్సుల మేరకు రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లను నియమించే వారు.

రాజ్యసభలో తీవ్ర రగడ

- మణిపూర్‌పై 176 నిబంధన కింద చర్చ కోసం విపక్షాల పట్టు
- చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల బిల్లుపై అభ్యంతరం

న్యూఢిల్లీ: మణిపూర్ అంశంతోపాటు వివాదాస్పద ముఖ్య ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల బిల్లుపై విపక్ష సభ్యులు ఆందోళన, నినాదాలతో గురువారం రాజ్యసభ అట్టుడికింది. మణిపూర్ హింసపై 267 నిబంధన కింద సభలో చర్చ చేపట్టాలని ఇన్నాళ్లూ పట్టుబట్టిన విపక్షాలు కొంత దిగొచ్చాయి. 176 నిబంధన కింద చర్చ ప్రారంభించాలని, ప్రధాని మోదీ సభకు వచ్చిన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి.

ప్రధానమంత్రి ఏమైనా దేవుడా?

రాజ్యసభ గురువారం ఉదయం ప్రారంభం కాగానే మణిపూర్ వ్యవహారంపై 176 నిబంధన కింద చర్చ కోసం విపక్ష సభ్యులు పట్టుబట్టారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. ప్రధాని మోదీని సభకు రప్పించాలని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున ఖర్గే కోరారు. దీనిపై అభ్యంతరం తెలిపిన అధికార బీజేపీ ఎంపీలపై ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రధానమంత్రి ఎందుకు రాకూడదు? ఆయన ఏమైనా దేవుడా?' అని ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో సభను చైర్మన్ ధన్‌ఖడ్ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. అనంతరం వివిధ పార్టీల సభాపక్ష నేతలతో ఆయన సమావేశమయ్యారు. సభకు సహకరించాలని కోరారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా విపక్షాల ఆందోళన ఆగలేదు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు డెరెక్ ఓబ్రెయిన్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. రాజ్యసభ కార్యకలాపాలకు కేంద్ర ప్రభుత్వమే అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. ఓబ్రెయిన్ తీరును కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తప్పుపట్టారు. అనంతరం మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. అధికార పక్షం వల్లే సభ సజావుగా సాగడం లేదని మండిపడ్డారు. బీజేపీ ఎంపీల వ్యవహార శైలిని ఆక్షేపిస్తూ ఓ కవిత వినిపించారు. ఖర్గే తీరు గురువింద గింజలా ఉందని పీయూష్ గోయల్ ఎద్దేవా చేశారు. ఖర్గే వ్యాఖ్యలను పలువురు బీజేపీ సభ్యులు ఖండించారు. మిజోరాం ఎంపీ ఒకరు మాట్లాడబోతుండగా చైర్మన్ ధన్‌ఖడ్ అనుమతించలేదు. పార్లమెంట్ సభ్యులకు దేశంలో ఏదో ఒక ప్రాంతం ముఖ్యం కాదని, దేశమంతా సమానమేనని ధన్‌ఖడ్ అన్నారు.

ఫార్మసీ(సవరణ) బిల్లుకు ఆమోదం

వివాదాస్పద 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్(అపాయింట్‌మెంట్ కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్) బిల్లు–2023ను కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పట్ల ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం విపక్షాల ఆందోళన మధ్యే కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'పోస్ట్ ఆఫీస్ బిల్లు–2023'ను ప్రవేశపెట్టారు. ఈ తర్వాత కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి మన్‌సుఖ్ మాండవీయా ప్రవేశపెట్టిన 'ఫార్మసీ(సవరణ) బిల్లు–2023' సభలో ఆమోదం పొందింది. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ధన్‌ఖడ్ ప్రకటించారు.

పూర్తి నిరాయుధీకరణ.. ఎన్నార్సీ అమలు

మణిపూర్‌లో శాంతికి ఇవే ప్రధానమంటూ ప్రధాని మోదీకి ఎమ్మెల్యేల వినతి

ఇంఫాల్: మణిపూర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే పూర్తి స్థాయి నిరాయుధీకరణ అవసరం ఎంతో ఉందని ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలు ప్రధాని మోదీకి సూచించారు. ఈ మేరకు మణిపూర్‌కు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు బుధవారం ప్రధాని మోదీకి ఒక వినతి పత్రం అందజేశారు. వీరిలో ఎక్కువ మంది మెయితీలు. కుకీల సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కుకీ మిలిటెంట్లతో 2008లో కుదుర్చుకున్న సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్(ఎస్ఓఎస్)నుంచి బయటకు రావాలని కోరారు. కుకీ మిలిటెంట్ గ్రూపులు ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో హింసను నిలువరించేందుకు సాయుధ బలగాల మోహరింపు అవసరమే అయినప్పటికీ శాంతి భద్రతల స్థాపనకు అదొక్కటే సరిపోదన్నారు. రాష్ట్రంలో పూర్తి స్థాయి నిరాయుధీకరణతోనే శాంతి నెలకొంటుందని చెప్పారు. 'మిలిటెంట్ గ్రూపులు, విదేశీ సాయుధ బలగాల వద్ద ఉన్న ఆయుధాలను, ప్రభుత్వ బలగాల నుంచి ఎత్తుకుపోయిన ఆయుధాలన్నిటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి' అని ఎమ్మెల్యేలు ఆ వినతి పత్రంలో కోరారు. అదేవిధంగా, రాష్ట్రంలో జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ)ని అమలు చేయాలని, అటానమస్ జిల్లా కౌన్సిళ్లను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఛాయా చిత్రాలు తీసిన ల్యాండర్‌లోని కెమెరా



ల్యాండర్ పంపిన భూమి ఛాయాచిత్రం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ చంద్రుడికి మరింత చేరువయ్యే సమయంలో ల్యాండర్ మాడ్యూల్‌లో అమర్చిన ''ల్యాండర్ హారిజెంటల్ వెలాసిటీ కెమెరా''(ఎల్‌హెచ్‌వీసీ) రెండు ఛాయా చిత్రాలను తీసి పంపింది. వాటిని ఇస్రో తన వెబ్‌సైట్‌లో అధికారికంగా విడుదల చేసింది. ఈనెల 6న ఎల్‌హెచ్‌వీసీ ఇన్‌స్ట్రుమెంట్ చంద్రుడ్ని తీసిన వీడియోను విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా లూనార్ కక్ష్యలో నుంచి చంద్రుడ్ని వీడియోతో పాటు ఛాయా చిత్రాలు తీయడం విశేషం. ప్రయోగం రోజున అంటే గత నెల 14న ''ల్యాండర్ ఇమేజర్ కెమెరా''భూమిని తీసిన ఛాయాచిత్రాలను కూడా గురువారం విడుదల చేసింది. చంద్రయాన్–1, చంద్రయాన్–2 ప్రయోగాల కంటే చంద్రయాన్–3 మిషన్‌లో అత్యంత హై రిజల్యూషన్ కెమెరాలను అమర్చినట్టుగా తెలుస్తోంది. ఈ రెండు చాయా చిత్రాలతో పాటుగా 14 సెకన్లపాటు తీసిన వీడియో కూడా ఎంతో స్పష్టతతో కూడి ఉండడం విశేషం. మరో 13 రోజుల్లో చంద్రయాన్–3 మిషన్ చంద్రుడి ఉపరితలంపై దిగడంతో ప్రయాణం పూర్తవుతుంది.

యుద్ధానికి సిద్ధంకండి

ఉత్తర కొరియా మిలటరీకి కిమ్ పిలుపు



సియోల్ : ఉత్తర కొరి యా సమరశంఖాన్ని పూరించింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ సైన్యాన్ని అప్రమత్తం చేసినట్టుగా దేశ అధికారిక మీడియా కేసీఎన్ఏ వెల్లడించింది. యుద్ధ సన్నాహాల్లో భాగంగా అత్యున్నత స్థాయి మిలటరీ జనరల్‌ను మార్చారు. ఆయుధాల ఉత్పత్తిని పెంచాలని సైనిక సన్నాహాలు మరింత వేగవంతం చేయాలని కిమ్ ఆదేశాలు జారీ చేశారు. అమెరికా, దక్షిణ కొరియా కలిసి ఈ నెల 21 నుంచి 24 మధ్య సంయుక్తంగా మిలటరీ విన్యాసాలు చేపట్టనున్న నేపథ్యంలో కిమ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం మిలటరీ జనరల్‌గా ఉన్న పాక్ సూ ఇల్ స్థానంలో జనరల్ రియాంగ్ గిల్‌ను నియమిస్తున్నట్టుగా ప్రకటించారు. గతవారంలోనే కిమ్ ఆయుధ ఫ్యాక్టరీని సందర్శించి మరిన్ని క్షిపణులు, శతఘ్నులు, ఇతర ఆయుధాలను తయారు చేయాలని ఆదేశించినట్టుగా తెలిసిందే.

మణిపూర్‌లో మరో గ్యాంగ్ రేప్ ఘటన..

ఇంఫాల్: తెగల వైరంతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో జరిగిన మరో సామూహిక అత్యాచారఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్కడ ఘర్షణలు మొదలైన మే 3వ తేదీ నాడే ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. చురాచాంద్‌పూర్ జిల్లాకు చెందిన బాధితురాలి(37) ఫిర్యాదు మేరకు ఆగస్ట్ 9వ తేదీన బిష్ణుపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కుకీ తెగకు చెందిన కొందరు మే 3న సాయంత్రం బాధితురాలు ఉంటున్న గ్రామంపై దాడి చేసి ఇళ్లకు నిప్పుపెట్టారు. వారి బారి నుంచి తప్పించుకునేందుకు బాధితురాలు పరుగులుతీసింది. ఆమెను కొందరు అడ్డగించి, గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడ్డారు. ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం చురాచాంద్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అస్సాం రైఫిల్స్‌ను కొనసాగించండి: కుకీలు

ఇంఫాల్: మణిపూర్‌లో అస్సాం రైఫిల్స్ బలగాలను కొనసాగించాలని రాష్ట్రానికి చెందిన కుకీ ఎమ్మెల్యేలు ప్రధానిని కోరారు. అన్ని పార్టీలకు చెందిన 10 మంది కుకీ ఎమ్మెల్యేలు ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. అస్సాం రైఫిల్స్‌ను ఉపసంహరిస్తే గిరిజనుల భద్రత ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

హవాయి ద్వీపంలో భారీ కార్చిచ్చు



ఓ వీధిలో కమ్ముకున్న మంటలు



హవాయిలోని ఓ విమానాశ్రయంలో భారీగా జనం

36 మంది సజీవదహనం

వైలుకు: అమెరికాలో హవాయి దీవుల్లో భీకరమైన కార్చిచ్చు వ్యాపించింది. ఈ మంటలు వేగంగా విస్తరిస్తూ శతాబ్దాల చరిత్ర ఉన్న మాయి పట్టణాన్ని కాల్చి బూడిద చేస్తున్నాయి. ఈ విపత్తులో 36 మంది సజీవదహనమయ్యారు. వేలాది మంది తట్టా బుట్టా సర్దుకొని దీవి వదిలి వెళ్లిపోతున్నారు. మాయి కౌంటీలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఎన్నో భవంతులు, వీధుల్లో పార్క్ చేసి ఉంచిన కార్లు కూడా కార్చిచ్చుకి దగ్ధమయ్యాయి. ఎటు చూసినా కార్చిచ్చు పొగలే వ్యాపిస్తూ పట్టపగలే చీకట్లు అలుముకున్నాయి. హరికేన్ కూడా కమ్ముకొని ఉండడంతో గాలులు బలంగా వీయడంతో మంటలు త్వరితగతిన వ్యాపిస్తున్నాయి. కౌంటీలు కార్చిచ్చు వ్యాపిస్తూ ఉండడంతో తమ ప్రాణాలు కాపాడుకోవడం కోసం కొందరు పిల్లలు, పెద్దలు సముద్రంలోకి దూకిన ఘటనలు కూడా జరిగాయి. కార్చిచ్చుల్లో మంటలు దాదాపుగా 271 భవనాలు ధ్వంసమయ్యాయి. ఇక చాలా మంది మంటల్లో చిక్కుకొని కాలిన గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. అమెరికాలో ఇటీవల కాలంలో ఈ స్థాయిలో కార్చిచ్చు రాజుకోవడం ఇదే తొలిసారి.

మంటల్ని అదుపులోకి తీసుకురావడానికి ప్రభుత్వం శక్తివంచన లేకుండా శ్రమిస్తోంది. పర్యాటకులెవరూ ఈ దీవికి రావొద్దని హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాయి కౌంటీలో మంటల్ని అదుపు చేసి ప్రజల్ని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి సైన్యం అన్ని విధాలా సహకరిస్తుందని ఒక ప్రకటనలో వెల్లడించారు. తీర ప్రాంత రక్షక దళం, నావికాదళ సభ్యులు సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు.

నగర వార్తలు

ట్రిపుల్‌ఐటీలో జనరేటివ్ ఏఐ సమ్మిట్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ ఆధ్వర్యంలో టీహబ్, నాస్కామ్ డీసీటీతో సంయుక్తంగా జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సమ్మిట్‌లో 50కి పైగా హైటెక్ స్టార్టప్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చర్చా కార్యక్రమాలలో పది మంది టెక్ లీడర్లు జనరేటివ్ ఏఐ కోసం ఉన్న అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వెల్స్‌ఫార్గో ప్రతినిధి హరీష్‌మోహన్, గోల్డ్‌మన్ సాచ్స్ అలోక్ మధుకర్, మాస్‌మ్యూచువల్ రాజేష్, హెచ్ఎస్‌బీసీ మమతా మాదిరెడ్డి, టీవీఎస్ అభయ్ టండన్, ఉబర్ జయరామ్ వల్లియార్, మైక్రోసాఫ్ట్ సుందర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

సేవ చేయడం అభినందనీయం



సేవల వివరాలు తెలుసుకుంటున్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లోని మసీద్ మహ్మదీయలో డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. విభిన్న మత విశ్వాసాలు గౌరవిస్తూ మసీదులో హిందువులచే ఉచితంగా డయాలసిస్ నిర్వహించడం అభినందనీయమని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సి.ఎస్.రంగరాజన్ అన్నారు. ఈ కార్యక్రమానికి రంగరాజన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మసీదులో నిర్వహిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మెరుగయిన సమాజ నిర్మాణం కోసం ఇలాంటి సేవలు అద్భుతమయిన ఉదాహరణ అన్నారు. తదనంతరం చీఫ్ టెక్నీషియన్ వెంకటేష్, ఎస్ఇఇడి–యుఎస్ఏకి చెందిన సయ్యద్ మజూరుద్దీన్ హుస్సేన్‌లు మాట్లాడుతూ సంవత్సరం నుంచి 100 మంది డయాలసిస్ బాధితులకు 5000 సార్లు ఉచితంగా డయాలసిస్ చేశామన్నారు.

ఏజెన్సీల ద్వారానే నిర్మాణ వ్యర్థాలను తరలించాలి

- ప్రైవేట్ వాహనదారులు డంప్ చేస్తే జరిమానా తప్పదు
- జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ఎన్.ప్రకాష్ రెడ్డి



మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ఎన్. ప్రకాష్‌రెడ్డి, వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా డంప్ చేస్తే మూడుసార్లు జరిమానాలు, ఆ తర్వాత కేసులు నమోదు చేస్తామని జీహెచ్ఎంసీ ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) డైరెక్టర్ ఎన్.ప్రకాష్ రెడ్డి ట్రక్కుల యజమానులను హెచ్చరించారు. గురువారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో నిర్మాణ వ్యర్థాలపై ట్రక్కులు, ట్రాక్టర్ ఆపరేటర్లు, యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ వ్యర్థాలు రోడ్ల వెంట, నాలాలు, చెరువులలో, ఖాళీ స్థలాలలో డంప్ చేస్తే ప్రభుత్వం జారీ చేసిన జీఓ 632 ప్రకారం వాహనం మొదటిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి రూ.50 వేలు, మూడోసారి లక్ష రూపాయల జరిమానాతో పాటు కేసు నమోదు చేస్తామన్నారు. ప్రైవేట్ భవనాలు, నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాజెక్టుల నుంచి వెలువడే నిర్మాణ వ్యర్థాలను ఏజెన్సీల ద్వారా తరలించాలని సూచించారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌ల నుంచి నిర్మాణ వ్యర్థాలను జీడిమెట్ల ప్లాంట్‌కు తరలిస్తారని తెలిపారు. వీటిని తరలించేందుకు హైదరాబాద్ సీ అండ్ డి వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ టోల్ ఫ్రీ నంబర్ 1800–120–1159, వాట్సాప్ నంబర్ 9100927073, సోమ శ్రీనివాస్ రెడ్డి ఏజెన్సీ టోల్ ఫ్రీ నంబరు 1800–203–00203 లేదా 'మై జీహెచ్ఎంసీ' యాప్‌లో సంప్రదించాలని సూచించారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వెస్ట్ జోనల్ పరిధిలో వేల టన్నుల నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా డంప్ చేసినట్లు తెలిపారు. అక్రమ డంప్‌ను అరికడితేనే హైదరాబాద్ క్లీన్ సిటీగా కనిపిస్తుందన్నారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణవీర్‌రెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ రంజిత్‌రెడ్డి, వెస్ట్ జోనల్ ఎస్ఈ శంకర్, ఈఈ శ్రీనివాస్, శ్రీకాంతి, గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం నిరంతర కార్యక్రమం



గృహలక్ష్మి పథకం అమలుపై సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సాక్షి, సిటీబ్యూరో: పేద ప్రజల సొంతింటి కల నెరవేరే విధంగా ఆర్థిక చేయూత అందించే గృహలక్ష్మి పథకం నిరంతర కార్యక్రమం అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో హోంమంత్రి మహమూద్ అలీ తో కలిసి గృహలక్ష్మి పథకం అమలు, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేకపోతున్న పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఇంటి నిర్మాణం కోసం రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గ పరిధిలో 3 వేల మంది లబ్ధిదారులకు ఈ ప్రయోజనం చేకూర్చనున్నట్లు వివరించారు. అర్హులైన వారిని గుర్తించేందుకు ఒక్కో నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారిని గుర్తించాలని మంత్రి ఆదేశించారు. నగరంలో ఇండ్లు నిర్మించుకొనేందుకు ఖాళీ స్థలాలు లేవని, ప్రస్తుతం ఉన్న ఇంటిపైనే మరో నిర్మాణం చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని పలువురు ఎమ్మెల్యేలు మంత్రి దష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఈ విషయాన్ని గృహ నిర్మాణ శాఖ మంత్రి దష్టికి తీసుకెళ్తానని వివరించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, ఎమ్మెల్సీలు ప్రభాకర్ రావు, సురభి వాణిదేవి, రహ్మత్ బేగ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపినాద్, కాలేరు వెంకటేష్, కౌసర్ మొయినొద్దీన్, బలాల, మోజం ఖాన్, ముంతాజ్ ఖాన్, వివిధ నియోజకవర్గాలకు చెందిన నోడల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ మొత్తాన్ని పెంచాలి



తరుణ్‌చుగ్‌కు వినతి పత్రం అందిస్తున్న రాంచందర్‌రావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: భూగర్భ గనులలో రాత్రి పగలు కష్టపడి పనిచేసి రిటైర్డ్ అయిన వారికి కేవలం రూ.1000 పింఛన్ ఇవ్వడం అన్యాయమని సింగరేణి రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ దండంరాజు రాంచందర్‌రావు బీజేపీ రాష్ట్ర వ్యవహారల ఇంచార్జి తరుణ్ చుగ్‌తో ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మెడ్చల్ అర్బన్ జిల్లా కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. బొగ్గు గని పెన్షన్ పథకం 1998 ప్రకారం లక్ష మంది రిటైర్డ్ ఉద్యోగులు వెయ్యి రూపాయల పెన్షన్ ఇంకా పొందుతుండటం విచిత్రమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. స్పందించిన తరుణ్‌చుగ్ ఈ విషయంపై బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద జోషికి ఈ రోజే లేఖ రాస్తానని, ఆయనతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ విభాగంలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. గురువారం కళాశాల ఆడిటోరియంలో క్లైమేట్ ఫైనాన్స్ అండ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ రిస్క్ అండ్ రివార్డ్ అనే అంశం పై రెండు రోజుల సదస్సు జరగనుంది. కామర్స్ విభాగం హెడ్ ప్రొ.చెన్నప్ప అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, గౌరవ అతిథిగా ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్, ఐఏఎస్ అధికారి వాణిప్రసాద్ హాజరై జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. వాతావరణ మార్పు వంటి సమకాలీన సమస్యల పై సదస్సు నిర్వహించడం పట్ల వారు అభినందించారు. కార్యక్రమంలో కామర్స్ బీవోఎస్ ప్రొ.అప్పారావు, డీన్ ప్రొ. గంగాధర్, ప్రొ.నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్షల మందితో అక్టోబర్ 1న వైశ్య గర్జన



వైశ్య గర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాచం సత్యనారాయణ గుప్తా తదితరులు

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అన్ని కులాలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్య వైశ్యులను మాత్రం విస్మరించారని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. 2018 ఎన్నికల్లో గెలవగానే విలేకరుల సమావేశంలో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తిరిగి ఎన్నికలు సమీపిస్తున్నా ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. వైశ్యుల ఐక్యతను చాటిచెప్పేందుకు లక్షలాది మందితో అక్టోబర్ 1వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో 'వైశ్య గర్జన' నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గర్జన పోస్టర్‌ను వివిధ వైశ్య సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైశ్యుల్లో ఎంతో మంది నిరుపేదలు, రోజు కూలీ చేసుకునే వారు ఉన్నారని వారికి న్యాయం జరగాలంటే వెంటనే వెయ్యి కోట్లతో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తేవడం సంతోషమే అయినా అగ్రకులాల్లో తమదే ఎక్కువ జనాభా ఉంటుందని రిజర్వేషన్ లబ్ధి ఎక్కువగా పొందలేకపోతున్నామని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లలో ఏ,బీ,సీ,డీ విభజించాలన్నారు. సమావేశంలో నేతలు ప్రేమ్‌గాంధీ, భూపతి రాజా, శిరీష, కొత్త రవి, కిషన్‌గుప్తా, శ్రీనివాస్, సముద్రాల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో గణనీయమైన అభివృద్ధి

మేయర్ గద్వాల విజయలక్ష్మి

మల్లాపూర్: నగరంలో 9 ఏళ్లలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. గురువారం మల్లాపూర్ భవానీ నగర్ కమాన్ వద్ద రూ.73 లక్షల వ్యయంతో బాక్స్ కల్వర్టు పనులకు, బ్రహ్మపురి కాలనీలో రూ.1.70 కోట్ల వ్యయంతో చేపట్టబోయే ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..ఎస్ఆర్‌డీపీతో చేపట్టిన 35 పనులు పూర్తి చేశారని, అందులో 19 ఫ్లైఓవర్లు ,5 అండర్ పాస్, 7 ఆర్ఓబీలు పూర్తయ్యాయని తెలిపారు. లోతట్టు ప్రాంతాలల్లో వరద ముంపు నివారణకు రూ.733 కోట్ల వ్యయంతో నగరంలో 35 పనులు పూర్తి అయ్యాయని మిగతా పనులు తుది దశకు చేరాయన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో రూ.122 కోట్లతో చేపట్టిన పనులతో లోతట్టు ప్రాంతాల్లో వరద ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ మేయర్ సహకారంతో మల్లాపూర్ డివిజన్‌ను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పంకజ, ఎస్‌సీ అశోక్‌రెడ్డి, డీసీ ముకుందరెడ్డి, డీఈ రూప, ఏఈ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే సమస్యలను పరిష్కరిస్తాం

కాప్రా: నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి గురువారం కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డితో కలిసి డివిజన్‌లో పర్యటించిన ఆమె పలు సమస్యలను పరిశీలించారు. నాలా, రోడ్లు వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్పొరేటర్ శిరీష రెడ్డి మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాలనీల్లో తిరిగి సమస్యలు పరిశీలించిన మేయర్ సత్వర పరిష్కారానికి హామీ ఇచ్చారు. అంతకుముందు మేయర్ విజయలక్ష్మిని శాలువాతో సత్కరించి డివిజన్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ స్వప్నారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం బి–బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఏఎస్‌రావునగర్‌లో పర్యటిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి



రంగుల్లో

వరి వంగడాలు!



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రసాయన వ్యవసాయంలో హైబ్రిడ్ రకాల ప్రభావం పెరిగిపోతున్న ఈ రోజుల్లో దేశవాళీ రకాల పరిరక్షణకు ఓ యువకుడు నడుం బిగించాడు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా.. ఆరంభంలో ఐదు రకాల వరి వంగడాలతో సాగు మొదలుపెట్టి, నేడు 300 పైచిలుకు వరి విత్తనాలను సాగుచేస్తున్నాడు. ఎలాంటి లాభాపేక్షకు పోకుండా.. దేశవాళీ రకాలను దేశమంతా విస్తరింపజేయాలన్న సంకల్పంతో పదిమందికి పంచుతూ గొప్ప మనసు చాటుకుంటున్నాడు.. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం వ్యవసాయ విస్తరణ అధికారి యాదగిరి శ్రీనివాస్. వ్యవసాయంపై ఉన్న మక్కువకు తోడు సేంద్రియసాగులో పాలేకర్ ప్రభావంతో దేశీయవిత్తనాలను కాపాడాలనే లక్ష్యంతో తనకు ఉన్న మూడెకరాల వ్యవసాయభూమిలో సాగుచేస్తున్నాడు. పండించిన వరిధాన్యాన్ని తన అవసరాలకు పోగా, మిగిలిన వాటిని తెలుగు రాష్ట్రాల్లో వరి సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా సాగుతున్నాడు. వివిధ రకాల దేశవాళీ వరి వంగడాలను ఇతర ప్రాంతాల నుండి సేకరించి ప్రకృతి వ్యవసాయ(సేంద్రీయ) విధానంలో పండిస్తున్నాడు. ఇంద్రధనస్సు రంగులీనే ఈ వంగడాలు బాలింతల్లో పాల వృద్ధికి, పురుషుల్లో వీర్యవృద్ధికి ఉపయోగపడటం విశేషం.

అనేక పరిమాణాల్లో విత్తనాల వృద్ధి

మూడొందల వైవిధ్య వరి వంగడాల సాగులో ఏఈవో శ్రీనివాస్

విత్తన వైవిధ్యం కాపాడాలనే సంకల్పంతో సాగు

తెలుగు రాష్ట్రాల రైతులకు మేలైన విత్తనాల సరఫరా

రసాయనాలు లేని సేంద్రియ సాగు చేయాలన్న ఆకాంక్షతో 2009లో పాలేకర్ శిక్షణ శిబిరానికి ఏఈవో శ్రీనివాస్ హాజరయ్యారు. దీనిలో భాగంగా మొదట్లో పరిమళ సన్నా(తమిళనాడు), పంచరత్న (ఈశాన్యరాష్ట్రాల) కాలబట్టి(బెంగాల్, దుదేశ్వర్, అంబేమహర్(మహారాష్ట్ర)లకు చెందిన ఐదు రకాల వరి

పాలేకర్ పాఠాలతో..

వంగడాలను తీసుకొచ్చి సాగు మొదలు పెట్టాడు. దేశంలో ఒకప్పుడు ఐదువేలకుపైగా రకాలు సాగులో ఉండేవి. ఇవి మనిషి జీవితంలో బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అన్ని దశల్లోనూ కావాల్సిన పోషకాలను అందించగలవు. చిన్నారుల ఉగ్గు నుండి మొదలుకొని దేవుడి నైవేద్యం వరకు ప్రత్యేక రకాల వరి బియ్యం సాగులో ఉండేవి. ఆ రకాలను కాపాడాలన్న సంకల్పంతో ఇలా ఐదు నుంచి మొదలుపెట్టిన వరి రకాలు నేడు 300 వరివంగడాలకు చేరుకున్నాయి.



శ్రీనివాస్ సాగు చేసే రకాలు..

1) **నల్లరంగు వడ్లు:** పంచరత్న, కాలాబట్ట, బర్మాబ్లాక్, కరిగేజావలి, ఇల్లపు సాంబా, కరిజిద్దా, రమ్యగళి, నవార, కాకిరెక్కలు, కాలాజీరా, ముడిమురంగి, తలంగూర్, తైవాన్‌బ్లాక్, చిట్టిగ, కాజీసాల.

2) **గోధుమ రంగు వడ్లు:** మాపిళ్లైసాంబా, కండసాగర్, ఆప్తోకల్, కస్మకుందా, హల్లబట్టా.

3) **ఎరుపు రంగు వడ్లు:** సేలం సన్న, చిన్న బైసిల్‌మోర్, రాంశ్రీ, అరుకులోయ, కుంకుమసాలి.

4) **పొట్టిగింజ వడ్లు:** తులసీబాసో, డడ్డీగ, అంబేమోహర్, పరిమళ సన్న, నికో, బాలాజీ, రాధజీగేల్, బేకనాశా, జీరగసాంబా, టిక్కిమిస్రీ, సమేలీ బోగ్, బాస్ బోగ్, ఘని.

5) **సువాసన వడ్లు:** బాసుమతి(ఢిల్లీ, చంద్రగుప్తా, లోకల్), పరిమళ సన్న, సుగంధి, అంబేమొహర్.

6) **సన్నవడ్లు:** దూదేశ్వర్, చింతలూరి సన్న, ఛత్తీస్‌గఢ్ మచ్చకాంత, డీఆర్‌కే2, రాణి కంద, సానకడిక, నారాయణ కామిని, కమల్ సాంగ్రి, రత్న చోడి.

7) **పొడవు వడ్లు:** మల్లీఫూల్, సన్నజాజులు.

8) **దొడ్డు వడ్లు:** నికో, బహురూపి, రెడ్ జాస్మిన్.

సాగు చేసిన వాటిలో కొన్ని రకాల ప్రత్యేకతలు

1) పుంగార్: బాలింతలకు అధిక పాల వృద్ధికి దోహదపడుతుంది.

2) మపిళ్లైసాంబా: యుక్త వయస్సు వారికి వీర్య వృద్ధికి తోడ్పడుతుంది.

3) కులాకార్: గర్భిణులకు సుఖ ప్రసవానికి ఉపయోగపడుతుంది.

4) నవారా: మధుమేహ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నియంత్రణకు, నివారణకు ఉపయుక్తంగా ఉంటుంది.

5) బ్లాక్ రైస్: అన్ని రకాల నల్ల బియ్యం రోగనిరోధక శక్తి పెంపొందిస్తాయి.

పాలమూరుకు లైన్ క్లియర్!

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల మదింపు కమిటీ ఊరట

- పలు షరతులతో పర్యావరణ అనుమతులకు సిఫార్సు
- ముందే పనులు మొదలుపెట్టిన ప్రాజెక్టు అధికారిపై చర్యలకు ఆదేశం.. అనుమతి లేకుండా చేసిన పనులకు రూ.106 కోట్ల జరిమానా
- పర్యావరణ పునరుద్ధరణ కోసం రూ.153.7 కోట్లతో ప్రణాళిక అమలు చేయాలి
- ఆయా గ్రామాల్లో వైద్యం, తాగునీరు, సోలార్ ప్యానెల్స్, బయోగ్యాస్ ప్లాంట్లు
- ఉద్యోగాల్లో స్థానికులు, నిర్వాసితుల కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని నిపుణుల మదింపు కమిటీ (ఎక్స్‌పర్ట్స్ అప్రైజల్ కమిటీ/ఈఏసీ) పలు షరతులతో ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు జారీ చేయాలని సిఫార్సు చేసింది. గత నెల 24న జరిగిన సమావేశం నిర్ణయాలు తాజాగా వెలువడ్డాయి. దీంతో త్వరలో ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు జారీ కానున్నాయి. రూ.55,086.57 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కింద 6 జిల్లాల్లోని 70 మండలాల పరిధిలో మొత్తం 8,83,945 హెక్టార్ల ఆయకట్టుకు ప్రభుత్వం నీరు అందించనుంది.

ఆ అధికారులపై చర్యలు తీసుకున్నాకే..

పర్యావరణ అనుమతులు లేకుండానే పనులను చేపట్టినందుకుగాను.. ప్రాజెక్టును ప్రతిపాదించిన అధికారి (ప్రాజెక్టు ప్రపోనెంట్)పై పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లోని సెక్షన్ 19 కింద రాష్ట్ర ప్రభుత్వం/కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) చర్యలు తీసుకోవాలని నిపుణుల కమిటీ షరతు విధించింది. పర్యావరణ అనుమతుల జారీకి ముందే ఈ చర్యల వివరాలను సమర్పించాలని.. అనుమతులు జారీ చేసే వరకు పనులేవీ చేపట్టరాదని స్పష్టం చేసింది.

రూ.106 కోట్ల జరిమానా..

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో.. పర్యావరణ ప్రభావం మదింపు (ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్/ఈఐఏ) నోటిఫికేషన్ 2006ను నీటిపారుదల శాఖ ఉల్లంఘించినట్టు నిపుణుల మదింపు కమిటీ గతంలోనే నిర్ధారించింది. ఇలాంటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల జారీకి ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను అమలు చేయాల్సి ఉంటుందని తేల్చింది. ఈ క్రమంలో.. పర్యావరణ పునరుద్ధరణకు రూ.72.63 కోట్లు, ప్రకృతి వనరుల వృద్ధికి రూ.40.2 కోట్లు, సామాజిక వనరుల అభివృద్ధికి రూ.40.8 కోట్లు కలిపి మొత్తం రూ.153.7 కోట్లతో ఎస్‌ఓపీ ప్రణాళికలు అమలు చేస్తామని నీటిపారుదల శాఖ ప్రతిపాదించగా.. నిపుణుల కమిటీ ఆమోదించింది. ఈ మొత్తానికి ఐదేళ్ల బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలని షరతు విధించింది. ఇక అనుమతులు లేకుండానే రూ.21,200 కోట్లతో పనులు చేసినందున.. నిబంధనల ప్రకారం అందులో 0.5శాతం (రూ.106 కోట్లు) జరిమానాగా పీసీబీకి చెల్లించాలని ఆదేశించింది.

కోర్టు కేసుల చిక్కులు తొలగినట్టే!

పర్యావరణ అనుమతులు తీసుకోకుండా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పనులను నిలిపేయాలని గతంలో ఎన్జీటీ ఆదేశించింది. అయినా పనులు కొనసాగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.920.85 కోట్ల భారీ జరిమానా కూడా విధించింది. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే పొందింది. తాగునీటి అవసరాల కోసం 7.15 టీఎంసీలను మాత్రమే తరలించేలా ప్రాజెక్టు పనులకు సుప్రీం నుంచి అనుమతులు పొందింది. కానీ ఏకంగా 120 టీఎంసీల నీటి తరలింపునకు వీలుగా ప్రభుత్వం ప్రాజెక్టు పనులు చేస్తోందని ధ్రువీకరిస్తూ కేంద్ర జలశక్తి శాఖ, కృష్ణా బోర్డు తాజాగా సుప్రీంకోర్టులో సంయుక్తంగా అఫిడవిట్ దాఖలు చేశాయి. దీంతో కోర్టు ధిక్కరణ చర్యలకు ఆస్కారం ఉండటంతో నీటిపారుదల శాఖవర్గాలు ఆందోళనలో పడ్డాయి. అక్టోబర్ 6న సుప్రీంకోర్టులో దానిపై విచారణ జరగనుండగా.. ఆలోపే ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంటే ప్రాజెక్టు పర్యావరణ అనుమతుల విషయంలో న్యాయపరమైన చిక్కులు తొలగిపోనున్నాయి.

కుట్రలను ఛేదించి.. కేసులను అధిగమించి..

పాలమూరు ప్రాజెక్టుకు అనుమతులపై మంత్రి హరీశ్‌రావు ట్వీట్

సాక్షి, హైదరాబాద్: కుట్రలను ఛేదించి, కేసులను అధిగమించి పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సీఎం కేసీఆర్ పర్యావరణ అనుమతులు సాధించారని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ''దశాబ్దాలుగా అన్యాయానికి, వివక్షకు గురైన పాలమూరుకు కృష్ణమ్మ పరుగుపరుగున రానుంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు సాధించడం సీఎం కేసీఆర్ సాధించిన మరో అపూర్వ, చరిత్రాత్మక విజయం..''అని హరీశ్ పేర్కొన్నారు. కేసీఆర్ మొక్కవోని దీక్షకు, ప్రభుత్వం పట్టువిడవని ప్రయత్నం తోడుగా సాధించిన ఫలితం ఇదని.. పాలమూరు బిడ్డల దశాబ్దాల కల సాకారమైన సందర్భంగా మాటల్లో వర్ణించలేని మధుర ఘట్టమని అభివర్ణించారు.

నిపుణుల కమిటీ షరతుల్లో ముఖ్యమైనవి

- పర్యావరణ/సామాజిక నష్టాన్ని నిర్దేశిత గడువులోగా పునరుద్ధరించాలి. మూడేళ్లలోగా రూ.153.7 కోట్లతో నష్ట నివారణ ప్రణాళిక అమలు పూర్తి చేయాలి.
- ఎన్జీటీ ఆదేశాల మేరకు నియమించిన నిపుణుల కమిటీ సూచనల మేరకు నష్ట నివారణ చర్యలుండాలి.
- అన్ని రిజర్వాయర్లకు 500 మీటర్ల దూరం వరకు పెద్దెత్తున మొక్కలు నాటి అందులో కనీసం 90శాతాన్ని సంరక్షించాలి. వాటర్‌షెడ్ల అభివృద్ధి ప్రణాళిక, వన్యమృగాల సంరక్షణ ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలి.
- ప్రాజెక్టు ఉద్యోగాలు, ఇతర అవకాశాల్లో స్థానిక గ్రామస్తులకు, నిర్వాసితుల కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ వంటి వృత్తుల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో తాగునీరు, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించాలి.
- ప్రాజెక్టుకు 10 కిలోమీటర్ల పరిధిలోని గ్రామస్తులకు సోలార్ ప్యానెళ్లు అందజేయాలి. ప్రభావిత గ్రామాల్లో బయో గ్యాస్ ప్లాంట్లు నెలకొల్పాలి.

పాలమూరు బిడ్డల పాదాల వద్దకు కృష్ణమ్మ నీళ్లు

పాలమూరు ప్రాజెక్టుకు అనుమతులతో ఆ సమయం ఆసన్నమవుతోంది: సీఎం



సాక్షి, హైదరాబాద్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల మంజూరు దిశగా గ్రీన్‌సిగ్నల్ రావడంపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కృష్ణమ్మ నీళ్లను తెచ్చి పాలమూరు బిడ్డల పాదాలు కడిగే రోజు ఆసన్నమైందని పేర్కొన్నారు. ఎన్నో కేసులను ఎదుర్కొని, మరెన్నో అడ్డంకులను అధిగమించి, పోరాడి అనుమతులు సాధించామని.. ఇది తెలంగాణ సాధించిన మరో అద్భుత, చారిత్రక విజయమని తెలిపారు. ఇప్పటికే ప్రాజెక్టు తొలిదశ పనులు తుదిదశకు చేరుకున్నాయని.. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే రెండో దశ పనులు చకచకా ముందుకు సాగే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో, అనుమతుల సాధనలో తెలంగాణ ప్రభుత్వానికి సాటిలేదని, రాష్ట్ర సర్కారు సంకల్పానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వివరించారు. పాలమూరుకు పర్యావరణ అనుమతుల సాధన కోసం కృషి చేసిన సాగునీటి శాఖ అధికారులను కేసీఆర్ అభినందించారు.

కీపిటప్.. మహమ్మద్ యూనస్!



ఉదయాన్నే కాఫీ తాగుతూ పేపర్ తిరగేస్తుంటే కనిపించింది..
ప్రభుత్వ ఉద్యోగం రాలేదని ఒకరు ఆత్మహత్య అని..
అలా మరో పేజీ తిప్పానో లేదో.. సివిల్స్‌లో ఫెయిలయ్యానని బలవన్మరణం అంటూ మరోవార్త..
ఇదేమిటి చిన్నచిన్న కారణాలతో ఇలా చనిపోవడాలు అనిపించింది..
అప్పుడే నిన్న కలిసిన మహమ్మద్ యూనస్ గుర్తొచ్చాడు..
బతుకంతా కష్టాలు ఎదుర్కొన్నా.. అతడి మొహంలో చెదిరిపోని ఆ చిరునవ్వు గుర్తొచ్చింది..
అంగవైకల్యం వెనక్కులాగుతున్నా.. ముందుకు దూసుకెళ్లాలన్న అతడి గుండెధైర్యం ఈ ఆత్మహత్యల వార్తల సమయంలో మరీ గుర్తొచ్చింది..

ఆ మహమ్మద్ యూనస్ ఎవరో తెలుసుకుందాం.. ఓ సాక్షి పాఠకుడి మాటల్లో అతడి కథను విందాం..

ఓ ఆయుర్వేద మందుల దుకాణం నుంచి మెడిసిన్స్ తెప్పించాలి. దాంతో ఒక బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ యాప్‌లో రైడర్‌ను బుక్ చేసుకుని మందులు ఇంటికి తెప్పించుకున్నాను. కిందకు వెళ్లి అడిగాను.. డెలివరీ బాయ్ వచ్చాడా అని.. అప్పుడు నేనేనండి అంటూ నవ్వుతూ వచ్చాడు మహమ్మద్ యూనస్.. చూడగానే ఆశ్చర్యం కలిగింది.. ఎందుకంటే.. తను దివ్యాంగుడు.. ఎప్పుడూ ఈ పనిలో దివ్యాంగులను చూడని నేను ఆసక్తితో అతడి వివరాలు అడిగాను.. అప్పుడు చెప్పాడు.. 36 ఏళ్ల యూనస్ తన కథ..

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ చెందిన యూనస్‌ది పేద కుటుంబం. చిన్నతనంలోనే పోలియో బారిన పడ్డాడు. రెండు కాళ్లూ చచ్చుబడి పోయాయి. శరీరం సహకరించకపోయినా ఇంటర్ పూర్తి చేశాడు. ఒక మీడియా సర్వీసెస్ సంస్థలో పదేళ్లు పనిచేశాడు. అది మూతపడ్డాక ఒక మొబైల్ షాపులో చేరాడు. పైగా తండ్రి మరణంతో కుటుంబ బాధ్యత ఇతడి మీదే పడింది. లాక్‌డౌన్‌తో ఆ మొబైల్ షాపు కాస్తా మూతపడటంతో బతుకు రోడ్డున పడింది. ఇదే సమయంలో అనారోగ్యంతో తన 6 నెలల బిడ్డనూ పోగొట్టుకున్నాడు. కష్టాల మీద కష్టాలు వచ్చిపడ్డాయి. కానీ గుండె ధైర్యం మాత్రం సడలలేదు. లాక్‌డౌన్ సడలించాక ఒక బైక్ ట్యాక్సీ యాప్ వేదికగా రైడర్‌గా మారాడు. 'ఈ నా బండిని చూసి రోజూ ఒకరిద్దరు రైడ్ క్యాన్సిల్ చేసుకునేవారు. కన్నీళ్లు వచ్చేవి. నా వైకల్యాన్ని చూసి రైడ్ క్యాన్సిల్ చేసుకున్నారని చాలా బాధపడ్డాను. అయితే.. బతకాలంటే పని చేయాలి. అందుకే పరుగు ఆపకూడదని నిర్ణయించుకున్నాను. రైడ్ లేకపోతే సరుకు డెలివరీ అయినా ఉంటుంది. రోజూ ఖర్చులుపోను ఇంటికి రూ.300 దాకా తీసుకువెళతాను. ఒంట్లో శక్తి ఉన్నంత వరకు నా రైడ్ ఆగదు.. సార్' అంటూ చిరునవ్వుతో సెలవు తీసుకున్నాడు యూనస్. **'ప్రభుత్వం నుంచి రుణం అందితే ఇంటి దగ్గర మీ సేవ లేదా మొబైల్/కిరాణా దుకాణం పెట్టుకోవాలన్న ఆలోచన ఉంది.. సార్'** అని తన మనసులోని మాట చెప్పాడు. ఈ ఆత్మహత్యల వార్తలు చదివాక.. యూనస్‌ను చూశాక అనిపించింది.

**మనం చూడాల్సింది నిరాశ అనే నిశీధిని కాదు.. దాన్ని తరిమేసే ఆ చిరుదివ్వెను....
కష్టాల చీకట్లో మగ్గుతున్న ఎంతోమందికి ఈ యూనస్ కథ ఒక చిరుదివ్వెనే...**

కీపిటప్.. మహమ్మద్ యూనస్..

సాక్షి, హైదరాబాద్

'బాసర' విద్యార్థుల కోసం
ఏఐ యాప్

- మానసికస్థితి అవగాహన కోసం..
- అమెరికా, బిట్స్‌పిలానీ ప్రొఫెసర్‌లతో 'వీసీ'
- కదిలించిన 'సాక్షి' కథనం



నిర్మల్

బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులకు మానసిక, ఆరోగ్య పరిస్థితులకు సంబంధించిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) బెస్ట్ ప్లాట్ ఫాం యాప్‌పై అవగాహన కల్పించారు. ఇటీవల అక్కడ వరుసగా చోటుచేసుకుంటున్న ఆత్మహత్యల ఘటనలపై 'ఎందుకలా చనిపోతున్నారు..'శీర్షికన 'సాక్షి'మెయిన్‌పేజీలో గురువారం ప్రత్యేక కథనాన్ని ప్రచురించి సంగతి తెలిసిందే. ఈమేరకు వర్సిటీ వర్గాలు స్పందించాయి. ప్రముఖ మానసిక నిపుణులు అమెరికాకు చెందిన డాక్టర్ మైక్, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ మోహన్‌తో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ వెంకటరమణ ఏఐ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మానసిక స్థితిపై..
విద్యార్థి మానసిక స్థితిని తెలుసుకోవడానికి ఏఐ బెస్ట్ యాప్ బాగా ఉపయోగపడుతుందని అమెరికా మానసిక నిపుణుడు మైక్ అన్నారు. ఈ యాప్ ద్వారా అడిగే 17 ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వారు సమాధానాలు ఇచ్చిన తర్వాత వాటిని నిపుణుల విశ్లేషణ, సంప్రదింపుల తర్వాత విద్యార్థికి ఏ మోతాదులో మానసిక సహాయం చేయాలనేది నిర్ణయిస్తామన్నారు. విశ్లేషణాత్మక డేటా, నిపుణుల అనుభవం ద్వారా వారికి సహాయం అందిస్తామని చెప్పారు. బిట్స్ పిలానీ ప్రొఫెసర్ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

నలుగురు రాష్ట్ర హైకోర్టు జడ్జీలు బదిలీ!

- కేంద్రానికి సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టుకు చెందిన నలుగురు న్యాయమూర్తులను ఇతర కోర్టులకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. వీరిలో జస్టిస్ అనుపమ చక్రవర్తిని పాట్నా హైకోర్టుకు.. జస్టిస్ ఎం.లక్ష్మణ్‌ను రాజస్థాన్ హైకోర్టుకు, జస్టిస్ సుధీర్‌కుమార్‌ను కోల్‌కతా హైకోర్టుకు, జస్టిస్ సుమలతను గుజరాత్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం ఈ నెల 3న తీర్మానించింది. దీనికి సంబంధించిన వివరాలను గురువారం అర్ధరాత్రి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. తన మాతృ హైకోర్టుకు సమీపానికి బదిలీ చేయాలని జస్టిస్ అనుపమ, కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని జస్టిస్ లక్ష్మణ్, కర్ణాటక లేదా మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని జస్టిస్ సుధీర్‌కుమార్, ఏపీ లేదా కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని జస్టిస్ సుమలత విజ్ఞప్తి చేశారని కొలీజియం తెలిపింది. వారి విజ్ఞప్తులను పరిశీలించి, తగిన మెరిట్ లేదని తేల్చినట్టు వెల్లడించింది. కాగా కొలీజియం సిఫార్సులపై రాష్ట్రపతి ఆమోదముద్ర పడిన తర్వాత బదిలీలు అమల్లోకి రానున్నాయి.

'బోలో' శంకరా.. నిబంధనలు పాటించరా?

- భోళా శంకర్ చిత్రం టికెట్ రేట్లపై ఏపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం
- ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నం

సాక్షి, అమరావతి: సినిమా టికెట్ రేట్ల పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు రూపొందించింది. అదీ.. సినీ పరిశ్రమ పెద్దలతో చర్చించి, రూపొందించిన నిబంధనలే. గతంలో విడుదలైన సినిమాలకు ఈ నిబంధనల మేరకు సమాచారాన్ని, ఆధారాలను సమర్పించి, ఆ సినిమాల నిర్మాతలు రేట్లు పెంచుకున్నారు. చిరంజీవి నటించిన భోళాశంకర్ సినిమాకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా సంస్థలకు నచ్చలేదట. వెంటనే అవి ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని ప్రారంభించాయి. ఏపీలో ఉన్న నిబంధనల ప్రకారం హీరో హీరోయిన్, డైరెక్టర్ల పారితోషికాలు కాకుండా ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ వ్యయం కలిపి రూ.100 కోట్లు దాటాలి. సినిమా షూటింగ్‌లో కనీసం 20 శాతం ఆంధ్రప్రదేశ్‌లో చేయాలి. సినిమా నిర్మాణ వ్యయానికి సంబంధించిన అఫిడవిట్‌ను సమర్పించాలి. దాన్ని చార్టర్డ్ అకౌంటెంట్ ద్వారా ధ్రువీకరించాలి. సినిమా నిర్మాణానికి చేసిన చెల్లింపులకు సంబంధించి జీఎస్టీ /ట్యాక్స్ రిటర్న్‌లు, ఇన్వాయిస్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు సమర్పించాలి.

అయితే, భోళా శంకర్ సినిమాను నిర్మించిన అడ్వెంచర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆ నిబంధనలను ఏపీ పట్టించుకోలేదు. తొలి వారం రోజులు టిక్కెట్ రేట్ల పెంపునకు అనుమతినివ్వాలని ఆ సంస్థ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఎఫ్‌టీవీటీడీసీ)కి జులై 30న దరఖాస్తు చేసింది. దానిని ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ పరిశీలించింది. జీవో నంబర్ 2 ప్రకారం ఇచ్చిన ఉత్తర్వుల్లో నిబంధనలను పాటించాలని, ఆధారాలు చూపాలని ఈ నెల 2న లిఖితపూర్వకంగా చెప్పింది.కానీ అడ్వెంచర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటివరకు ఆ ఆధారాలను సమర్పించలేదు.

ఈ నేపథ్యంలో టిక్కెట్ రేట్ల పెంపునకు ప్రభుత్వం ఎలా అనుమతిస్తుంది? కాగా, చిరంజీవి హీరోగా నటించిన ఆచార్య, వాల్తేర్ వీరయ్య సినిమాలకు ఈ నిబంధనల ప్రకారమే టిక్కెట్ రేట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.

ఏపీ ఎమ్మెల్సీలుగా పద్మశ్రీ, కుంభా రవిబాబు





సాక్షి, అమరావతి: గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు శాసన మండలి స్థానాలకు కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబును ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ నామినేట్ చేసిన కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబును శాసన మండలి సభ్యులుగా నియమిస్తూ జీవో ఎంఎస్ నంబర్ 87 జారీ చేశారు. గతంలో గవర్నర్ కోటాలో శాసన మండలి సభ్యులుగా ఉన్న చాదిపిరాళ్ల శివనాథరెడ్డి, ఎస్ఎండీ ఫరూక్ పదవీకాలం జులై 20వ తేదీతో ముగిసింది. దీంతో వారి స్థానంలో కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబును ఎంపిక చేశారు.

నా విషయంలో పవన్ చేసింది 100% తప్పే : రేణుదేశాయ్

సాక్షి, అమరావతి: తన విషయంలో పవన్ కల్యాణ్ చేసింది 100 శాతం తప్పేనని పవన్ కల్యాణ్ మాజీ భార్య సినీ నటి రేణుదేశాయ్ స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ చేసిన తప్పులకు ఆయన మాజీ భార్యలు, పిల్లలకు ఎటువంటి బాధ్యత లేదు కాబట్టి రాజకీయ, వృత్తిపరమైన విభేదాల్లోకి వారిని లాగవద్దంటూ విజ్ఞప్తి చేస్తూ గురువారం ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఈ మధ్య విడుదలైన పవన్‌కల్యాణ్ సినిమా వివాదాలు సృష్టించిందని, ఆ సమయంలో తాను విదేశాల్లో ఉండటంతో ఏమి జరిగిందన్న విషయం తెలియలేదని చెప్పారు. కానీ కొంతమంది పవన్ కల్యాణ్ మాజీ భార్యలు, పిల్లల మీద సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చేయనున్నట్లుగా ప్రకటించిన విషయం తెలిసిందని, పవన్‌తో రాజకీయ, వృత్తిపరమైన విభేదాలు ఉంటే మీరు మీరు చూసుకోండి కానీ ఇందులోకి మహిళలను, పిల్లలను లాగవద్దని పేర్కొన్నారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- హిందూ ధార్మికతను ప్రపంచవ్యాప్తం చేస్తాం
- సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తాం
- టీటీడీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారోత్సవంలో భూమన కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి/తిరుమల: సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం చేయించడానికే ప్రాధాన్యత ఇస్తానని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. ఆయన టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి.. భూమన కరుణాకరరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అన్నమయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కరుణాకరరెడ్డి మాట్లాడుతూ స్వామి సేవకులకు సేవకుడిగా పనిచేస్తానన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి దయ, ఆశీస్సులతో తనకు రెండోసారి టీటీడీ చైర్మన్‌గా సేవచేసే మహద్భాగ్యం దక్కిందన్నారు. ఇంతటి అదృష్టం ఇచ్చిన స్వామికి, మరోసారి పనిచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సనాతన హిందూధర్మాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయడంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేలా తమ ధర్మకర్తల మండలి పనిచేస్తుందని చెప్పారు. స్వామి వైభవాన్ని ప్రజల హృదయాల్లో తీర్చిదిద్దేలా వారిలో ఆధ్యాత్మిక వెలుగులు నింపుతామని, స్వామిని భక్తుల దగ్గరికే తీసుకెళ్లి భక్తిప్రసాదం పంచుతామని తెలిపారు. దేశవిదేశాల్లోని హిందువులందరినీ ఏకతాటిపైకి తెచ్చి హిందూ ధర్మాన్ని ప్రచారం చేసేలా టీటీడీ నాయకత్వం వహిస్తుందని చెప్పారు.



భూమన కరుణాకర రెడ్డి దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో ధర్మారెడ్డి. చిత్రంలో చెవిరెడ్డి, రోజా

తాను 2006 నుంచి 2008 వరకు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా పనిచేసినప్పుడు సనాతన హిందూధర్మాన్ని దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేశామని, సామాన్య భక్తులకు అవసరమైన వసతులు కల్పించటమేగాక సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ద్వారా ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇచ్చామన్నారు. ఇప్పుడు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇప్పిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు ఆర్.కె.రోజా, అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...


కాంగ్రెస్ నేతల అరెస్టులు అక్రమం: రేవంత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతు పలికితే కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం శోచనీయమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన ఆలోచించాల్సిన పాలకులు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి నియంతలా ప్రవర్తిస్తున్నారని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. గ్రూప్ -2 పరీక్షల వాయిదా కోసం విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న డిమాండ్‌పై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రియాజ్‌ను మఫ్టీ పోలీసులు తన కోచింగ్ సెంటర్‌లో అరెస్ట్ చేసి ఎక్కడికి తీసుకెళ్లారో తెలియదని, ఉదయం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను అరెస్ట్ చేశారని చెప్పారు. విద్యార్థుల పక్షాన ప్రజాస్వామిక పోరాటం చేస్తున్న నాయకులను అరెస్టులు చేయడం అక్రమమని, వెంటనే వారిని విడుదల చేయాలని లేదంటే ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని హెచ్చరించారు.

ఆ కోర్సుల్లో క్రీడా కోటా ఎందుకు తొలగించారు

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో క్రీడా రిజర్వేషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్..లాంటి వైద్య విద్యా కోర్సుల్లో క్రీడా కోటా రిజర్వేషన్ ఎందుకు తొలగించారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను వాయిదా వేసింది. వైద్య, విద్యా కోర్సుల్లో క్రీడా కోటా కింద 0.3 శాతం రిజర్వేషన్‌ను తీసివేస్తూ ప్రభుత్వం..జూలై 4న జీవో 75ను జారీ చేసిందని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన జి.హరికృష్ణతో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. క్రీడా కోటా రిజర్వేషన్ కింద 2018లో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది జైశ్వాల్ వాదనలు వినిపించారు. హైకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్ల కల్పన నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక అందజేసిందని, ఆ నివేదిక ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగినా ఇవ్వడం లేదన్నారు. వాదనలను విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

పరీక్షల నిర్వహణ పరీక్షే!

ఇప్పటికే గ్రూప్-2 వాయిదా డిమాండ్‌తో టీఎస్‌పీఎస్సీ ఉక్కిరిబిక్కిరి

- వాయిదా వేస్తే ఇతర పరీక్షలపైనా ప్రభావంపడే అవకాశం
- ముంచుకొస్తున్న అసెంబ్లీ ఎన్నికల క్రతువు
- గ్రూప్-3, డీఏఓ, డిగ్రీ, జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు ఇప్పటికీ ఖరారుకాని తేదీలు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అర్హత పరీక్షల నిర్వహణపై తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సతమతమవుతోంది. ఇప్పటికే ప్రకటించిన పరీక్షలను వాయిదా వేయాలంటూ ఒకవైపు ఒత్తిడి పెరుగుతుండగా... మరోవైపు ఇప్పటివరకు తేదీలు ప్రకటించని పరీక్షల నిర్వహణ ఎలా అనే అంశం కమిషన్‌కు తలనొప్పిగా మారుతోంది. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల క్రతువు ముంచుకొస్తోంది. ఆ తర్వాత వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు, అనంతరం పార్లమెంటు ఎన్నికలతో ప్రభుత్వ యంత్రాంగం అత్యంత కీలక కార్యక్రమాల్లో బిజీ కానుంది. దీంతో ఆలోపు అర్హత పరీక్షలను నిర్వహించాలని మొదటినుంచి కార్యాచరణ సిద్ధం చేసుకున్న టీఎస్‌పీఎస్సీకి ప్రస్తుత పరిస్థితులు మింగుడుపడటం లేదు. తాజాగా టీఎస్‌పీఎస్సీని గ్రూప్-2 వాయిదా డిమాండ్ అంశం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వాస్తవానికి ఈనెల 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ నాలుగు నెలల క్రితమే ప్రకటించింది. ఈ క్రమంలో సమయం తక్కువగా ఉన్నందున గ్రూప్-2కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కాలేకపోయామని, మరికొంత సమయం ఇవ్వాలని, ఇందులో భాగంగా పరీక్షలను కొంతకాలం వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో పాటు కమిషన్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం టీఎస్‌పీఎస్సీని ఇరకాటంలో పడేసినట్లయింది.

'లీకేజ్'తో గందరగోళ పరిస్థితులు..

గురుకుల విద్యా సంస్థల్లో దాదాపు 9వేలకు పైబడి ఉద్యోగ ఖాళీల భర్తీలో భాగంగా తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) ప్రస్తుతం అర్హత పరీక్షలను నిర్వహిస్తోంది. అన్ని పరీక్షలను ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహిస్తున్న టీఆర్ఈఐఆర్‌బీ ఈనెల 23వ తేదీ వరకు విరామం లేకుండా పరీక్షల షెడ్యూల్‌ను రూపొందించి వేగంగా పరీక్షలను పూర్తి చేస్తోంది. మరోవైపు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సైతం ఎలాంటి ఆందోళనలకు తావులేకుండా పరీక్షల నిర్వహణలో బిజీ అయ్యింది. దాదాపు 45 వేల ఉద్యోగాల భర్తీతో వివిధ రకాల నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్‌పీఎస్సీ... షెడ్యూల్‌ను రూపొందించి పరీక్షల నిర్వహణకు ఉపక్రమించింది. కానీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో తీవ్ర గందరగోళ పరిస్థితులను ఎదుర్కొన్న కమిషన్... ఇదివరకే నిర్వహించిన నాలుగు రకాల పరీక్షలను రద్దు చేయడం... మరో రెండు పరీక్షలను వాయిదా వేయడం... మరికొన్నింటిని రీషెడ్యూల్ చేయడంతో రూపొందించుకున్న ప్రణాళిక గాడి తప్పింది. ఆ తర్వాత పరిస్థితులను చక్కదిద్దుకుంటూ క్రమంగా పరీక్షలను నిర్వహిస్తూ ముందుకెళ్తుండగా... ఇప్పుడు గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలనే డిమాండ్‌తో ఇరకాటంలో పడింది.

వాయిదా వేస్తే...

మరో రెండు నెలల్లో ఎన్నికల సమయం ఆసన్నం కానుంది. వరుసగా ఎన్నికలుండటంతో కొంతకాలం పరీక్షలు నిర్వహించే పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పోలీసు యంత్రాంగం, ఇతర పరిపాలనాధికారులంతా ఎన్నికల విధుల్లో బిజీ అయితే, పరీక్షల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం పరీక్షల వాయిదా ఒక డిమాండ్ అయితే... ఇంకా కొన్ని రకాల పరీక్షలకు తేదీలు ప్రకటించకపోవడం మరో అంశం. గ్రూప్-3 పరీక్షతో పాటు డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓలతో పాటు డిగ్రీ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ తదితర పోస్టులతో పాటు చిన్నాచితకా పోస్టులకు ఇంకా టీఎస్‌పీఎస్సీ తేదీలే ఖరారు చేయలేదు. ఇప్పుడున్న డిమాండ్‌ను పరిగణించి పరీక్షను వాయిదా వేస్తే ఆ ప్రభావం మిగతా పరీక్షల నిర్వహణపైన పడుతుంది. ఎన్నికల సమయం నాటికి పరీక్షలు పూర్తిచేయకపోతే, ఆ తర్వాత కొంతకాలం వరకు వేచి చూడాల్సిన పరిస్థితి వస్తుందని కమిషన్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఇప్పుడు ఎంతో శ్రద్ధతో పరీక్షలకు సన్నద్ధమైన అభ్యర్థులు అసహనానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదనే వాదన కూడా వినిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో టీఎస్‌పీఎస్సీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

బుద్వేల్ 'భూ'మ్!

▶ మొదటి పేజీ తరువాయి

లభించింది. ఎకరానికి కనీస ధరను రూ.20 కోట్ల చొప్పున నిర్ణయించారు. కానీ గురువారం నిర్వహించిన బిడ్డింగ్‌లో అత్యధికంగా ఎకరానికి రూ.41.25 కోట్ల వరకు ధర పలికింది. కనిష్ఠంగా రూ.33.25 కోట్ల ధర లభించింది. సగటున ఎకరం రూ.36.25 కోట్ల చొప్పున విక్రయించినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. కోకాపేట్ నియో పోలీస్‌లో ఇటీవల 45.33 ఎకరాల భూములపై రూ.3,319.60 కోట్ల ఆదాయం లభించగా, బుద్వేల్‌లో వంద ఎకరాలకు రూ.3,625 కోట్లు లభించడం గమనార్హం. గురువారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు రెండు విడతలుగా బిడ్డింగ్ కొనసాగింది.

హాట్‌కేక్‌లే...

తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్‌కు దగ్గర్లో ఉన్న బుద్వేల్ భూములు నగరానికి, ఔటర్‌కు, ఎయిర్‌పోర్టు మార్గానికి అందుబాటులో ఉండడంతో రియల్ ఎస్టేట్ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయి. ఒక్కో ప్లాట్‌లో కనిష్ఠంగా 3.47 ఎకరాల నుంచి గరిష్ఠంగా 14.33 ఎకరాల వరకు భూమి అందుబాటులో ఉంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఎత్తైన ప్రదేశంలో ఉన్న ఈ వెంచర్‌లో బహుళ వినియోగ భవనాలకు అనుమతులను ఇవ్వనున్నారు. కోకాపేట్ తరహాలోనే అపరిమిత అంతస్తులను నిర్మించవచ్చు. నగరానికి పడమటి వైపు ఇప్పటికే భారీ ఎత్తున హైరైజ్ బిల్డింగ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఐటీ సంస్థలు వెలిశాయి. దీంతో విమాన, రోడ్డు రవాణా సదుపాయాలతో పాటు అన్ని విధాలుగా అనుకూలంగా ఉన్న బుద్వేల్ పై అందరి దృష్టి పడింది. హెచ్ఎండీఏకు ఇక్కడ సుమారు 182 ఎకరాల భూములు ఉన్నాయి. ప్రస్తుతం 100 ఎకరాలను రూ.200 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీరు, తదితర సదుపాయాలతో అభివృద్ధి చేశారు.

బుద్వేల్ ఆన్‌లైన్ బిడ్డింగ్ ఇలా...		ప్లాట్‌లు	ఎకరాలు	అంచనా (రూ.కోట్లలో)	లభించిన ఆదాయం (రూ.కోట్లలో)
	మొదటి విడత	7	58.11	1162	2,057.67
	రెండో విడత	7	41.90	838	1,568.06
	మొత్తం	14	100.01	2000	3625.73

జైళ్ల శాఖ రెండో ఐజీగా మురళీబాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జైళ్ల శాఖలో ప్రస్తుతం ఉన్న పోస్టుకు అదనంగా.. మరో ఐజీ పోస్ట్ ఏర్పాటుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

దీంతో ప్రస్తుతం హైదరాబాద్ రేంజ్ డీఐజీగా పని చేస్తున్న మురళీబాబు త్వరలో ఐజీగా పదోన్నతి పొందనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడినందున జైళ్ల శాఖలో డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) సమావేశమై మురళీబాబుకు ఐజీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం ఇక లాంఛనప్రాయమే. ఈ మొత్తం ప్రక్రియ మరో వారంలోగా ముగిసే అవకాశం ఉండడంతో ఆ తర్వాత మురళీబాబు ఐజీగా బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, ఈ ఇద్దరు అధికారులు ఒకే బ్యాచ్ అధికారులు. సీనియారిటీ అంశంలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించే దిశగా జైళ్ల శాఖలో రెండో ఐజీ పోస్ట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. మురళీబాబుకు పదోన్నతి లభించడంతో ఖాళీ అయ్యే డీఐజీ పోస్ట్ వరంగల్ సెంట్రల్ జైలు ఎస్పీ సంపత్‌కు దక్కే అవకాశం ఉంది.

ఒకే నెలలో ఇన్ని పరీక్షలా?

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులను అక్కడ నుంచి పంపించి వేశారు.

ఉదయం నుంచీ ఉద్రిక్తత

గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని గత కొన్ని రోజులుగా అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. అన్ని పరీక్షలు దాదాపుగా ఒకే సమయంలో నిర్వహిస్తుండడంతో అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారంటూ కొందరు ఏకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ కొందరు సభ్యులు ఈ విషయాన్ని లేవనెత్తారు. అయితే కమిషన్ నిర్ణయంలో జోక్యం చేసుకునే పరిస్థితి లేదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే గురువారం టీఎస్‌పీఎస్సీ ముట్టడికి టీజేఎస్, కాంగ్రెస్ పార్టీలు పిలుపునిచ్చాయి. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు తరలిరావడంతో ఉదయం నుంచీ ఉద్రిక్తత నెలకొంది. ఓయూ విద్యార్థి సంఘాల నేతలు కూడా ఈ ఆందోళనకు మద్దతుగా నిలిచారు. కోదండరాంతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అద్దంకి దయాకర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తదితరులు నిరుద్యోగులకు మద్దతుగా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షల వాయిదా కోరుతూ హైకోర్టులో పిటిషన్

గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ సీహెచ్ చంద్రశేఖర్‌తో పాటు 149 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురుకుల ఉపాధ్యాయ పరీక్ష, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్.. తదితర నియామక పరీక్షలు ఉన్న నేపథ్యంలో గ్రూప్-2 వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జూన్ 26న, జూలై 24న రెండుసార్లు టీఎస్‌పీఎస్సీ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందించలేదన్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారించనుంది.



▲ టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

మహమ్మద్ సల్వార్ క్షమాభిక్ష గవర్నర్ ఆమోదం పొందేలా చూడండి

- ఖైదీల విడుదల ఫైలు గవర్నర్‌కు పంపితే సరిపోతుందా?
- అధికారుల తీరును తప్పుబట్టిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఖైదీల క్షమాభిక్ష జాబితా గవర్నర్‌కు పంపి చేతులు దులుపుకుంటే సరిపోతుందా.. దానిపై తదుపరి చర్యలు చేపట్టాలికదా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. హోంశాఖ అధికారుల తీరును తప్పుబట్టింది. నిర్దేశించిన గడువులోగా పరిశీలన జరిగి గవర్నర్ ఆమోదం కూడా పొందాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. హత్యకేసులో యావజ్జీవశిక్ష పడిన మహమ్మద్ సల్వార్‌కు మార్గదర్శకాల ప్రకారం క్షమాభిక్ష ప్రసాదించాలన్న వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలంటూ 2021 జూన్‌లో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారంటూ సల్వార్ కుమారుడు మహమ్మద్ సర్ఫరాజ్ హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. 'ఓ ప్రభుత్వ ఉద్యోగి హత్యకేసులో సర్వార్‌కు యావజ్జీవశిక్ష పడింది. అయితే ఆ ఉద్యోగి విధుల్లో ఉన్నప్పుడు హత్య జరగలేదు. అందువల్ల ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి హత్య కిందకు రాదని ఇదే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినా తిరిగి అదే కారణం మీద దరఖాస్తు తిరస్కరించడం కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే. గవర్నర్‌కు ఫైలు పంపాం.. మాపని అయిపోయిందని చేతులు దులుపుకోవడం సరికాదు. గవర్నర్ నుంచి ప్రతిపాదనలకు ఆమోదం పొందేందుకు ప్రయత్నించాలి. సల్వార్ క్షమాభిక్ష వ్యవహారంపై త్వరగా గవర్నర్ ఆమోదం పొందేలా చూడండి. ఆగస్టు 15న అతనిని విడుదల చేసేందుకు ప్రయత్నించాలి'..అని న్యాయమూర్తి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తూ కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ ముగించారు. ప్రభుత్వం తరఫున జీపీ సామల రవీందర్ వాదనలు వినిపిస్తూ.. అధికారులు నేరుగా గవర్నర్‌ను కలిసే అవకాశం లేదన్నారు. అయినా హోంశాఖ జాబితా ఆమోదానికి ప్రయత్నిస్తుందని చెప్పారు.

జీవితఖైదీల విడుదలకు మోక్షం !

అర్హులైన 200 మందికిపైగా స్వేచ్ఛ.. ప్రతిపాదనలు సిద్ధం చేసిన జైళ్లశాఖ

సాక్షి, హైదరాబాద్: జీవితఖైదు అనుభవిస్తున్న దాదాపు 200 మందికిపైగా అర్హులైన ఖైదీలకు జైలుజీవితం నుంచి విడుదలయ్యే అవకాశాలున్నాయి. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం సత్ప్రవర్తన కలిగిన అర్హులైన జీవిత ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదిస్తుంది. ఇలాంటి వారి జాబితా జైళ్లశాఖ సిద్ధం చేస్తే ప్రభుత్వం దానిని గవర్నర్‌కు పంపిస్తుంది. ఈ జాబితాకు గవర్నర్ ఆమోదముద్ర వేస్తే సదరు ఖైదీలను ఆగస్టు 15 సందర్భంగా విడుదల చేసేందుకు ఉత్తర్వులు జారీ చేస్తారు. గతేడాది ఆగస్టు 15కు సైతం జైళ్లశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ప్రభుత్వం దానిని గవర్నర్ ఆమోదముద్రకు పంపింది. అయితే, అవి సెంట్రల్ గైడ్‌లైన్స్ ప్రకారం లేవని గవర్నర్ డా.తమిళిసై సౌందర్‌రాజన్ పక్కన పెట్టారు. దీంతో గతేడాది ఖైదీల విడుదల నిలిచిపోయింది.

'డబుల్ బెడ్రూమ్'ల కేటాయింపుపై నివేదిక అందజేయండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుపై స్థాయీ నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీని కోసం 3 వారాల గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరగా, అనుమతిస్తూ విచారణను వాయిదా వేసింది. దరఖాస్తులు, నిర్మాణం, కేటాయింపు వంటి వివరాలన్నీ ఉండేలా నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఇంకా కేటాయించలేదని బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఇళ్ల కేటాయింపు వివరాలను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది హరేందర్ పరిషద్ వెల్లడించారు. ప్రభుత్వం 2021 నాటికి 1,00,087గాను 12,656 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి కేటాయింపులు చేసిందన్నారు. కాగితాల్లో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది టి.సృజన్‌కుమార్‌రెడ్డి వాదించారు.

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్

రాయల్ సింగర్

పంజాబ్‌కు చెందిన జస్లీన్ రాయల్ సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్‌గా తనదైన ప్రతిభ చాటుకుంటోంది. పంజాబీ, హిందీ, బెంగాలీ, గుజరాతీలతో పాటు ఇంగ్లిష్ లోనూ పాటలు పాడింది. ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ అందుకున్న తొలి మహిళా మ్యూజిక్ డైరెక్టర్‌గా చరిత్ర సృష్టించింది.

లుథియానాలో హైస్కూల్ చదువు పూర్తయిన తరువాత పై చదువుల కోసం ఢిల్లీ వచ్చింది జస్లీన్. హిందూ కాలేజ్‌లో బి.కామ్ పూర్తి చేసింది.

సంగీతంలో ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు జస్లీన్. తాను సెల్ఫ్-టాట్ ఆర్టిస్ట్. ఒకే టైమ్‌లో వివిధ రకాల మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను ప్లే చేయడం తన ప్రత్యేకత. పిల్లలకు సంగీత పాఠాలు చెప్పడం వల్ల పాకెట్ మనీ కోసం తల్లిదండ్రుల మీద ఆధారపడే అవసరం ఉండేది కాదు.

'ఇండియాస్ గాట్ టాలెంట్' ఫస్ట్ సీజన్‌లో సెమీ ఫైనలిస్ట్‌లలో ఒకరిగా అందరి దృష్టిని ఆకర్షించింది జస్లీన్. తన సంగీత ప్రతిభతో 'వన్ ఉమెన్ బ్యాండ్'గా పేరు తెచ్చుకుంది.

'బాలీవుడ్‌లోకి రావాలనేది నా చిన్నప్పటి కల. అయితే అది అంత సులభంగా నెరవేరలేదు. ఇక వెనక్కి వెళ్లిపోదాం అనుకునే సందర్భాలు అందరిలాగే నాకూ ఎదురయ్యాయి. పరీక్ష సమయంలో గట్టిగా నిలబడితే విజయం మన సొంతం అవుతుంది. నా విషయంలోనూ అదే జరిగింది' అంటున్న జస్లీన్ రాయల్ రకరకాల ప్రాజెక్ట్‌లతో ముంబైలో బిజీబిజీగా ఉంది.


జస్లీన్ రాయల్

● చేంజ్ మేకర్

ఆకాశమంత ఆశ

ఆశావాది కంటే బలవంతుడు ఎవరూ లేరు. ఆశ అనే విత్తనమే చెట్టు అనే విజయానికి మూలం. పర్యావరణ స్పృహకు సంబంధించిన విషయాలను ప్రచారం చేస్తున్న డిజిటల్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఆకాష్ రానిసన్‌కు సోషల్ మీడియాలో వేలాది మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇండోర్‌కు చెందిన 28 సంవత్సరాల ఆకాష్ 'గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్' ద్వారా రకరకాల కార్యక్రమాలు చేపడుతున్నాడు. తాజాగా మరో అడుగు ముందుకు వేసి 'ఐయామ్ ఏ క్లైమెట్ ఆప్టిమిస్ట్' అనే పుస్తకం రాశాడు...



ఆకాష్ రానిసన్

ఎనిమిది సంవత్సరాల క్రితం...

వాతావరణ మార్పులకు సంబంధించిన ఆర్టికల్స్ చదివిన ఆకాష్ అక్కడితో ఆగిపోలేదు. ఈ టాపిక్‌కు సంబంధించి ఎన్నో యూనివర్శిటీలలో ఎన్నో కోర్సులు చేశాడు. ఫలితంగా వాతావరణ మార్పుల గురించి లోతుగా తెలుసుకునే అవకాశం ఏర్పడింది.

తాను తెలుసుకున్న విషయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని గట్టిగా అనుకున్నాడు.

ఆకాష్‌లో ఉన్న బలం... ఎంత జటిలమైన విషయాన్ని అయినా సులభంగా, ఆకట్టుకునేలా చెప్పడం. ఆ ప్రతిభ ఇప్పుడు ఉపయోగపడింది.

క్లైమెట్ చేంజ్‌కు సంబంధించిన విషయాలను ప్రజల దగ్గరికి తీసుకువెళ్లడానికి ఆర్ట్ ఇన్‌స్టాలేషన్‌లు, డాక్యుమెంటరీలు, సోషల్ మీడియా కంటెంట్... ఇలా ఎన్నో దారుల్లో పయనించాడు. తాజాగా 'ఐయామ్ ఏ క్లైమెట్ ఆప్టిమిస్ట్' పుస్తకం రాశాడు.

'గత పదిసంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలు తిరిగాను. రుచికరమైన తిండి కోసమో, అద్భుత నిర్మాణాలను చూడడానికో నేను వెళ్లలేదు. ప్రకృతిని చూసి పరవశించడం కోసం తిరిగాను. ప్రకృతి పట్ల మన ఆరాధన ప్రకృతిని రక్షించుకోవాలనే బలమైన ఆకాంక్షకు కారణం అవుతుంది. పర్యావరణ సంరక్షణ కోసం నా వంతుగా ఏంచేయగలను? అందుకు నాలో ఉన్న నైపుణ్యాలు ఏమిటి? అనే దాని గురించి ఆలోచించాను. నా వంతుగా చేయడానికి ఎన్నో దారులు కనిపించాయి. అది సోషల్ మీడియాలో పర్యావరణ సంరక్షణ ప్రచారం కావచ్చు, పుస్తకం రాయడం కావచ్చు' అంటాడు ఆకాష్.

పుస్తకం రాయడానికి ముందు ఆకాష్‌కు అర్థమైన విషయం ఏమంటే, పర్యావరణ సంరక్షణకు సంబంధించిన సమాచారం చాలా ఎక్కువగా పాశ్చాత్యదేశాలకు సంబంధించే ఉంది. మన దేశంలోని వాతావరణ పరిస్థితులకు అది ఉపయోగపడదు. దీంతో దేశీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకాన్ని రాశాడు. కర్బన ఉద్గారాల నుంచి క్లైమెట్ ఎమర్జెన్సీ వరకు ఎన్నో అంశాలను ఈ పుస్తకంలో చర్చించాడు.

'ఐయామ్ ఏ క్లైమెట్ ఆప్టిమిస్ట్' కోసం పర్యావరణవేత్తలు, ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్‌లతో సంభాషించాడు.

గతంలో ఎన్నో మంచి విషయాలు, పద్ధతులు ఉండేవి, అయితే అవి కాలగర్భంలో కలిసిపోయాయి. వాటిని మళ్లీ వెలికి తీయాల్సిన అవసరం ఉంది అంటాడు ఆకాష్.

'ఇప్పుడు అన్నం మిగిలింది అంటే చెత్తబుట్టలో వేయడమే అన్నట్లుగా ఉంది. ఒకప్పుడు అలా కాదు రకరకాల దినుసులు కలిపి, వేడి చేసి మిగిలిన అన్నాన్ని వృథా కాకుండా చేసేవాళ్లు. చపాతీల విషయంలోనూ ఇంతే. ఈ ఆన్‌లైన్ ఫుడ్‌కాలంలో చిటికెలో ఏదైనా తినగలుగుతున్నాం. అయితే వృథా అవుతున్న ఆహారంపై మాత్రం బొత్తిగా దృష్టి పెట్టడం లేదు. ఒకవైపు తిండి దొరకక ఆకలితో అల్లాడే మనుషులు, మరోవైపు ఆహార వృథా గురించి పట్టించుకోని మనుషులు. ఇదొక వైరుధ్యం' అంటాడు ఆకాష్.

ఒక్క ఆహార రంగం మాత్రమే కాదు టెక్స్‌టైల్ ఇండస్ట్రీ నుంచి ఎన్నో ఇండస్ట్రీలలో జరిగే వృథాను, పర్యావరణ చేటును కళ్లకు కడతాడు ఆకాష్.

'ఇక అంతా అయిపోయినట్లేనా...రానున్నది విలయ విధ్వంస కాలమేనా!' అనే నిరాశవాదంలోకి ఎప్పుడూ వెళ్లడు. ఎందుకంటే మినిమలిస్ట్ లైఫ్ స్టైల్‌ను గడుపుతున్న ఆకాష్ తనను తాను 'ఐయామ్ ఏ క్లైమెట్ ఆప్టిమిస్ట్' అని పరిచయం చేసుకుంటాడు. 'మంచి పనుల ద్వారా మంచి కాలం వస్తుంది' అని నమ్ముతాడు.

● అవును... ఇది నిజమే!



* 2009లో ఫాస్ట్‌ఫుడ్ దిగ్గజం కెంటకీ ఫ్రైడ్ చికెన్ తన మార్కెటింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా రోడ్లపై గుంతలను పూడ్చే పనులు చేపట్టింది. ఈ ప్రాజెక్ట్‌కు 'కేఎఫ్‌సీ రిఫ్రెషెస్ ది నేషన్స్ రోడ్స్' అని పేరు పెట్టింది.
* నార్వేలో పోలీస్ ఆఫీసర్ కావాలంటే పోలీస్ యూనివర్శిటీ కాలేజీలో డిగ్రీ చేయాలి. మొదటి రెండు సంవత్సరాలు క్రిమినల్ లా, ఎథిక్స్, సోషల్ సైన్సెస్ చదువుకోవాల్సి ఉంటుంది. మూడో సంవత్సరం ప్రాక్టికల్ ఫీల్డ్ ట్రెయినింగ్ ఉంటుంది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



అకిలీజ్ హీల్

ఫెయిల్యూర్‌కు కారణమయ్యే బలహీనతల విషయంలో వాడే మాట ఇది.

ఉదా: ఐయామ్ ట్రైయింగ్ టు లూజ్ వెయిట్, బట్ ఐస్‌క్రీమ్ ఈజ్ మై అకిలీజ్ హీల్.

గ్రీకు పురాణాల్లో నుంచి పుట్టిన ఇడియం ఇది. శత్రువుల దాడికి గురి కాకుండా నింఫ్ అనే తల్లి తన కుమారుడు అకిలీజ్‌ను పవిత్రమైన నదిలో ముంచుతుంది. ఈ జలాలకు అమరత్వాన్ని ప్రసాదించే శక్తి ఉంటుంది. అయితే నదిలో ముంచినప్పుడు అకిలీజ్ కాలి మడమ మాత్రం జలాలను తాకదు. ఫలితంగా అది బలహీన స్థానం అవుతుంది. జీవిత చరమాంకంలో మడమకు బాణం తగలడం వల్ల అకిలీజ్ చనిపోతాడు.

ఆల్ హెల్ బ్రోక్ లూజ్

ఉన్నట్టుండి పరిస్థితి ఉద్రిక్తంగా, హింసాత్మకంగా, అస్తవ్యస్తంగా మారే సందర్భంలో ఉపయోగించే మాట ఇది.

ఉదా: ఐ వాజ్ వాకింగ్ త్రూ ది స్టేషన్ ఆన్ మై వే టు వర్క్ వెన్ ఐ హెర్డ్ దిస్ హ్యూజ్ ఎక్స్‌ప్లోజన్ అండ్ దెన్ ఆల్ హెల్ బ్రోక్ లూజ్.

టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ జడ్ ఫ్లిప్5



డిస్‌ప్లే: 6.7 అంగుళాలు
రిజల్యూషన్: 1080×2640 పిక్సెల్స్
మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్; 512 జీబి 8జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 3700 ఎంఏహెచ్
కనెక్టివిటీ: 5జీ

యాపిల్ డిస్కవరీ స్టేషన్

సంగీత ప్రియుల కోసం యాపిల్ 'డిస్కవరీ స్టేషన్'ను లాంచ్ చేసింది. యూజర్ మ్యూజిక్ ప్రిఫరెన్స్ ఆధారంగా ప్లేలిస్ట్ ఉంటుంది. యాపిల్ మ్యూజిక్ డిస్కవరీ స్టేషన్ మొబైల్ డివైజ్‌లు, డెస్క్ కంప్యూటర్‌లు, వెబ్ బ్రౌజర్‌లలో అందుబాటులో ఉంటుంది. ఇది లేటెస్ట్ మ్యూజిక్‌ను, గతంలో వినని కొత్త మ్యూజిక్‌ను యూజర్‌లకు పరిచయం చేస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే యాపిల్ డిస్కవరీ స్టేషన్ స్పోటిఫై 'డిస్కవరీ వీక్లీ'ని పోలి ఉంటుంది.

Music

జీమెయిల్‌లో ఇమెయిల్ ట్రాన్స్‌లేషన్

జీమెయిల్ యాప్‌లో ఇమెయిల్ ట్రాన్స్‌లేట్ చేసే కొత్త ఫీచర్‌ని తీసుకురానున్నట్లు గూగుల్ ప్రకటించింది. ఈ ఫీచర్ వెబ్‌లో మాత్రమే అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఆండ్రాయిడ్ మరియు ఐవోఎస్ డివైజ్‌లకు కూడా అందుబాటులోకి రానుంది. ఉదాహరణకు...ఇమెయిల్ స్పానిష్‌లో ఉంది, యూజర్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ అనుకుందాం. 'ట్రాన్స్‌లెటెడ్ టు ఇంగ్లిష్'ను ట్యాప్ చేయడం ద్వారా ట్రాన్స్‌లేటెడ్ టెక్స్ట్‌ను చూడవచ్చు. ఎప్పుడూ ఉపయోగించని భాష, ఎప్పుడూ ఉపయోగించే భాష విషయంలో సెట్టింగ్స్‌లోకి వెళ్లి ట్రాన్స్‌లేషన్ ప్రిఫరెన్స్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు ● ఒక మెసేజ్‌ను ట్రాన్స్‌లేట్ చేయడానికి ఈమెయిల్ టాప్‌లో ఉన్న 'ట్రాన్స్‌లేషన్' ఆప్షన్‌ను క్లిక్ చేస్తే సరిపోతుంది ● ఏదైనా లాంగ్వేజ్‌కు సంబంధించి 'ట్రాన్స్‌లెట్ బ్యానర్' టర్న్ ఆఫ్ చేయవచ్చు.



మానిటర్ డెస్క్ ఆర్మ్

బ్రాండ్: గాడ్జెట్ వ్యాగస్;
మోడల్: జీ డబ్ల్యూ-హెచ్ 100
మూమెంట్: రోటెట్;
మోడల్ నేమ్: హెచ్ 100 లాంగ్ డెస్క్ ఆర్మ్
సపోర్ట్: 75×75 ఎంఎం అండ్ 100×1000 ఎంఎం
కలర్: బ్లాక్
కంపాటబుల్ డివైజ్‌లు: మానిటర్స్, ల్యాప్‌టాప్స్



సినిమా


● బీవీఎస్ఎన్ ప్రసాద్, సాక్షీ వైద్య, వరుణ్ తేజ్, ప్రవీణ్ సత్తారు, బాపినీడు

అందుకే గాండీవధారి అర్జున చేశాను

- వరుణ్ తేజ్

''ప్రవీణ్ సత్తారు 'గాండీవధారి అర్జున' కథ చెప్పినప్పుడు బాగా నచ్చేసింది. ఓ సమస్య గురించి సినిమా తీస్తున్నప్పుడు ఓ నటుడిగా అలాంటి సినిమా చేయటం నా బాధ్యత అనిపించింది.. అందుకే ఈ మూవీ చేశాను'' అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్, సాక్షీ వైద్య జంటగా నటించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. బాపినీడు .బి సమర్పణలో ఎస్‌వీసీసీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్‌ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. గురువారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ వేడుకలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''గాండీవధారి అర్జున' ట్రైలర్ చూసి యాక్షన్ మాత్రమే ఉంటుందనుకోవద్దు.. మంచి ఎమోషన్స్ ఉంటాయి. దేశానికి వచ్చే సమస్య ఏంటి? అనేది చూపించాం'' అన్నారు.

''వరుణ్ తేజ్‌తో మేం చేసిన మొదటి సినిమా 'తొలి ప్రేమ', సాయితేజ్‌తో చేసిన 'విరూపాక్ష' హిట్ అయ్యాయి. ఇప్పుడు 'గాండీవధారి అర్జున' కూడా సూపర్ హిట్ అవుతుంది'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ''భూమిపై ఉన్న వనరులను ఇష్టానుసారం వాడేస్తున్నాం. భవిష్యత్ తరాల గురించి ఆలోచించటం లేదు. పర్యావరణ పరిరక్షణ గురించి ఈ సినిమా తీశాం'' అన్నారు ప్రవీణ్ సత్తారు.

కొత్త సినిమాకి క్లాప్

'డీజే టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' ఫేమ్ భాస్కర్ దర్శకత్వంలో కొత్త సినిమా షురూ అయింది. బాపినీడు.బి సమర్పణలో ఎస్‌వీసీసీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న 37వ సినిమా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రొడ్యూసర్ 'దిల్' రాజు కెమెరా స్విచ్ఛాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ– ''భాస్కర్ దర్శకత్వంలో సిద్ధుతో మా బ్యానర్‌లో సినిమా చేయటం ఎంతో సంతోషంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా మూవీ ఉంటుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు వై.రవిశంకర్, వంశీ, దామోదర్ ప్రసాద్, రాధా మోహన్, మిర్యాల రవీందర్ రెడ్డి, రచయిత కోన వెంకట్, డైరెక్టర్ నందినీ రెడ్డి, కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సాయి ప్రకాష్.


● సిద్ధు జొన్నలగడ్డ, అల్లు అరవింద్

అసాధారణ ప్రయాణం

దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కింగ్ ఆఫ్ కోత'. అభిలాష్ జోషి దర్శకత్వంలో జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్ నిర్మించాయి. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్. ఈ నెల 24న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు, హిందీ, మలయాళ, తమిళ ట్రైలర్స్‌ని హీరోలు నాగార్జున, షారుక్ ఖాన్, మోహన్ లాల్, సూర్య విడుదల చేశారు. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ– ''కింగ్ ఆఫ్ కోత' ఒక అసాధారణ ప్రయాణం. గొప్ప పాత్రలు, క్లిష్టమైన కథతో రూపొందించాం'' అన్నారు. ''ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు జీ స్టూడియోస్ సౌత్ హెడ్ అక్షయ్ కేజ్రీవాల్.



● దుల్కర్ సల్మాన్, ఐశ్వర్య లక్ష్మి

హిందీలోనూ హిట్ అవుమా?

ఓ సినిమా హిట్ అయితే... ఆ సినిమాలోని కథ ఏ భాషకైనా, ప్రాంతానికైనా నప్పే విధంగా ఉంటే.. అందరి దృష్టీ ఆ సినిమా మీద పడుతుంది. అలా తమిళంలో హిట్టయిన చిత్రాల మీద హిందీ పరిశ్రమ దృష్టి పడింది. ఆ చిత్రాల రైట్స్ చేజిక్కించుకుని, రీమేక్ చేస్తున్నారు. మరి.. తమిళంలో హిట్ అన (అయిన) సినిమా హిందీలోనూ హిట్ అవుమా? (అవుతుందా?) అంటే.. వేచి చూడాల్సిందే. ఇక హిందీలో రీమేక్ అవుతున్న తమిళ చిత్రాల గురించి తెలుసుకుందాం.

విమానయానం

ఎయిర్ డెక్కన్ వ్యవస్థాపకుడు కెప్టెన్ జీఆర్ గోపీనాథ్ జీవితంతో సుధ కొంగర దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'సూరరై పోట్రు' ('ఆకాశం నీ హద్దురా'). సూర్య హీరోగా నటించిన ఈ చిత్రం 2020లో డైరెక్ట్‌గా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో రిలీజై, మంచి ప్రశంసలు దక్కించుకుంది. ఈ సినిమా హిందీ రీమేక్‌లో అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్నారు. సుధా కొంగరే రీమేక్‌ను డైరెక్ట్ చేస్తున్నారు. ఈ రీమేక్‌కు సూర్య ఓ నిర్మాతగా ఉండటం విశేషం. సామాన్యులు సైతం విమానయానం చేసేందుకు గోపీనాథ్ ఏ విధంగా కృషి చేశారు? ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు? అనేది 'సూరరై పొట్రు' కథాంశం. అలాగే విజయ్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన 'కత్తి' (2014) రీమేక్‌లో అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తారని సమాచారం. హిందీ రైట్స్‌ను దర్శక-నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ దక్కించుకున్నారు.


● అక్షయ్ కుమార్


● జాన్ అబ్రహాం


● వరుణ్ ధావన్

హిందీ అపరిచితుడు

విక్రమ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'అన్నియన్' ('అపరిచితుడు') ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేయనున్నట్లు శంకర్ ప్రకటించారు. ఇందులో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించాల్సింది. కొన్ని లీగల్ కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్ వాయిదా పడింది. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, అన్యాయాలపై మానసిక వేదనకు గురైన ఓ మధ్యతరగతి యువకుడు ఏం చేశాడు? అనేది ఈ చిత్రం కథాంశం.


గ్యాంగ్‌స్టర్ సెంటిమెంట్

చెల్లెలి సంరక్షణ కోసం ఓ గ్యాంగ్‌స్టర్ తన జీవితాన్ని ఏ విధంగా మార్చుకున్నాడు? ప్రత్యర్థి గ్యాంగ్‌స్టర్లకు ఎలా బుద్ధి చెప్పాడు? అనే అంశాలతో రూపొందిన తమిళ చిత్రం 'వేదాళం'. అజిత్ హీరోగా శివ దర్శకత్వంలో 2015లో విడుదలైన ఈ సినిమా హిట్ సాధించింది. ఈ సినిమా 'వేద'గా హిందీలో రీమేక్ అవుతోంది. జాన్ అబ్రహాం టైటిల్ రోల్ చేస్తున్నారు. నిఖిల్ అద్వానీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్స్ తమన్నా, శర్వారి లీడ్ రోల్స్ చేస్తున్నారు. జాన్ అబ్రహాం సిస్టర్‌గా శర్వారి, హీరోయిన్‌గా తమన్నా నటిస్తున్నట్లు తెలుస్తోంది.

16ఏళ్లు కోమాలో ఉంటే..

దాదాపు 16 సంవత్సరాలు కోమాలో ఉన్న ఓ వ్యక్తి ఆరోగ్యం హఠాత్తుగా కుదుటపడుతుంది. కోమా నుంచి బయటకు వచ్చిన అతను సమకాలీన నాగరికత, జీవన విధానం, టెక్నాలజీలను చూసి ఆశ్చర్యపోతాడు. ఈ పరిస్థితులను అతడు తన జీవితానికి ఎలా అన్వయించుకున్నాడు? తన పూర్వీకులకు చెందిన ఓ విగ్రహం అతని జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేసింది? అన్నది 'కోమాళి' కథనం. 'జయం' రవి హీరోగా ప్రదీప్ రంగనాథన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై విజయం సాధించింది. ఈ సినిమా హిందీ రీమేక్ హక్కులను బోనీ కపూర్ సొంతం చేసుకున్నారు. ఈ సినిమాలో అర్జున్ కపూర్ హీరోగా నటిస్తారని బాలీవుడ్‌లో ఎప్పట్నుంచో ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే.


● అర్జున్ కపూర్


● రణ్‌వీర్ సింగ్

ఇటు పోలీస్.. అటు ఎన్ఆర్ఐ

బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్ ఇటీవల రీమేక్స్ చిత్రాలపై ఆసక్తి చూపిస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం తమిళ దర్శకుడు అట్లీ నిర్మిస్తున్న ఓ సినిమాలో వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొదలైంది. తమిళ దర్శకుడు కాలిస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 2016లో అట్లీ దర్శకత్వంలో వచ్చిన తమిళ హిట్ ఫిల్మ్ విజయ్ 'తేరి'కి ఇది హిందీ రీమేక్ అని బాలీవుడ్ సమాచారం. ఓ రాజకీయ నాయకుడి కుమారుడు ఓ యువతిపై అత్యాచారం చేస్తే, అతన్ని చంపేస్తాడు ఓ పోలీసాఫీసర్. అప్పుడు ఆ రాజకీయ నాయకుడు ఆ పోలీసాఫీసర్‌పై ఏ విధంగా పగ తీర్చుకున్నాడు? ఆ రాజకీయ నాయకుణ్ణి ఆ పోలీసాఫీసర్ ఎలా ఢీ కొన్నాడు? అన్నదే టూకీగా 'తేరి' కథాంశం. ఈ చిత్రంలో పోలీసాఫీసర్‌గా వరుణ్ ధావన్ నటిస్తున్నారు. అలాగే మరో తమిళ హిట్ 'మనాడు' హిందీ రీమేక్‌లో కూడా వరుణ్ ధావన్ నటించనున్నారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. శింబు, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో వెంకట్ ప్రభు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'మానాడు'. ఈ సినిమా హిందీ రీమేక్ రైట్స్ రానా వద్ద ఉన్నాయి. ఓ ఎన్ఆర్ఐకి, పోలీసాఫీసర్‌కి మధ్య కొన్ని రాజకీయ అంశాల నేపథ్యంలో ఎలాంటి శత్రుత్వం ఏర్పడింది? అనే కోణంలో ఈ సినిమా సాగుతుంది. ఎన్ఆర్ఐగా శింబు నటించగా, పోలీసాఫీసర్‌గా ఎస్‌జే సూర్య నటించారు.

ట్రెండీ లవ్‌స్టోరీ

రూ. 5 కోట్ల లోపు బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద రూ. 50 కోట్లకుపైగా కలెక్షన్స్‌ను సాధించిన తమిళ ట్రెండీ లవ్‌స్టోరీ 'లవ్ టుడే'. ప్రదీప్ రంగనాథన్ నటించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఇవానా హీరోయిన్. గత ఏడాది నవంబరులో విడుదలైన ఈ సినిమా హిందీ రీమేక్‌ను ఫ్యాంథమ్ స్టూడియోస్, ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనున్నాయి. ఇందులో హీరో హీరోయిన్లుగా ఆమిర్ ఖాన్ పెద్ద కొడుకు జైనైద్ ఖాన్, శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్‌లు ఫైనల్ అయ్యారని, షూటింగ్ కూడా మొదలైందని బాలీవుడ్ సమాచారం. ప్రేమలో ఉన్న ఓ అబ్బాయి, ఓ అమ్మాయి పరస్పర అంగీకారంతో వారి మొబైల్ ఫోన్స్‌ను మార్చుకున్నప్పుడు ఏం జరిగింది? అనే అంశంతో 'లవ్ టుడే' చిత్రం రూపొందింది.

ఈ చిత్రాలే కాదు.. మరికొన్ని తమిళ సినిమాలు కూడా హిందీలో రీమేక్ కానున్నాయని తెలుస్తోంది.

భీమాకి జోడీగా..


● ప్రియ భవానీ శంకర్, మాళవికా శర్మ

గోపీచంద్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'భీమా'. కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెరకెక్కిస్తున్న ఈ సినిమాను కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ భీమ పాత్రలో నటిస్తున్నారు గోపీచంద్. భీమాకు జోడీగా ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మలను ఎంపిక చేసినట్లు గురువారం చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ''కుటుంబ భావోద్వేగాలు మిళితమైన యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'భీమా' రూపొందుతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	308	65,688
నిఫ్టీ ▽	89	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి సెషన్ రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,736	▲	12
డోజోన్స్	35,175	▲	52
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,619	▲	31
డాక్స్	15,997	▲	144
షాంఘై	3,255	▲	10
నికాయ్	32,474	▽	269


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	58,909	▽	228
బంగారం (99.5 స్వచ్ఛత)	58,673	▽	228
వెండి (కేజీ)	70,176	▽	49

మూడోసారీ మార్పులేదు

ముంబై: ధరల స్పీడ్‌ను కట్టడి చేసే విషయంలో రాజీ పడేదే లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. ఆహార ధరలు పెరుగుతుంటే దీని కట్టడికి అవసరమైతే రేటు పెంపే ఉంటుందని ఉద్ఘాటించింది. రిటైల్ ద్రవ్యోల్బణం అనిశ్చితి నేపథ్యంలో బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను (ప్రస్తుతం 6.5 శాతం) యథాతథంగా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. 2024 మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణానికి సంబంధించి క్రితం 5.1 శాతం అంచనాలను 5.4 శాతానికి పెంచుతూ ఆర్‌బీఐ గవర్నర్ నేతృత్వంలో సమావేశమైన ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన (ఎంపీసీ) కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధి రేటు అంచనాలను ప్రస్తుత 6.5 శాతంగానే కొనసాగించాలని మూడు రోజులపాటు సమావేశమైన కమిటీ నిర్ణయించింది. మంగళ, బుధ, గురు వారాల్లో జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమావేశ వివరాలను గవర్నర్ శక్తికాంతదాస్ వివరించారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, క్రూడ్ ధరల తీవ్రత, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ గడచిన మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోనికి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో తాజా సమీక్ష సహా గడచిన మూడు సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది. అయితే ద్రవ్యోల్బణం భయాలు పూర్తిగా తొలగిపోలేదని, అవసరమైతే కఠిన ద్రవ్య విధానానికే (రేటు పెంపు) మొగ్గుచూపుతామని కూడా ఆయా సందర్భాల్లో స్పష్టం చేస్తూ వచ్చింది. ఇదే విషయాన్ని తాజా సమీక్షా సమావేశం అనంతరం కూడా ఆర్‌బీఐ గవర్నర్ పునరుద్ఘాటించారు.

- కీలక రెపో రేటు 6.5 శాతంగా యథాతథం...
- కొనసాగుతున్న ద్రవ్యోల్బణం భయాల ప్రభావం
- ఆహార ధరలు పెరిగితే రేటు పెంపు తప్పదని సంకేతం
- 5.1 శాతం నుంచి 5.4 శాతానికి ద్రవ్యోల్బణం అంచనా పెంపు
- 2023–24 వృద్ధి రేటు అంచనా 6.5 శాతంగా పునరుద్ఘాటన



ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

పాలసీలో కొన్ని ముఖ్యాంశాలు..

- **వృద్ధి ధోరణి:** 2023–24లో దేశ జీడీపీ 6.5 శాతం ఉంటుందని అంచనావేస్తుండగా, క్యూ1లో 8 శాతం, క్యూ2లో 6.5%, క్యూ3లో 6%, క్యూ4లో 5.7 శాతంగా అంచనా. 2024–25 మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు 6.6 శాతంగా అంచనా.
- **ద్రవ్యోల్బణం దాదాపు 6% లోపే:** 2023–24లో వినియోగ ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉంటుందని అంచనావేస్తుండగా, క్యూ2లో 6.2 శాతం, క్యూ3లో 5.7 శాతం, క్యూ4లో 5.2 శాతంగా అంచనా. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో అంచనా 5.2%.
- **కొత్త ఉత్పత్తులతో ఊరట:** భారీగా ధర పెరుగుతున్న టమాటా సహా కూరగాయల ధరలు పెరుగుతుండడంతో సమీప భవిష్యత్తులో ధరల తీవ్రత ఒత్తిడి ఉంటుంది. అయితే కొత్త పంట వస్తుండడంతో కూరగాయల ధరలు తగ్గవచ్చన్న అంచనాలూ ఉన్నాయి.
- **డిజిటల్ లావాదేవీల చెల్లింపుల పెంపు లక్ష్యం:** యూపీఐ చెల్లింపుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని వినియోగించే అంశాన్ని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. యూపీఐ-లైట్‌లో ఆఫ్‌లైన్ చెల్లింపులలో నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్‌ఎఫ్‌సీ) టెక్నాలజీ వినియోగాన్ని ప్రస్తావించింది. అలాగే యూపీఐ లైట్‌లో చిన్న విలువ కలిగిన డిజిటల్ చెల్లింపుల కోసం లావాదేవీల పరిమితిని రూ. 200 నుండి రూ. 500కి పెంచాలని ప్రతిపాదించింది. అయితే ఇందుకు సంబంధించి రూ.2,000 రోజువారీ పరిమితిని యథాతథంగా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఆయా ఇన్‌స్ట్రుమెంట్ల వినియోగం, ధ్రువీకరణల విషయంలో ఎటువంటి అవకతవకలూ చోటుచేసుకోకుండా త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనుంది.
- **సీఆర్‌ఆర్‌లో లేని మార్పు:** బ్యాంక్ మొత్తం డిపాజిట్‌లో లిక్విడ్ క్యాష్ రూపంలో ఆ బ్యాంక్ నిర్వహించాల్సిన నగదుకు సంబంధించిన నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ను యథాతథంగా 4.5% వద్ద కొనసాగింపు. దీనివల్ల ప్రస్తుత బ్యాంకింగ్ ద్రవ్య లభ్యత విషయంలో ఎలాంటి మార్పులూ ఉండవు.
- **అధిక ద్రవ్య లభ్యతపై చర్యలు:** రూ.2,000 నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి రావడం, ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వానికి అందిన డివిడెండ్ వంటి చర్యల వల్ల వ్యవస్థలో ఏర్పడిన అధిక ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) తగినంత వరకూ వెనక్కు తీసుకోవడానికి చర్యలు కొనసాగుతాయి. పెరుగుతున్న ఎన్‌డీటీఎల్ (నెట్ డిమాండ్, టైమ్ లయబిలిటీ)పై గత మూడు నెలలుగా ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐ–సీఆర్‌ఆర్) 10 శాతానికి పెంపు. దీని వల్ల వ్యవస్థ నుంచి దాదాపు రూ.లక్ష కోట్లు వెనక్కు మళ్లుతున్నట్లు అంచనా. ద్రవ్యోల్బణం కట్టడి చర్యలో ఇదొక కీలక చర్య.
- తదుపరి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశం అక్టోబర్ 4–6 మధ్య జరుగుతుంది.

జాగరూకతతో నిర్ణయాలు



ద్రవ్యోల్బణాన్ని కట్టడిలోనే ఉంచుతూ వృద్ధి పటిష్టతకు దోహదపడే పాలసీ ఇది. ఆర్థిక వ్యవస్థ పటిష్టతే లక్ష్యంగా ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలు ఉన్నాయి. లిక్విడిటీకి (ద్రవ్య లభ్యత) సంబంధించి తీసుకున్న నిర్ణయాలు బ్యాంకింగ్ రుణ సామర్థ్యంపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపబోవు. – దినేశ్ ఖారా, ఎస్‌బీఐ చైర్మన్

గృహ డిమాండ్‌కు ధోకాలేదు



ఆర్‌బీఐ యథాతథ రేటు విధానం వల్ల గృహ డిమాండ్‌కు తక్షణం వచ్చిన సమస్య ఏదీ లేదు. అయితే తదుపరి సమీక్షా సమావేశంలో రేటు కోత ఉంటుందని పరిశ్రమ విశ్వసిస్తోంది. ప్రస్తుతం ద్రవ్యోల్బణం కట్టడే లక్ష్యంగా పాలసీ విధానం కొనసాగినట్లు స్పష్టమవుతోంది. – బొమన్ ఇరానీ, క్రెడాయ్ ప్రెసిడెంట్

- రుణ గ్రహీతలకు ఊరట

ఫ్లోటింగ్ నుంచి ఫిక్సిడ్‌కు..!

పెరుగుతున్న వడ్డీరేట్ల వ్యవస్థ నుంచి ఊరటనిచ్చేందుకు ఆర్‌బీఐ పాలసీ సమీక్ష కీలక నిర్ణయం తీసుకుంది. గృహ, ఆటో ఇతర రుణాలు సంబంధించి రుణగ్రహీతలు ఫ్లోటింగ్ రేటు నుంచి ఫిక్సిడ్ రేట్ విధానానికి మారే వెసులుబాటును కల్పించనుంది. ఫ్లోటింగ్ వడ్డీ రేటు నుండి స్థిర వడ్డీ రేటుకు మారడానికి అనుమతించే ఫ్రేమ్‌వర్క్‌ను త్వరలో ప్రకటించనుంది. ఈ విధానం కింద బ్యాంకులు... రుణ కాల వ్యవధి, ఈఎంఐల గురించి రుణ గ్రహీతకు తగిన వివరాలు అన్నింటినీ అందజేయాల్సి ఉంటుంది. ఈఎంఐ ఆధారిత ఫ్లోటింగ్ వడ్డీ రుణాల వడ్డీ రేటు నిర్దేశంలో మరింత పారదర్శకత తీసుకునిరావడం, రుణగ్రహీతలు ఫిక్సిడ్ రేట్ రుణాలకు మారడం లేదా రుణాలను ముందుగానే చెల్లించడం వంటి పలు అంశాలు త్వరలో విడుదల కానున్న ఆర్‌బీఐ ఫ్రేమ్‌వర్క్‌లో ఉండనున్నాయి. కాగా, రుణ జారీల విషయంలో బ్యాంకులు ''మభ్యపెట్టే విధానాలను'' విడనాడాలని, రుణ గ్రహీత వయస్సు, తిరిగి చెల్లింపుల సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన కాల వ్యవధిలో రుణం తీర్చగలిగేలా రుణాలు మంజూరు చేయాలని పాలసీ సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. ఆయా విషయంలో మభ్యపెట్టే విధానాలు విడనాడి, రుణగ్రహీతకు పూర్తి పారదర్శక విధానాలను పాటించాలని సూచించారు.



ఎల్‌ఐసీకి లాభాల కళ



- జూన్ త్రైమాసికంలో రూ.9,544 కోట్లు
- కొత్త పాలసీల ప్రీమియం డౌన్

న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజ సంస్థ ఎల్‌ఐసీ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి మెరుగైన ఫలితాలను ప్రకటించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 14 రెట్లు పెరిగి రూ.9,544 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.683 కోట్లుగా ఉంది. ఆదాయం రూ.1,68,881 కోట్ల నుంచి రూ.1,88,749 కోట్లకు వృద్ధి చెందింది. కొత్త పాలసీలపై వచ్చే తొలి ఏడాది ప్రీమియం ఆదాయం తగ్గింది. ఈ రూపంలో జూన్ త్రైమాసికంలో వచ్చిన ఆదాయం రూ.6,811 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో కొత్త పాలసీల ప్రీమియం ఆదాయం రూ.7,429 కోట్లతో పోలిస్తే సుమారు 9 శాతం క్షీణించింది. పెట్టుబడుల రూపంలో వచ్చిన నికర ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.69,571 కోట్ల నుంచి రూ.90,309 కోట్లకు పెరిగింది. సాల్వెన్సీ రేషియో 1.88 శాతం నుంచి 1.89 శాతానికి పెరిగింది. ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. వసూలు కాని నిరర్థక ఆస్తులు 5.84 శాతం నుంచి 2.48 శాతానికి తగ్గాయి.

బీఎస్‌ఈలో ఎల్‌ఐసీ షేరు ఫ్లాట్‌గా రూ.642 వద్ద క్లోజయింది. ఫలితాలు మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడ్డాయి.

జీ–సోనీ విలీనానికి ఓకే

- తాజాగా ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్
- 10 బిలియన్ డాలర్ల మీడియా దిగ్గజం ఆవిర్భావానికి వీలు



ముంబై: జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్(జీల్), కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్(సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా) విలీనానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు హెచ్‌వీ సుబ్బారావు, మధు సిన్హా అధ్యక్షతన ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ అనుమతించింది. విలీనానికి సంబంధించిన అన్ని అభ్యంతరాలనూ తోసిపుచ్చింది. పలు రుణదాతల అభ్యంతరాలపై విచారణ చేపట్టిన తదుపరి బెంచ్ జూలై 11న తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. విలీనానికి వ్యతిరేకంగా యాక్సిస్ ఫైనాన్స్, జేసీ ఫ్లవర్ ఏఆర్‌సీ, ఐడీబీఐ బ్యాంక్, ఐమ్యాక్స్ కార్ప్, ఐడీబీఐ ట్రస్టీషిప్ చేసిన వాదనలపై విచారణ చేపట్టింది. తదుపరి వీటిని కొట్టివేసింది. వెరసి 10 బిలియన్ డాలర్ల(దాదాపు రూ. 83,000 కోట్లు) విలువైన మీడియా దిగ్గజం ఆవిర్భవించనుంది. దేశీయంగా అతిపెద్ద మీడియా దిగ్గజంగా నిలవనుంది.

తాజా పరిణామంతో జీల్ షేరు 18 శాతం జంప్ చేసి రూ. 286 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 20 శాతం దూసుకెళ్లి రూ. 291కు చేరింది.

సూచీలకు 'పాలసీ' నష్టాలు



బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య పరపతి కమిటీ తీసుకున్న అదనపు నగదు నిల్వల నిష్పత్తి, ద్రవ్యోల్బణ అంచనాల పెంపు నిర్ణయాలు మార్కెట్ వర్గాలను నిరాశ పరిచాయి. అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి (గురువారం రాత్రి), దేశీయ సీపీఐ ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు విడుదల(నేడు)కు ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఫలితంగా స్టాక్ సూచీలు గురువారం దాదాపు అర శాతం నష్టపోయాయి. మెటల్, మీడియా మినహా అన్ని రంగాలూ అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఫైనాన్స్, కన్జూమర్ షేర్లలో పెద్ద ఎత్తున విక్రయాలు జరిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 487 పాయింట్లు నష్టపోయి 65,509 వద్ద, నిఫ్టీ 138 పాయింట్లు పతనమై 19,495 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరికి సెన్సెక్స్ 308 పాయింట్లు నష్టపోయి 65,688 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 89 పాయింట్లు క్షీణించి 19,543 వద్ద నిలిచింది. ఆర్‌బీఐ వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం దేశీయ కరెన్సీకి కలిసొచ్చింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు బలపడి 82.68 వద్ద స్థిరపడింది. అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.



హైదరాబాద్ ఎఫ్‌సీ పరాజయం

డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. చెన్నైయిన్ ఎఫ్ సీ జట్టుతో గువాహటిలో గురువారం జరిగిన గ్రూప్ 'ఇ' రెండో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 1–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. హైదరాబాద్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను చింగ్లెన్ సనా సింగ్ నాలుగో నిమిషంలో చేశాడు. చెన్నైయిన్ ఎఫ్‌సీ తరఫున జోర్డాన్ ముర్రే (46వ ని.లో), కానర్ షీల్డ్స్ (15వ ని.లో), అలెక్స్ సాజీ (6వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఢిల్లీ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌ను 1–1తో 'డ్రా' చేసుకున్న హైదరాబాద్ ప్రస్తుతం ఒక పాయింట్‌తో గ్రూప్‌లో చివరి స్థానంలో ఉంది. ఈనెల 22న త్రిభువన్ ఆర్మీ (నేపాల్) జట్టుతో హైదరాబాద్ ఎఫ్‌సీ తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడుతుంది. చివరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టు విజయం సాధించినా క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించే అవకాశాలు కనిపించడంలేదు.

ప్రిక్వార్టర్స్‌లో అర్జున్

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అర్జున్‌తోపాటు భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. నాలుగో రౌండ్‌లో అర్జున్ 1.5–0.5తో సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై, విదిత్ 1.5–0.5తో ఎటెని బాక్రోట్ (ఫ్రాన్స్)పై గెలుపొందారు. సిందరోవ్‌తో బుధవారం జరిగిన తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకున్న అర్జున్ గురువారం జరిగిన రెండో గేమ్‌లో 60 ఎత్తుల్లో నెగ్గాడు.



బాక్రోట్‌తో బుధవారం జరిగిన తొలి గేమ్‌లో గెలిచిన విదిత్ గురువారం జరిగిన రెండో గేమ్‌ను 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. నాలుగో రౌండ్‌లో రెండు గేమ్‌లు ముగిశాక గుకేశ్ (భారత్)–ఎసిపెంకో (రష్యా); ప్రజ్ఞానంద (భారత్)–నకమురా (అమెరికా); నిహాల్ (భారత్)–నెపోమ్‌నిశి (రష్యా) 1–1తో సమంగా ఉండటంతో వీరి మధ్య నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహిస్తారు.

మరోవైపు మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక కూడా నేడు టైబ్రేక్ గేమ్‌లు ఆడనున్నారు. బెలా ఖొటెనాష్‌విలి (జార్జియా)తో తొలి గేమ్‌లో ఓడిన హంపి గురువారం జరిగిన రెండో గేమ్‌లో 42 ఎత్తుల్లో గెలిచి స్కోరును 1–1తో సమం చేసింది. హారిక, ఎలైన్ రోబర్స్ (నెదర్లాండ్స్) మధ్య రెండో గేమ్ కూడా 'డ్రా'గా ముగియడంతో ఇద్దరూ 1–1తో సమంగా ఉన్నారు.

'నాలుగో స్థానంపై అనిశ్చితి ఉంది'

సమస్య వాస్తవమన్న భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ

హైదరాబాద్ యువ క్రికెటర్ తిలక్ వర్మపై కెప్టెన్ ప్రశంసలు



ముంబై: నాలుగేళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్‌కు ముందు భారత జట్టు నాలుగో స్థానంలో ఆడే బ్యాటర్ విషయంలో పెద్ద సమస్యను ఎదుర్కొంది. ఇప్పుడు కూడా కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ గాయాల నుంచి కోలుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్లు కనిపిస్తోంది. మిడిలార్డర్‌లో కీలకమైన ఈ స్థానం విషయంలో నెలకొన్న అనిశ్చితి వాస్తవమేనని స్వయంగా కెప్టెన్ రోహిత్ శర్మ అంగీకరించాడు. అయితే ప్రపంచకప్‌కు ముందు ఆసియా కప్ సమయానికి అంతా సర్దుకుంటుందని అతను విశ్వాసం వ్యక్తం చేశాడు. 'భారత జట్టులో నాలుగో స్థానం విషయంలో చాలా కాలంగా సమస్య ఉంది. యువరాజ్ రిటైరయ్యాక ఎవరూ అక్కడ నిలదొక్కుకోలేకపోయారు. అయితే గత కొంత కాలంగా ఆ స్థానంలో ఆడుతున్న శ్రేయస్ మంచి ప్రదర్శన ఇచ్చాడు. అతని గణాంకాలూ బాగున్నాయి. అయితే అతను గాయపడటంతో వేర్వేరు ఆటగాళ్లతో ప్రయత్నించాల్సి వచ్చింది. కీలక స్థానంలో ఆడే ఆటగాడు గాయపడినప్పుడు మళ్లీ కొత్తగా ప్రయత్నించాల్సి వస్తుంది. నేను కెప్టెన్ కాక ముందు కూడా ఇలాంటి పరిస్థితిని చూశాను' అని రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. జట్టులో ఎవరి స్థానానికీ హామీ ఉండదని... గాయాల నుంచి కోలుకొని వచ్చిన తర్వాత కూడా ఆటగాళ్లు సత్తా చాటాల్సి ఉంటుందని రోహిత్ అన్నాడు. 'రాహుల్, శ్రేయస్ నాలుగు నెలలుగా క్రికెట్ ఆడలేదు. గాయాలు, శస్త్రచికిత్సలు కొనసాగాయి. కోలుకొని వచ్చిన తర్వాత ఎవరికైనా అంత సులువు కాదు. అయితే మీ కోసం స్థానం సిద్ధంగా ఉందని ఎవరికీ చెప్పలేం. చోటు దక్కించుకునేందుకు అందరూ పోటీ పడాల్సిందే. త్వరలో జరిగే సెలక్షన్ కమిటీ సమావేశం కూర్పు విషయంలో చర్చిస్తాం' అని కెప్టెన్ అన్నాడు. ప్రపంచ కప్‌ను ఎవరూ పళ్లెంలో పెట్టి ఇవ్వరని, దాని కోసం చాలా కష్టపడాల్సి ఉంటుందని రోహిత్ అభిప్రాయపడ్డాడు. '2011 నుంచి మేం అందుకోసం శ్రమిస్తున్నాం. ప్రతీ ఐసీసీ టోర్నీ సమయంలో గెలవగలమనే నమ్మకంతోనే బరిలోకి దిగుతాం. ఫలితం రాకపోయినా వచ్చేసారి గెలుస్తామనే నమ్ముతాం. ఏదో ఒక రోజు కప్ అందుకుంటాం కదా' అని ఈ ముంబైకర్ తన భావాన్ని వెల్లడించాడు. తగినంత అనుభవం లేకపోయినా అనూహ్యంగా ఎవరైనా కొత్తవారిని తీసుకోవడంలో తప్పు లేదని, అయితే అది అరుదుగా మాత్రమే సాధ్యమవుతుందని రోహిత్ చెప్పాడు. 2021 టి20 వరల్డ్ కప్‌లో వరుణ్ చక్రవర్తి ఇలాగే జట్టులోకి వచ్చాడన్న రోహిత్... తాజా సంచలనం తిలక్ వర్మపై ప్రశంసలు కురిపించాడు. అతని వయసును బట్టి చూస్తే చాలా పరిణతి కనబరుస్తున్నాడని, ఎలాగైనా పరుగులు సాధించాలనే తపన తిలక్‌లో కనిపిస్తోందన్న రోహిత్... అతనికి వన్డే జట్టులో చోటు కల్పించే విషయంపై మాట్లాడేందుకు నిరాకరించాడు.

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...

- ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీలో నేడు జపాన్‌తో భారత్ సెమీస్ పోరు
- రాత్రి గం. 8:30 నుంచి స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: ఫైనల్ బెర్తే లక్ష్యంగా భారత హాకీ జట్టు సన్నద్ధమైంది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో శుక్రవారం జరిగే సెమీఫైనల్లో హర్మన్‌ప్రీత్ బృందం జపాన్ జట్టుతో తలపడుతుంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఓటమెరుగని భారత జట్టే ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ టోర్నీలో అందరిపై అధిపత్యం కనబరిచింది... గెలిచింది. కానీ ఇలాంటి అజేయమైన భారత్‌ను నిలువరించింది మాత్రం జపానే! లీగ్ దశలో ఇరుజట్ల పోరు 1–1తో డ్రాగా ముగిసింది. ఇప్పుడు నాకౌట్ దశలో జరిగే ఈ పోరులో ఎవరు గెలిస్తే వాళ్లే టైటిల్ ఫేవరెట్ కావడం ఖాయం. గతంలో జపాన్ చేతిలో భారత్‌కు చేదు అనుభవం ఉంది. 2021లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశలో టీమిండియా 6–0తో జపాన్‌ను చిత్తు చేసినప్పటికీ తీరా సెమీస్‌కు వచ్చేసరికి వారి చేతిలో 3–5తో ఓడి ఇంటికొచ్చింది. ఇప్పుడు సమష్టి ఆటతీరుతో బదులు తీర్చుకుంటుందా లేదంటే స్వదేశంలోనూ గత అనుభవాన్నే చవిచూస్తుందా అనేది ఇంకొన్ని గంటల్లో తేలుతుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను 4–0తో చిత్తు చేసి జోరుమీదున్న భారత్ పట్టుదలగా ఆడితే విజయం ఏమంత కష్టం కానేకాదు. మరో సెమీఫైనల్లో మలేసియాతో దక్షిణ కొరియా తలపడుతుంది. 5–6 స్థానాల కోసం పాకిస్తాన్, చైనా జట్లు తలపడతాయి.

'బాయ్' ఎక్స్‌లెన్స్ సెంటర్ కోచ్‌గా ముల్యో హండోయో



న్యూఢిల్లీ: అస్సాం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) గువాహటిలో కొత్తగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఎన్‌సీఈ)ను అధునాతన సౌకర్యాలు, క్రీడా సదుపాయాలతో తీర్చిదిద్దింది. దీనికి హెడ్ కోచ్‌గా ఇండోనేసియాకు చెందిన ప్రఖ్యాత కోచ్ ముల్యో హండోయోను 'బాయ్' నియమించింది. హండోయోకు భారత షట్లర్లతో విజయవంతమైన అనుబంధముంది. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, గురుసాయిదత్ తదితరుల ప్రతిభకు మెరుగులు దిద్ది... చైనా షట్లర్లకు ఎదురునిలిచే నైపుణ్యాన్ని ముల్యోనే నేర్పారు. ఆయన కోచింగ్ హయాంలోనే శ్రీకాంత్ ప్రపంచ నంబర్‌వన్‌గా ఎదిగాడు. అలాగే మరో ఇద్దరు విదేశీ కోచ్‌లను కూడా ఎన్‌సీఈకి నియమించారు. మాజీ ఆల్‌ఇంగ్లండ్ చాంపియన్ ఇవాన్ సొజొనొవ్ (రష్యా) డబుల్స్ కోచ్‌గా, కొరియాకు చెందిన సింధు మాజీ కోచ్ పార్క్ తే సంగ్ కోచ్‌గా వ్యవహరిస్తారు. అస్సాం, బాయ్ ఉమ్మడి భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న ఎన్‌సీఈలో 24 కోర్టులున్నాయి. 3000 మంది ప్రేక్షకులు వీక్షించవచ్చు. శిక్షణపొందే షట్లర్లు, సిబ్బంది కోసం సౌకర్యవంతమైన వసతి గదులు, కసరత్తుకు జిమ్, ఇతరత్రా అధునాతన సదుపాయాలెన్నో ఉన్నాయి. ఈ సెంటర్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తారు.

రెండు నెలల్లో... పెద్ద సంఖ్యలో...

న్యూఢిల్లీ: జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) గత రెండు నెలల్లో పెద్ద సంఖ్యలో డోప్ టెస్టులు నిర్వహించింది. త్వరలో ఆసియా క్రీడలు (చైనా) జరుగనున్న నేపథ్యంలో పతకం కన్నా... భారత్ పరువు నిలిపే ఆటగాళ్లనే అక్కడికి పంపాలనే ఉద్దేశంతో 'నాడా' ఈ టెస్టులు చేసింది. జూన్ 1 నుంచి జూలై ఆఖరు వరకు ఏకంగా 914 రక్త, మూత్ర నమూనాలను సేకరించి పరీక్షించినట్లు 'నాడా' ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో అత్యధికంగా 199 పరీక్షలు ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లవే అని పేర్కొంది. ఆ తర్వాత బాక్సింగ్‌లో 71, అక్వాటిక్స్‌లో 65, వెయిట్‌లిఫ్టింగ్‌లో 56, సైక్లింగ్‌లో 55, కబడ్డీలో 52, రెజ్లింగ్‌లో 46, షూటింగ్‌లో 43 నమూనాలను తీసుకొని పరీక్షించినట్లు తెలిపింది.



సింధుకు క్లిష్టమైన 'డ్రా'

కౌలాలంపూర్: ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క టైటిల్ కూడా నెగ్గలేకపోయిన భారత స్టార్ పీవీ సింధుకు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. ఈనెల 21 నుంచి 27 వరకు డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. దీనికి సంబంధించిన 'డ్రా' కార్యక్రమం గురువారం జరిగింది. మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి సింధు మాత్రమే బరిలో ఉంది. 16వ సీడ్‌గా బరిలోకి దిగనున్న సింధుకు తొలి రౌండ్‌లో 'బై' లభించింది. ఆ తర్వాత సింధుకు ప్రతి రౌండ్‌లో గట్టి ప్రత్యర్థి ఎదురయ్యే అవకాశముంది. రెండో రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)తో సింధు ఆడే చాన్స్ ఉంది. మూడో రౌండ్‌లో మరో ప్రపంచ మాజీ చాంపియన్ ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్) సిద్ధంగా ఉండవచ్చు. ఈ రెండు అడ్డంకులు దాటితే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సెయంగ్ (దక్షిణ కొరియా)తో సింధు ఆడే అవకాశముంది. ఆన్ సెయంగ్‌తో ఇప్పటి వరకు సింధు ఆరుసార్లు ఆడగా ఆరుసార్లూ ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి ప్రణయ్, లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్ బరిలో ఉన్నారు. పురుషుల డబుల్స్‌లో రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీకి... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీకి తొలి రౌండ్‌లో 'బై' లభించింది.



వొజ్నియాకి ఓటమి

మాంట్రియల్: మూడున్నరేళ్ల తర్వాత పునరాగమనం చేసిన డెన్మార్క్ టెన్నిస్ స్టార్ కరోలైన్ వొజ్నియాకి నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 టోర్నీ నుంచి నిష్క్రమించింది. వింబుల్డన్ ఓపెన్ చాంపియన్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో మాజీ నంబర్‌వన్ వొజ్నియాకి 2–6, 5–7తో ఓడిపోయింది.

ఒంటరి మహిళా ప్రయాణికుల కోసం 'ఆపరేషన్ మేరీ సహేలి'

సాక్షి, హైదరాబాద్: మహిళా ప్రయాణికుల భద్రతపై దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేకించి ఒంటరిగా ప్రయాణం చేసే మహిళల రక్షణ కోసం 'ఆపరేషన్ మేరీ సహేలీ' పేరిట ప్రత్యేక రక్షణ బృందాలను ఏర్పాటు చేసింది. దక్షిణమధ్య రైల్వేలోని 20 ప్రధాన స్టేషన్‌లలో ఈ బృందాలను రంగంలోకి దించింది. –సాధారణంగా మహిళలు ఒంటరిగా దూర ప్రయాణాలు చేయవలసి వచ్చినప్పుడు కొంత అభద్రతాభావానికి గురయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి వారికి అన్ని విధాలుగా అండగా ఉండి వారి ప్రయాణం పూర్తయ్యే వరకు

- మహిళల భద్రత కోసం ఆర్పీఎఫ్ ప్రత్యేక సిబ్బంది
- మహిళలతో పాటు రైళ్లలో మేరీ సహేలీ బృందాల ప్రయాణం
- ద.మ.రైల్వేలోని 20 స్టేషన్‌లలో ఏర్పాటు



రక్షణ కల్పించే లక్ష్యంతో మేరీ సహేలీ మహిళా భద్రతా సిబ్బంది ప్రయాణికులతో పాటు రైళ్లలో ప్రయాణం చేస్తారు. ఇందుకోసం మహిళా సిబ్బందికి వివిధ అంశాలలో శిక్షణనిచ్చినట్లు ఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు. మహిళా ప్రయాణికులు రైలు ఎక్కేందుకు, దిగేందుకు సహకరిస్తారు. స్టేషన్ లేఅవుట్‌పైన అవగాహన కల్పిస్తారు. ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పరిష్కరించేందుకు సహాయం చేస్తారు.

ఏయే స్టేషన్లలో ఈ సేవలంటే...

సికింద్రాబాద్ డివిజన్‌లో 5 స్టేషన్లు, హైదరాబాద్ డివిజన్‌లో 2, విజయవాడలో 4, గుంతకల్‌లో 4, గుంటూరులో ఒక స్టేషన్, నాందేడ్‌లో 4 స్టేషన్లలో సహేలీ బృందాలు పని చేస్తున్నట్లు చెప్పారు. 2 నుంచి 24 మంది సభ్యుల బృందానికిమహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ నాయకత్వం వహిస్తారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన 15 రైళ్లతో పాటు, ఇతర జోన్‌లకు చెందిన మరో 35 రైళ్లలో సహేలీ బృందాలు పని చేస్తున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సహేలీ సేవలను ప్రశంసించారు.

పలుమార్గాల్లో నాలుగు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: రద్దీ దృష్ట్యా 4 ప్రత్యేక రెళ్ల నడుపుతామని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ తెలిపారు.

- హైదరాబాద్–బర్హంపూర్ (07447/07448) ట్రైన్ ఈనెల 11న రాత్రి 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30కు బర్హంపూర్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 12న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.20కి హైదరాబాద్ వస్తుంది.
- సికింద్రాబాద్–భువనేశ్వర్ (07058/07059) రైలు 12న సాయంత్రం 3.05 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.30కు భువనేశ్వర్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 13న సాయంత్రం 3.05 గంటలకు బయలుదేరి మరుసటిరోజు 10.30కు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.
- సికింద్రాబాద్–తిరుపతి (07489 /07490) ట్రైన్ 12వతేదీ రాత్రి 10.05 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 9.30కు తిరుపతికి చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో 13న సాయంత్రం 4.35కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.50కి సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- నర్సాపూర్–వికారాబాద్ (07453/07454) రైలు 13న సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కు వికారాబాద్ చేరుకుంటుంది. తిరిగి 14న సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.10కి నర్సాపూర్ చేరుకుంటుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.